
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
2-2-'55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



పొలానికి

—ఫొటో యం బాబూరావు, రాజమండ్రి

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 48
సంచిక 23
2-2-55

Founder : K. NAGESWARA RAO

జయ మాఘ శుద్ధ దశమి బుధవారం

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

నవలా రచన పోటీ

గడువు తేదీ ఫిబ్రవరి 20

ఇటీవల మేము ప్రకటించిన నవలా రచన పోటీలో పాల్గొనుటకు గాను పలువురు రచయితలు గడువు చాలదని తెలుపుతున్నారు. కొందరు వేసవి సెలవు లాఖరువరకు గడువు కావాలని కోరుతున్నారు. కాని అంత జాప్యం చెయ్యడం సాధ్యపడలేదని తెలపడానికి చింతిస్తున్నాము అయితే కొందరి కోరిక ప్రకారము కొద్ది గడువు మాత్రం ఇవ్వగలుగుతున్నాము. కొత్త గడువు తేదీ ఫిబ్రవరి 20 అని గుర్తించవలసిందిగా రచయితలకు మనవి.

—సంపాదకుడు.

విషయానుక్రమణిక



(గతసంచిక తరువాయి)

6

రంగయ్యగారింట్లో ఉదయం పదిగంటలవేళ, కాస్త హడావుడిగా వుంది భోజనాలదగ్గిర తండ్రీ కొడుకులు కూర్చున్నారు వరలక్ష్మమ్మగారు వడ్డిస్తోంది. జయ గడప నానుకుని నిలబడి వుంది కాలేజీకి వెళ్లే తొందరలో ఉభయులూ, గబగబ భోంచేస్తున్నారు

రంగయ్యగారి మొహం కొంచెం జేవురించినట్టున్నది

"ఆ రాసేదేదో తనే రాయకూడదా, దాం తగలేసిన పని, నియ్యాలవారికుర్రాడా, గుమాస్తే రాయాలి" అన్నది వరలక్ష్మమ్మగారు, మజ్జిగపులుసు వడ్డిస్తో

రంగయ్యగారు, భార్యవంక ఎగా దిగా చూశాడు. ఆమె అనేమాట నిజమే .

భార్య చెప్పుకుపోతోంది "రూపాయలూ, రూపాయలూ అని అన్నీ రూపాయల్తో ముడిపడి వుంటే ఎలాగో, ఈ వైశాఖంలో నేనా అమ్మాయిని అత్తారింటికి పంపించాలి. ."అంది ఆమె.

రంగయ్యగారు "ఎలాగు పంపించటం? ఏమైనా మన స్థితిగతుల్ని గురించి కొంచెం ఆలోచించే ఆ మాట అంటున్నావా? వైశాఖమాస మనగా ఎంత? పదిహేను రోజులుంది రూపాయా, రెండు రూపాయలా? వెయ్యి కరుకురూపాయలు కుమ్మరించాల్నే! మొన్న వ్రాసిన ఆ ఖండకావ్యం హక్కులు అమ్మితే రెండు వందలు వచ్చాయి; ఇప్పుడు వ్రాస్తున్న నాటకం అమ్మితే మరో రెండువందలు వస్తాయి; వ్రాయడం మాటలా? వేగులు తెగుతున్నాయి; బుర్ర తిరిగిపోతున్నది; కళ్లజోడు పవర్ మార్చవల్సి వొచ్చేట్టు కన్పిస్తున్నది. వెయ్యిరూపాయలూ, ఎలాగో ఇంకో నాలుగు నెలల వ్యవధిలో పూర్తిచెయ్యాలి. అప్పటికి అమ్మాయిని పంపించగలం" అన్నాడు బాధగా.

సదానందం, అన్నం తినేవాడల్లా తండ్రి మొహం లోకి చూశాడు అప్రయత్నంగా. జీవితభారాన్ని బరువుగా ఈడుస్తూ ఏమాత్రం విశ్రాంతిలేని దౌర్బల్యం కనిపిస్తోంది తండ్రి కళ్ళల్లో. గడప నానుకుని నుల్చున్న జయమొహం చినుకులకి ముందు ఆకాశంలా వుంది.

వరలక్ష్మమ్మగారు. "అవన్నీ ఎవరు కాదన్నారు! ఆడపిల్లను కనటమే పాపం; అదో పెద్దభారం, ఎలాగో వొదుల్చుకోవాలి గదా?" అంది.

జయ మొహం వివర్ణమైంది. అసలు కాపరానికి పోకపోతే ఏం? అనుకుంటోం దామె లోలోపల.

"భారం! సామాన్యమైన భారమా! శ్రీరామచంద్రా! ఆ పరాత్పరుణ్ణైనా తృప్తిపరచగలం గాని, ఈ అల్లుణ్ణి తృప్తిపరచలేము గదా! ఎందు కింత కాంక్ష లేకపోతే సరేసరి; ఇనప్పెట్టెలో లక్ష్మి మూలుగుతోంది గదా! ఇంకెందు కింత ఆశ!" అన్నాడు రంగయ్యగారు, భోజనం ముగించి లేచి

సదానందం, "డబ్బుతో కట్టకట్టుకుని, పొయ్యేరోజున తగలేస్తారు ఆయన్ని! అందుకూ" అన్నాడు మండిపోయి

"అట్లా ఉద్రేకంగా మాట్లాడకురా నాయనా" అంది తల్లి.

"ఉద్రేకంలేదూ వల్లకాడూ లేదూ! ఆ డబ్బుకి—అవసరానికి మించిన డబ్బుకి అంతకంటె ఉపయోగం ఏమిటి? "

"ఎప్పటికప్పుడు లెక్క చూసుకుంటూ సంతోషించటమే. నేను గనక ఇంత డబ్బు పోగుచేశాను గదా అని" అంది జయ, గడప దగ్గిర నిలబడి

"ఎవరేనా గట్టిగా బుద్ధిచెబితే బాగుణ్ను" అన్నాడు సదానందం

"పొరపాటు. సంస్కారం వున్న మనిషికి ఎవరూ చెప్పక్కరలేదు; సంస్కారం లేనివాడికి ఏమి చెప్పినా ప్రయోజనం లేదు. పద, కాలేజీకి" అంటూ తండ్రి దారితీశాడు. సదానందం ఆయనవెంట వెళ్లాడు తలొంచుకుని.

తండ్రీ, అన్నయ్యా వెళ్లగానే, జయ లోపలికి వచ్చి ఎంగిలి కంచాలు తీస్తోంది తల్లి, తమ భోజనాల వ్యవహారం చూస్తోంది. జయ కంచాలు కడుక్కొచ్చిపెట్టి, "అమ్మా, ఈసారి నేను తెనాలి వెళ్ళి, అత్తవారింట్లో బైరాయిస్తాను; వెళ్లగొడ్తారా?" అంది కొంచెం ఉద్రేకంతో.

"ఊరుకోవే తల్లీ, పెద్ద ఆలోచన్లు నీకు. పిట్ట కొద్దీ కూత ఘనం" అంది తల్లి, తనకీ కూతురికీ వడ్డిస్తూ.

కూతురుమొహం కొంచెం బెంగగా వుంది. ఉద్రేకాన్ని బలవంతాన అణచుకోడంవల్ల కాబోలు కళ్ళల్లో తిరిగే నీళ్లని కొంగుతో తుడుచుకుంటూ, "ఆడపిల్లంటే భారం పుట్టంగానే పీక పిసికెయ్యకపోయినావు!" అంది, వెక్కుతో.

"అవాచ్యాలు మాట్లాడకు. మన స్థితినిబట్టి అనుకోవల్సి వచ్చింది గాని, నిన్నన్నా నంటే పిచ్చిపిల్లా? ఏడవకు అదిగో కంది పచ్చడి వేశాను. నీకు ఇష్టంగదూ, కలుపుకో, నెయ్యేస్తాను" అంది తల్లి ప్రేమగా

కూతురు, తల్లిప్రేమ వాత్సల్యాల వెన్నెల సోనల్లో తన దుఃఖం మరిచి, పచ్చడన్నం కలుపుకోసాగింది.

తల్లి, కూతురు అమాయకత్వానికి ఆవేదనపడుతో తింటోంది అన్నం.

కాలేజీకి వెళ్ళిన సదానందం, బైటివరండాల్లో రణగొణధ్వని చేస్తున్న రకరకాల స్టూడెంట్సుతో కలిశాడు వరండా పొడుగునా విద్యార్థులు దిగులూ చింతా లేకండా, రీవిగా లాగుజేబుల్లో చేతులు పెట్టుకుని తిరుగుతున్నారు ఒక్కొక్క లెక్చరర్, మెల్లెక్కి వరండాలోగుండా, విద్యార్థుల వందనా లందుకుంటూ, పరధ్యానంగా లోపలికి పోతున్నారు. సదానందం వరండా ఉత్తరపు చివర, నలుగురు విద్యార్థుల జట్టులో నుల్చుని వాళ్ళతో ఏదో మాట్లాడుతున్నాడు.

"ఆ సీనియర్ క్లాస్ అమ్మాయి ఎవరేమిటిరా?" అని, ఒక బుష్కోట్ ఫ్రెండు ప్రశ్నించాడు, బ్రహ్మానందాన్ని.

బ్రహ్మానందం సదానందంవేపు పరిశీలనగా చూస్తూ, "తాసీల్దార్ గారి అమ్మాయి తెలీదూ?" అన్నాడు.

సదానందం కళ్ళల్లో కొంత ఉద్రేకం లేని ఆసక్తి వొచ్చింది. చెవొగ్గి వింటున్నాడు

"ఏ తాసీల్దారోయ్; నెంబర్ లేని కారులాగా! ఆయనకి పేరు లేదేమిటి?" అని అడిగాడు బుష్కోట్ విద్యార్థి. అతని చంకలో ఓ ఎక్సర్ సైజు నోటుబుక్ మాత్రమే వున్నది. అవసరమైన పుస్తకాలైనా తెచ్చుకోటం, పాఠన్కి లోటనో, మొయ్యలేకనో ఆ వొక్క నోటుబుక్కు తెచ్చుకుంటాడు చదువుమీద తప్ప అన్నిటిమీద విపరీతమైన శ్రద్ధ.

బ్రహ్మానందం చేతిలో పుస్తకాలు సర్దుకుంటూ, "ఆయనేరా, మొన్న సోమవారం, ఆ అమ్మాయితోపాటు కాలేజీకి వచ్చాడు చూడలేదూ? పేరు జనార్దనరావు బాగా వున్నవాడేలే మా యింటిదగ్గిరే వాళ్ళ ఇల్లూనూ. మా నాయనకి బాగా పరిచయస్థుడు గూడా"

"రానీ—మిగతా వివరాలు గూడా అమ్మాయికి—పెళ్ళేమైనా చేశాడా—చేస్తాడా?"

"చెయ్యడు కనీసం ఇప్పట్లో చేసేట్టు లేడు. ఈ అమ్మాయిగాక ఆయన కింకా ఇద్దరు కూతుళ్ళున్నారు; ఈమెకంటే చిన్నవాళ్ళనుకో— వీళ్ళ పెళ్ళిళ్ళయ్యేసరికల్లా ఆస్తి కరిగి, పొట్ట కరుగుతుందిలే తాశీల్దారుకి" అన్నాడు బ్రహ్మానందం కసిగా నలుగురు విద్యార్థులూ వరండా ప్రతిధ్వనించేలా నవ్వారు.

ముచ్చటైన రామ్మలక్కాయలాంటి ఒక అమ్మాయి, మెరిసే సాటిన్‌గుడ్డలు ధరించి, చెప్పులు టకటకలాడిస్తూ వాళ్లపక్కగా వెళ్లింది

బ్రహ్మానందం "అదిగో ఆమె వెళ్తోంది. పేరు శ్యామల.." అన్నాడు

"అవును, ఈమే" అన్నాడు సదానందం వెళ్లే అమ్మాయి వంక రెప్పవాల్చకుండా చూస్తూ.

ఫ్యూన్ గంట కొట్టాడు. విద్యార్థులు తమతమ తరగతుల్లోకి ప్రశాంతంగా సర్దుకుంటున్నారు.

ఒంటిగంటకు జూనియర్ క్లాసులోని సదానందం, ఇంకో గుంపు విద్యార్థులూ క్లాస్‌రూం బైట వరండాలోనిల్చుని మాట్లాడుకుంటున్నారు.

ఒక సందర్భంలో రాజకీయంగా రెండు ప్రత్యర్థి పక్షాలకు చెందినవారు ఒకే వేదికపై ఉపన్యసించటం తటస్థించింది. మొదట ఉపన్యాసం ఆరంభించిన వ్యక్తి చాలాసేపు ప్రసంగించాడు. రెండవవ్యక్తికి విసుగుపుట్టింది. ఇంతలో మొదటివ్యక్తి తన ఆశయాలను వివరిస్తూ, ఇలా చెప్పాడు.

"ఈ వేదికపైనే ఈనాడు నా ప్రక్కన కూర్చున్న మిత్రుడు ఎంతసేపు చెప్పినా ఈతరం ప్రజలగురించే మాట్లాడతాడు. అది చాలదని నాఉద్దేశ్యం. భవిష్యత్తరం వారి సంగతికూడా మనం ఆలోచించాలి..."

ఇంతలో రెండవ వ్యక్తి అందుకున్నాడు. "బహుశా వారు వచ్చివినేదాకా ప్రసంగిస్తూనే ఉంటారని అనుకుంటాను."

బ్రహ్మానందం తనపక్కనే నిల్చునివున్న ఓ యువకునితో "ఏమోయ్, మొన్న నేనో పత్రిక్కి గేయం రాశానన్నావు, కాపీ వుందా? కాస్త చదివి వినిపించు" అన్నాడు.

కవి అన్నవాడికి వినేవారంటూ దొరుకుతేగాని, ఆలస్యమా!

ఆ కవి కుర్రాడు జేబులోనించి ఓ అరదస్తా కాయితాలకట్ట బైటికి తీశాడు.

సదానందం పక్కనున్న ఇంకో కుర్రాడు "అమ్మొబాబోయ్, అన్ని కాయితాలకవిత్వం - ఇప్పుడు వినవల్సిందే - ఎండవేళప్పుడు? నాలిక పిక్కపోతుందేమో!" అన్నాడు మొహం బాధగా పెట్టి. రెండుకనుగుడ్లూ ముక్కుదగ్గిరకి చేర్చి వాణ్ణిచూసి మిగతావాళ్లంతా గొల్లున నవ్వారు

కవి కుర్రాడిమొహం కొంచెం జేవురించింది. నొసలు ముడిచాడు

సదానందం తనపక్కన నిల్చున్నకుర్రాణ్ణి కొంచెం మందలిస్తూ, "వినరాదురా! నువ్వు రాయలేవుసరేగదా, రాసేవాణ్ణి చూస్తేనా సహించలేవేం!" అనేసి, కవివేపు తిరిగి, "నువ్వు చదవోయ్ బ్రదర్.." అని ప్రోత్సహించాడు

బ్రహ్మానందం, ఇంకో ముగ్గురూ వరండాలో బెంచిమీద కూర్చున్నారు నలుగురు నిలబడ్డారు మధ్య కవి నుల్చుని చదవసాగాడు. వడగాలి వీస్తోంది, వరండాదిగువ నిదురగన్నేరుచెట్టు దెయ్యంలా వూగుతోంది కవి కుర్రాడు రెండుగేయాలు చదివాడో లేదో మళ్లీ సదానందం పక్కనున్న విద్యార్థి గోల చెయ్యడం మొదలెట్టాడు. "ఇటువంటి గేయాలు రాసేవాడి ప్రాణాలూ వినేవాడిప్రాణాలూ వృధా వృధా.." అంటూ రాగం తీస్తూ కేరింతలు కొట్టి నవ్వాడు. సదానందం "ఊరుకోరా, పదకొండూ! పొట్టివాడివి నీకేం తెలుసురా!" అని మందలించాడు.

"ఇంక ఈగేయరాజాన్ని. పొరపాటు ఈ గేయసంపుటిని - అర్థ రీము కాయితాల్లో రాసిన ఈ మహాగేయాల్ని వినే వోపిక మనకి లేదంటే లేదు.. పదండి ఈ ప్రమాదంనించి తప్పించుకుని

★ అపస్వరాలు ★

రాండి ముందుకి" అని అరుస్తూ ఆ పొట్టికుర్రాడు 'హోరు'మని గోల చెయ్యసాగాడు.

బ్రహ్మానందం వాణ్ణి వురిమిచూసి "వూరుకోవోయ్," అనేసి "వారసీ! ఇప్పుడు మానెయ్యవోయ్. సాయంకాలం, సదానందం రూంలో చదువుకుందాం" అన్నాడు, కవిని కొంచెం ఊరడిస్తూ.

కవి కుర్రాడి మొహం కందగడ్డలా అయింది. పిలిచి అమర్యాద చెయ్యటం కాదా ఇది!

"పోండిరా, మీకేం తెలుసురా, కవిత్వం సంగతి? ఎంత ఎమోషన్‌తో రాశానో మీకేం తెలుసురా!" అన్నాడు, మూకుమ్మడిగా అందరిమీదికీ విరుచుకుపడుతూ.

పొట్టికుర్రాడికి కోపం వొచ్చింది. "నీకు మహా తెలిసి చచ్చినట్టు అక్కడికి! ఏమిటా కవిత్వం, కాస్త అర్థం ఏడు—వింటాం" అన్నాడు ఉద్రేకంగా

ఒక బుష్‌కోటు విద్యార్థి "అది రాసేవాడికే అర్థం తెలియకపోడం, అందులోవున్న ఓ గొప్ప—తనం" అన్నాడు, 'గొప్ప' అనేమాట నొక్కి పలుకుతూ.

బెల్ మోగింది కుర్రాళ్ళు రభస తగ్గించి, లోపలికి పోయారు

సదానందం, కవి కుర్రాడి భుజంమీద చెయ్యివేసి, లోపలికి తీసుకెళ్ళుతో, "ఇటువంటివాటికి భయపడకురా. అలా రాస్తోవుండు. ఒకప్పటికి మంచివి రాయగలవు" అన్నాడు ప్రోత్సాహం ఇస్తూ. కవి కుర్రాడు సదానందం మాటల్లో మార్దవం గ్రహించి, "నువ్వొక్కడివి మనిషిని అర్థం చేసుకుంటావురా. వీళ్ళంతా వొట్టి దండగ రకం" అన్నాడు.

"అలా అనేయక అన్నీ విను. నిజంగానే సద్విమర్శ అయితే స్వీకరించు. లేదా! చిరునవ్వు నవ్వి, ఓ నమస్కారం పారెయ్యి సరిపోతుంది." అంటూ క్లాసురూంలోకి వెళ్ళాడు సదానందం.

కవి కుర్రాడు, ఆ సలహా గురించి ఆలోచిస్తూ లోపలికి వెళ్ళాడు.

సాయంత్రం సదానందం, బ్రహ్మానందం, కవికుర్రాడు 'వారసి' ఇది అతని 'పెన్ నేం', ముగ్గురూ కొండమీద మండపానికి బయల్దేరారు. గాల్లో కేఫ్‌లో కాఫీ తాగుతోవుంటే," రేడియో పాట హోరుకిబ్బంది మధ్యనించి పొట్టికుర్రాడి కీచుగొంతు వినిపించింది! 'సదా' అని.

సదానందం తిరిగిచూశాడు. "గోపిగాడు లేరా. పదకొండు నెంబరు" అన్నాడు బ్రహ్మానందం.

గోపి పొట్టిగా బక్కపల్చగా వుంటాడు. చదువులోనే గాక అన్ని విషయాల్లోనూ సిసింద్రీ. అతను వీళ్లదగ్గిరికి వొచ్చాడు. రావటం సదానందం దగ్గిర కుర్చీలో కూర్చుని, "ఎక్కడికిరోయ్ గాంగ్ మొత్తం బైల్దేరారు!" అని ప్రశ్నిస్తూ, "వారసి వైపు చూసి, "ఏదిరా, నీ కవిలికట్ట!" అని, వాణ్ణి ఎగాదిగా చూసి, "వచ్చాడ్రా గాడ్! అదిగో లాగూ జేబులోవుండే రామాయణం" అన్నాడు కళ్లు తేలేసి, నాలిక బైటికి పెట్టి.

"వొరే, పదకొండూ, నీపీపు చదునవుతుంది, జాగర్త! వాడి కవిత్వం సంగతెత్తావంటే" అన్నాడు సదానందం కోపంగా.

"వాడికి నీ వకాలత్ ఏమిటోయ్. లంచమేమైనా పెడుతున్నాడేం, వాడి రచన వినేందుకు" అన్నాడు గోపి.

వారసి లేచాడు గోపీని కొట్టటానికి. బ్రహ్మానందం సద్దాడు ఇద్దర్నీ. అంతా కాఫీ ముగించి బైటికి వచ్చారు సదానందం, గోపి భుజం తట్టి, "అన్నీ వెధవకబుర్లాడుతావ్, ఒకనాడూ సిగరెట్టు ఇప్పించవేం?" అన్నాడు.

గోపీ, "పొట్లాడంటే తేలిగ్గావుందే! చూడు తెస్తాను"అంటూ బీడీకొట్టుకువెళ్లి నాలుగు పాసింగ్‌షో సిగరెట్లూ పట్టుకొచ్చి నలుగురికీ ఇచ్చాడు. కవి కొంచెం అయిష్టంగానే పుచ్చుకున్నాడు. అయినా సిగరెట్టు! ఇస్తే వొద్దనడం ఎవరివశం! బ్రహ్మానందం నిప్పుపుల్ల వెలిగించి అందరికీ అందించాడు.

అంతా సిగరెట్లు వెలిగించి పొగ వూదుతూ నడవసాగారు.

సదానందం, అందుకున్నాడు "ఇప్పుడు ఆమండపానికి వెళ్ళి పెందరాళే కొంప చేరటం కుదరదురా, బ్రహ్మం! ఇలా మాయింటికెళ్ళి కూర్చుందాం డాబాగదిలే. గాలీ అదీ బాగానే వొస్తుంది" అన్నాడు.

గోపీ "మీ నాన్న చూసి, బడితె తీసుకురాడు గదా! అసలే కొంచెం ముక్కోపి కూడానూ" అన్నాడు. అతనికి హైస్కూల్లో తెలుగు మేస్టారు రంగయ్యగారే పూర్వం ఆ భీతి ఇంకా పోలేదు.

సదానందం, "ఆ భయం మన కక్కర్లేదులే. ఆయన లోపల పూజామందిరంలో కూర్చుని 'భాగవతం' రాస్తూవుంటారు. అటు సూర్యుడిటు పొడిచినా ఎనిమిదింటిదాకా అక్కణ్ణించి కదిలి ఇవతలకు రారు నాన్నగారు" అని సమాధానపర్చాడు మిత్రుణ్ణి

వారసి సదానందం భుజంమీద చెయ్యేసి, "ఏమిటీ! మీ నాన్నగారు 'భాగవతం' రాస్తున్నారా! చాలా గొప్పగా వుంటుంది!" అని ప్రశంసించాడు.

గోపీ, "ఒరే, మీరు కోప్పడకుండా వుంటే ఒక్క సంగతి అడుగుతా చెబుతారూ?" అని ప్రశ్నించాడు. అందరూ రోడ్డువెంట నడుస్తున్నారు.

"ఏమిటది?" అన్నాడు, బ్రహ్మానందం.

"నాకు తెలీక అడుగుతాను, పోతన్నగారు భాగవతం ఏనాడో రాసేశారు గదా, మళ్ళీ రంగయ్యగారు ఇంత శ్రమపడి దేనికి రాయటం?"

సదానందం "అది ఆయన ఇష్టం నువ్వెవ్వడివిరా అడగటానికి? ఎలకంత వెధవకి అన్నీ కొంటె ఆలోచన్లు" అన్నాడు కోపం నటిస్తూ.

"అదిగో తండ్రిని ఆక్షేపించేసరికి కోపం వచ్చింది అబ్బాయికి నే నడిగిం దెందుకంటే.. " అతను వాక్యం పూర్తిచెయ్యక ముందే, బ్రహ్మానందం అడ్డు వచ్చాడు, "నోరు మూస్తావా, తన్నమన్నావా?" అన్నాడు ఉద్రేకంగా

సదానందం, బ్రహ్మానందాన్ని చెయ్యి పట్టుకని, ఆపాడు. "ఊరుకోరా, వాడికేం తెలుసు, చిన్నసన్నాసి,. ఒరే గోపీ, పెద్దవాళ్ళజోలి మనకొద్దు. వృధాగా మాటలు పెరుగుతాయి. సరదాగా కాలక్షేపం చేద్దామని బైల్దేరి పోట్లాడుకోటం ఏమిటి అసహ్యంగా! పదండి. అదిగో. మా ఇల్లు వొచ్చేసింది"

నలుగురూ సదానందం ఇంట్లో రోడ్డుమీదికి వాకిలి వున్న గదిలోకి వెళ్ళారు.

[ఇంకా వుంది]

పెద్దకథ:

సుశీల

(గతసంచిక తరువాయి)

13

ఆనాడు క్లబ్బుకి వార్షికోత్సవం కావడంవల్ల విందులూ - వినోదాలు కొంత ఘనంగానే యేర్పాటయినై. సభ్యులంతా యెవ్వరికితగిన హోదాలో వారు చేరుకొంటున్నారు అంతకంటే అతిథుల ఆడంబరాలు మరీయెక్కువగా వున్నయ్. వారిని ఆహ్వానించడానికి ఆదరించడానికి నియుక్తులైనవారి హంగామాలు అంతకంటే ఆకర్షణీయంగా వున్నయ్. వారిలోనే కొందరు బాడ్జీలు ధరించి వలంటీర్లుగా పనిచేస్తున్నారు వీధిగేటుదగ్గిర కార్లూ - కార్లూ కుప్పతెప్పలుగా పోగౌతున్నయ్. మైకులపుణ్యమా అంటూ విధీ - విరామంలేని సంగీతంతో మైమరపింపజేస్తూ ఆగంతకుల్ని ఇట్టే ఆకర్షించి పరామర్శించడంలో వాటి పాత్రను అవి నిర్వహించుకొంటున్నయ్. పందిరిక్రింద కోలాహలం మిన్నుముట్టుతోంది కుర్చీలల్లో కిటకిట్లాడే వారందరూ అందరితో మాట్లాడేవాళ్ళే మరి, వినేవారెవరో తెలిసికోవాలనుకుంటే తికమకలు పడాల్సిందే! రంగు రంగుల ఉలిపిరికాయితాల వలిపపుముసుగుల్లో ముద్దరాలి[illegible] మురిపెంతో కులుకుతూ బల్లలమీద బంతులు తీరి కూర్చునై - బర్ఫీ, లడ్డూ, బాదం హల్వా ఇత్యాది ఉపాహార ఖండాలు.

ఇంతవరకూ అందరూ యెవ్వరికోసం నిరీక్షిస్తున్నారో వారు రానేవచ్చారు. ఆనాటి సమావేశానికి అధ్యక్షతవహించాల్సిన ప్రొఫెసర్ హరిహరనాథ శాస్త్రిగారు. ఆనందాతిరేకంతో అందరూ వొక్కసారి ఘొల్లుమన్నప్పటి ఆసముద్రపుఘోష, అంతవరకూ వొకమూల, మేడకు అటు పెడగా నిమ్మకి నీరెత్తినట్టు నిరామయంగా ఆవేశాలు అణచుకొంటూ సంప్రదింపులు జరుపుకునే యిద్దరి హృదయాలకు తాకింది. ఇంకా యిక్కడేవుంటే బాగుండదనుకొన్నారో యేమో.. చక చకా మెల్లదిగి పందిట్లోకిచేరి ఫలాహారాల సందట్లో కలిసిపోయారు.

వారియిద్దర్లో వొకరు జడ్జీగారు, మరొకరు శ్రీనివాసరావుగారు. ప్రస్తుతం వారి సంప్రదింపులకు తావలమైనది తమ బిడ్డల వివాహంసంగతి! ఎవరికి వారు ఎదటివారి దగ్గిర్నుంచి సాధ్యమైనంత యెక్కువ సమాచారం రాబట్టాలనే తలంపులోనే సంప్రదింపులకు దిగారు —

"ఆనాడు మీరన్నట్టు అబ్బాయితో మాట్లాడాల్సిన సంగతులన్నీ వొకతీరానికి వొచ్చినట్టేనా? అన్నాడు జడ్జీగారు శ్రీనివాసరావుగారి అభిజాత్యానికి అదికొంత దెబ్బకొట్టినట్లయింది. తనంతటి వాడు తను, వాడితో సంప్రదించడం వాడు ఊ అనే

ఘట్టి కృష్ణమూర్తి


వరకూ వేచివుండడం తనకెంతనామర్దా. నిజానికిజరిగిందేమిటి?. సుగుణ భూషణుణ్ణి గదమాయించి వొప్పించాడు. ఇప్పుడూ ఆధీమాతోటే సమాధానం చెబుతాడు. ఇలా అన్నాడు. "ఆఁ...అదే వుందిలెండి? నిన్ననేనో మాటవరస కన్నాను. నేను చెప్పడం మావాడు కాదనడమూనా? ఇంకా కుర్రతనం కాదండీ యేదో మారాం చేస్తూవుంటాడు మన పన్లు మనం కానిచ్చుకుపోతే అన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి. మరి మీసంగతి చెప్పారు కాదు?" అంటూ ప్రశ్నార్థకంగా జడ్జీగారి మొహంలోకి చూశాడు రావుగారు. జడ్జీగారు ఉల్లిపడ్డట్టు, పరధ్యానంలోనించి తమాయించుకుంటున్నట్టు వెంటనే యిలాఅనేశారు, "నేనునేది అదికాదు, మీరతనితో చెబితే" అతను స్వయంగా సంప్రదించుకోవాల్సినవి యేవైనా వున్నయ్యన్నాడా? అని. మనకు సంబంధించినంతవరకు మాట్లాడుకోగలం అనుకోండి! తరవాత..." అంటూవుండగా మాటమధ్యలోనే అందుకుని "మీరింకా యేవో గాలిమేడలు కట్టుకుంటున్నట్టున్నారు. మనకు మనం యెవరియిష్టం ప్రకారం చేసుకున్నాం చెప్పండి! మన సంతానానికీ అంతే. అదీగాక వాడికీనాకూ మధ్య స్వపరభేదం యేమిటి? నామాటవాడిది మాత్రంకాదూ?" అన్నాడు రావుగారు.

"అవుననుకోండీ!" అన్నాడు జడ్జీగారు, పొడిగా పెదవులమీదకు నవ్వు తెచ్చుకుంటూ.

"అండీ యేమిటి! అనుకోకతప్పదు" అని ఖచ్చితంగా తెగవేసి చెప్పేధోరణిలో అన్నాడు రావుగారు. ఆయనగారిమొహం చాలా గంభీరంగా వున్నది. తిరిగి రావుగారే అన్నారు "మీమట్టుకు మీరు ఏం చేసుకువచ్చారో చెప్పండి! మీరు అమ్మాయిని, నేను అబ్బాయిని మనవిఅడుగుతూ కూర్చుంటేయుగాలు గడిచిపోతై అయినా మనకామాత్రం యింగితం లేకుండా వ్యవహరిస్తామా? కుర్రతనం, వాళ్ళకేం తెలుస్తుంది?" అంటూ తనలోవున్న నిశ్చయజ్ఞానాన్ని మరొకసారి వెల్లడించిన ఉత్సాహంతో ఉత్తరీయంసర్దుకొని మునిగోళ్ళతో జుట్టుగీరుకున్నాడు రావుగారు - తన లౌకిక జ్ఞానాన్ని వ్యవహారదక్షతను పరీక్షించుతున్నాడా, అనిపించింది జడ్జీగారికి. సూటిగా ఇలా అన్నారు "వాళ్ళకు పసితనం, మనం వ్యవహారదక్షులం అని నేనూ వొప్పుకుంటాను. కాని మొదణ్ణించీ వాళ్ళనలా అట్టే పెట్టలేదుగా, ఇద్దరూ కావలసినంత ప్రపంచజ్ఞానంవున్నవాళ్లు, సాధక బాధకాలు ఆలోచించుకోగల్గినవాళ్లూను. అవునంటారా?"

"అయితే అవుతారు మనకేమిటిలెఖ్ఖ?"

"కనీసం వాళ్ళకు సంబంధించినంతవరకైనా స్వతంత్రంయిస్తే బాగుంటుందేమో అని. మిగతా వ్యవహారానికి సంబంధించిన తర్జన భర్జనలు మనంచూసుకుందాం, పెళ్లిచూపులంటూ వొకటి లాంఛనంగా జరపాల్సినబాధ్యత యేలాగోవున్నదికదా! ఆ అవకాశం యిప్పుడే యేర్పాటుచేస్తే వాళ్ళకూ, మనకూకూడా మనస్సుకు ఉప



ఆవడి కాంగ్రెస్


భారతప్రధాని

★

ఋతురాజ్ ఆఫ్ ఇండియా
(టాగూరు ఇచ్చిన బిరుదు)

★

సామ్యవాది



మహాసభలో

పండిట్ నెహ్రూ

దూరదృష్టిగల భావుకుడు



సౌమ్యవాగి



★ సుశీల ★

శాంతిగా వుంటుంది. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కాగలరనే భావంవచ్చాక చూసుకున్న దారి వేరుమాడండి!" అని జడ్జీగారు నిదానించి రావుగారి వంకచూశాడు

"వేరూ లేదు, మొదల్లేదు ఇవ్వాళకొత్తేమిటి వాళ్ళిద్దరూ యెన్నాళ్ళనించీ చూసుకొంటున్నారు? ఇప్పుడీ స్వయంవరం కాకపోతే పోయింగా!" అన్నాడు తన సహజ ధోరణిలో. జడ్జీగారు ఒక్కక్షణం ఆలోచించినట్లుండి తిరిగి ఇలా అందుకున్నారు -

"పోతుందని కాదు - మనమూ కొంత ముందుకు పోయివ్యవహరిస్తేగాని యిది సానుకూలం కాదేమో అని"

"కావడానికేం అవుతూనే వుంటుంది. పోయి పోయి మరీముందుకు పోతే గోతిలో పడిపోవడం ఖాయం. ఇంక ముందూ - వెనకలు చూసుకోకుండా వ్యవహరించుకు పోదామనే నిశ్చయంతోనే వున్నాను నేను. మీరేమో వుండివుండి నసమొదలెట్టారయిరి! ఇంకా యెలాచచ్చేది" బాగా విసుక్కుంటున్నట్టు కనబడుతున్నాడు రావుగారు.

"అయితే నేనన్నమాటలో అర్థంలేదంటారా?" అచ్ఛంగా జడ్జీలాగే అడిగారాయన.

"అర్థాలూ-పెడర్థాలూ తీస్తూ కూర్చుంటే పుణ్యకాలంకాస్తా దాటిపోతుందని మీకు ఏనాడో చెప్పాను. అయినా మీ అంతట మీరొచ్చి అడిగారుగదా అని ఔనన్నాను వాడితో వాదులాడి వొప్పించి మరీ వచ్చాను. ఇప్పుడేమిటి కాలికివేస్తే వేలికి, వేలికివేస్తే కాలికి మొదలెట్టారు వట్టిలాయరు పేచీలు. నామట్టుకు నాకు సాఫీగా ముక్కుకు సూటిగా నడిపించుకు పోవడమే యిష్టం సుమాండీ!" — ఏమిటీ హెచ్చరిక, అన్నట్టు కళ్ళుపెద్దవిచేసి చూశాడు జడ్జీగారు. ఇలా అన్నాడు.

జ:—" నాకూ అంతే. కాకపోతే మనం చేసే వ్యవహారం యేవీ పొరపులు లేకుండా వుండాలన్నదే నాసిద్ధాంతం. మీరామాత్రం అవకాశంయిచ్చి మనసులుకోగలరనే విశ్వాసంతోనే నాకుగా నేను వచ్చి మిమ్మల్ని అడిగాను. అంతమాత్రంలోనే నేనొక డిక్టేటరుగా వ్యవహరించి వాళ్లను రొష్టు పెట్టడం యెంతమాత్రం వొప్పుకోను సుమాండీ!"

రా —" డిక్టేటరు షిప్పుగాక పెళ్లికూడా ప్రజాస్వామ్యం అతిగించాలంటే యెలా కుదిరేదుస్తుంది? అసలు మీమనసులో మాటేమిటో వొక్కసారి చెప్పెయ్యరాదూ? ఊరికే నానబెట్టి చంపకపోతే"

జ — ముందుచెప్పిన దానికంటే యిప్పుడేమీ చెప్పలేను.

రా — దీనినిబట్టి చూస్తే మీకసలు మీఅమ్మాయిని వొప్పింపగల తాహతు లేదని తోస్తుంది. ఏమంటారు? కోపగించకండి! మన స్నేహాన్ని పురస్కరించుకొని అంటున్నా.

జ — నాకుకోపమెందుకు లేండి! ఇచ్చేవాళ్లు పుచ్చుకునేవాళ్లకు లోకువే గదా! అయినా నేను అమ్మాయికి చెప్పి వొప్పించలేకపోయానని మీరెందుకు అనుకోవాలి.?

రా — మరేమనుకోమంటారు! నిన్నటికీ యివ్వాల్టికీ ధోరణే మార్చేస్తిరి.!

జ — నే నివ్వాళ కొత్తగామార్చిందేమీ లేదు. కాకపోతే చదువుకున్నవాళ్ల అభిరుచులు యెలావుంటయ్యో వాళ్లముఖతః తెలుసుకోవడం మంచిదేమో అని.

రా —వాళ్ల మొహంనించి మనం తెలుసుకునే దేమిటి? అనుకొన్న దనుకున్నట్లు చేసుకుపోతేనే మన ఫాయాకు తగినట్లు జరుగుతుంది వాళ్ల మొహందగ్గర కొచ్చేసరికి యేరిజిష్టరో చేసుకుంటామంటారు. మనం వొప్పుకుంటామా? లేకపోతే కట్నాలూ కానుకలూ అక్కర్లేదు. బిస్కత్తుల దండల్తో చేసుకుంటామంటారు. మనమిద్దరం నోళ్లుతెరేసి ఆకాశంలోకి చూడాలి! అభిరుచులంటే యేమిటో అప్పుడు తెలిసొస్తుందనుకుంటాను మీకు.

జ — కాని, మీరనుకున్నంత వికృతంగా జరుగుతుందని నేను భావించడంలేదు. వచ్చేటప్పుడే అమ్మాయితో మాట్లాడాను. అది వివాహానికి సుముఖంగా లేకపోలేదు.

రా — మరి మావాడంటే యిష్టంలేదంటుందన్నమాట! అందుకే నా స్పష్టంగా వొక్కమాటలో చెప్పెయ్యమన్నాను

జ — అదికాదు. అతనంటే యెందుకనో యింకాకొంత సుముఖభావం యేర్పడాల్సి వున్నది.

రా:—దానిపేరేఅది. మొదట యివ్వన్నీ విచారించకుండానే నాతో రాయబారాలకు వచ్చారన్నమాట! ఆమాత్రం మాట చెల్లించుకోలేని మనిషి యిలాటివి తలపెట్టనే కూడదు. వట్టి పప్పుజారుడు రకం!

జ — దీనిమూలాన మనం నిరుత్సాహపడి మాటపుట్టింపులకు పోవలసిన అవసరం లేదు అదితప్పక ఒరిగి తీరుతుంది. అయితే వాళ్లకు పరస్పరం అంగీకారం కుదిరిన మీదటనే అనికూడ నావిశ్వాసం

రా — మన విశ్వాసాలు నెరవేర వలసి వచ్చేసరికి తరాలు దొర్లిపోతై మీదారి మీరు చూసుకోండనే మాటనే డొంకతిరుగుడుగా వల్లిస్తున్నారన్నమాట! ఇంక ముందు జరగబోయేదానికి నాబాధ్యతఏమీ లేదనిమాత్రం చెబుతున్నాను తరవాతి మీయిష్టం!

జ — అంటే మీఅభిప్రాయం?

రా —ఇందులోఅభిప్రాయాలకేముంది? జడ్జీగారి అమ్మాయి నిన్ను వట్టిచవటకింద కట్టేస్తూంది ఆవిడగారికి నువు అక్కర్లేదట, కనక మనకీ సంబంధమూ అక్కర్లేదని మావాడికి చెప్పేస్తాను

జ — ఎంతసాహసం? నేనన్నమాటకీ మీరనేదానికీ యెక్కడైనా పొంతనకుదురుతుందా?

రా — కుదరకపోతే అదినాతప్పా! అంతా చేతులారా మీరే చేసుకున్నారు అసలీ ఆసపుట్టించిందీ మీరే ఇప్పుడుచేతులారా నిర్మూలించింది మీరే సాహసం యెవ్వరిదో అర్థమౌతూనేవుందిగా!

జ — రావుగారూ! ఇంతచిన్న విషయానికి మీరిలా తొందరపడతారనుకో లేదండీ! సిద్ధాన్నం విస్తట్లో వడ్డించినప్పుడు చింపుకులేచిపోవడం

రా —పెద్దమనిషి లక్షణంకాదంటారు అంతేనా?

జ — నిజంకూడా అంతే మీలాటి పెద్దమనుషుల్తో సంబంధం చెయ్యాలని నేనెంతో వుబలాటపడ్డాను కాని, తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందట!

రా — తలుస్తూనే వుంటుంది మరి! అన్యాయంగా పిల్లల్నిద్దర్నీ ఉసికొల్పి కట్నం కానుకా లేకుండా చెయ్యాలనేకదూ మీ ఉదారబుద్ధి?


జ: — రామరామా-ఎంతమాటన్నారు! నాతల తీసేసినా యింత బాధపడేవాణ్ణి కాదండీ!

రా.—మీరున్యాయమూర్తులు తలలుతీసేయించనూగలరు. అతికించనూగలరు.

జ — ఇన్నాళ్లూ స్నేహంచేసి నన్ను అర్థంచేసుకోలేక పోయినందుకు ఎంతో విచారిస్తున్నాను ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు

రా — లేకపోవడమేమిటి? అంతా మించి పోయింది తిరిగి మావాణ్ణి యీగోదాలో దింపాలనుకోవడంలేదు. వెళ్లగానే చెప్పేస్తాను తరవాత నాబాధ్యతలేదు.

"— అంటూవుండగానే పందిట్లో కోలా



కాలం వినబడింది. ఇద్దరూ క్రిందికి దిగి వచ్చేశారు ——

14

సుగుణభూషణుడు ఇంటికి వస్తూనే అద్దంలో మొహంజూసుకున్నాడు. ఎదలో మెదిలే భావాల బరువులు, కదిలే పిల్లగాలుల ఉల్లాసంతో వదలలేని యేదో సంస్కారాన్ని యోగాగోముఖంలో ప్రతిబింబింపజేస్తాయనే సత్యం ఆక్షణంలో అతడు అనుభూతికి తెచ్చుకున్నాడు. తనను జూసితానే నవ్వుకున్నాడు. సృష్టివైచిత్ర్యానికి ముగ్ధుడై తన ప్రజ్ఞను తానే అభినందించుకున్న బ్రహ్మదేవుని భావవైచిత్రిలోగల పరమార్థం యేమిటో అర్థమయిందతనికి. ఆశించిన ఫలితం అనుకున్న మార్గంలో అందుబాటులోకి వచ్చిందనే తృప్తివల్లనోయేమో... యేదో వొకమధురభావం ఆవేశించి నిలువెల్లావ్యాపించినట్లు హృదయం ఉప్పొంగి ఉత్తుంగతరంగితమైన మహార్ణవంలా అవధి దాటక ఉన్నంతలో ఉబికి ఉత్తేజాన్ని కల్గిస్తున్నది మరొక్కసారి మొహంజూసుకుని అమ్మయ్య . అనుకున్నాడు. గుండీలు విప్పి గుండెల్లో తడుముకుని విశ్రాంతిగా వూపిరిపీల్చుకున్నాడు. ప్రక్కనేవున్న వాలుకుర్చీలో మేనువాల్చి గడచినక్షణాల చల్లని సంచలనాన్ని నెమరుకు తెచ్చుకోసాగాడు.

సుశీల - బాగానేవుంది పేరు అంతకంటే లలితంగా వున్నదంటే బాగుంటుందేమో అయినా, లాలిత్యము, లావణ్యము అనేవి మనుష్యుల్లో వుంటయ్ గానీ, పేర్లలో యేమున్నది? లేకపోవడమేమిటి? అవిరెండూ పరస్పరం ఆశ్రయించుకునే వుంటయ్యనుకుంటే నిజానికి దూరంకాదేమో ... తనకెందుకనో యీక్షణంలో హాయిగావున్నది జీవితంలో యెన్నడైనా యిలాటి ఘడియలు గడచి వుంటయ్యా? ఏమో తనకు తెలియదు. అమ్మవొడిలో పడుకుని కమ్మగా పాలు త్రాగుతూ కాళ్లుఆడించుకొనేటప్పుడు ఏమైనా తనకిలాంటి నిశ్చలానందం కలిగిందేమో యెరగడు. అయినా యిన్నిమార్లు వచ్చే ఆనందానికి విలువ ఉండదు. బుద్ధి తెలిసిన తరవాత జీవితంలో అందరికీ వొక్కసారి వచ్చిన ఆనందమే అమూల్యమైనది. అదియెందుకు వస్తుందో తనకిప్పుడు తెలిసింది.—— సుశీలకూ తనకూ వున్న సంబంధం యేమిటో యెలాటిదో కూడా యిప్పుడే అర్థమయ్యింది అంతకంటే ఆమె తన కర్థమయేలాచేసిందంటే బాగుండదూ? బలమైన ఏదోవొక సంఘటన జరిగితేగాని మనుషుల మనసుల్లో వున్న కొన్ని పొరలు విడిపోవు అది తనపట్ల నిజమయింది. దానికి కొంత సాహసంకూడా తోడ్పడిందేమో . అయినా ఆపాటి సాహసం అవసరమనే అనుకుంటాడు తను. ఆత్మవిశ్వాసం వున్నవారు ఎలా సాహసించినా సాఫల్యం అందుకోగలరు. తనకా నమ్మకంలేకపోవడం వల్లనే ముందుగా కొంత గిజగిజలాడాడు. నిజానికి అది వర్షం పడబోయేముందరి ఉక్కపోతలా వున్నది అంతే

తనలోవున్న విశ్వాసాలు, సంస్కారము ఒక రూపానికి రాకపోవడం మూలానే ఉదయం కాలేజీకి పోయేటప్పుడు అంత బాధ పడ్డాడు. ఏదైనా ఆలంబనం లేనిదే అల్లుకోవడం జరగదుగదా! తను అల్లుకోవాలనుకుంటున్న ఆశాలతకు సుశీలయే ఆలంబనమౌతుందని ఆ క్షణానే తనకు తోచింది. అది యధార్థమా, కాదా? అని తేల్చుకోవడానికి చేసిన ప్రయత్నమే యీబాధ

అన్నిటికంటే ముందామె దర్శనం కాంక్షించాడు తను. అదికాకపోవడంతో నిర్విణ్ణుడై తిరిగి వచ్చాడు. కాని తనలో దాగివున్న ఆశాలేశం ఉత్సాహంతో కూడిన సాహసాన్ని రేకెత్తించింది; కర్తవ్యాన్ని ప్రబోధించింది. ఏదితను కావాలనుకున్నాడో ఆదిక్కుకే నడిచాడు.

సుశీల కనబడింది! సరాసరి కళ్లకు ఎదురుగానే నిలబడివుంది. ఆమెనుచూసి తను ఆగిపోలేదు మరింత వేగంతో ముందుకు నడిచాడు ఏదోశక్తి తన నాకర్షిస్తున్నట్టు అప్రయత్నంగా లాగబడ్డాడు. విద్యుత్తరంగాలు నరనరాల్లోను వ్యాపించి, విజృంభించి- ఉవ్వెత్తున విసిరికొట్టినట్లు త్రోసుకు వచ్చి పడ్డాడు. నిశ్చలంగా అలాగే నిలబడి చూస్తున్నది సుశీల తనలోని స్థైర్యాన్ని తుదకంటా పరీక్షిస్తున్నదా, అనిపించింది మొదట కాని తనలోలాగే ఆమెలోనూ యేదోకొంత సాహసం సహజంగానే పొటమరించి వుంటుందని సమాధానం చెప్పుకున్నాడు. ఒక్క క్షణం సేపు మౌనంగా ఆమె యెదట నిలబడ్డాడు. కాని కళ్లు వెతుక్కుంటూనే వున్నయ్.

కాలేజీలో కనబడే సుశీలకూ యీమెకూ చాలా తేడా వున్నది. ఈమెలో దైన్యం మూర్తీభవించినట్లున్నది ఆశ్చర్యంతో విప్పారిన ఆమెకళ్లలో జీవితపు లోతుల్లోని మిలమిలలు మెరిసేతారల్లాగా తన హృదయాకాశపు సీమల్ని తాకుతున్నయ్ అణగివున్న వాంఛయేదో సన్నని కాంతికిరణంలా సూటిగా తన కళ్లల్లోకి పొడుస్తున్నట్లున్నది. అక్షరాలెరుగని మూగభావంలో మనసులు మాట్లాడుకొని పరిష్కారంకోసం పరితపించినట్లయింది. మరోక్షణానికి ఆమె కదిలి కిటికీకి చేరగిలబడి భీతహరిణాంగనలా బెదురుచూపులు చూసింది. తనకూ జాలివేసింది. అది ఆమెలోని శైశవమా? బలహీనతా? ఏదైవుంటుంది? ఈరెండూకాదేమో... బలమైన భావావేశం అయివుంటుంది. ఆమెకు తనెలా కనబడుతున్నాడో, తనకు ఆమెకూడా అంతే. దేని పరిష్కారానికై ఉదయం అంతగా మథనపడ్డాడో, అది కొంతవరకూ తీరినట్లయింది. దానికి సమాధానం యెవ్వరు చెప్పాలి? సుశీల సహజంగా చెప్పలేకపోవచ్చు, అణచుకోలేని ఆవేశం ఆమెను మైమరపింప జేసివుండవచ్చు. అన్నీ అర్థం చేసుకుని మసులుకోగల తాహతు కలవాడు తనే కనక ముందుగా పూనుకున్నాడు.—— ఏమనిపిలవాలి? అని కొద్దిక్షణాలు పెదవికొరికి ఆలోచించాడు. సహజమైన లాలిత్యపు సొబగులతో సొంపు గొలిపే మూడక్షరాల ముద్దుపేరుతోనే పిలవాలనుకున్నాడు అనుకున్నదే తడవుగా పెదవి కదిలిరానే వచ్చింది "సుశీలా" అని ఆమెకళ్లల్లోకి సూటిగా చూశాడు. ఎర్రగా పల్చగావున్న ఆమె పెదవులపై హాసరేఖ మెరియడంతో హృదయం చల్లబడింది. చెప్పాలనుకున్నదంతా నాలుక చివరికొచ్చేసింది

దాచుకోవలసినదీ, మాయజేసి మభ్యపెట్టవలసినదీ యేదీలేదు. అందుకే యింత వరకూఅతిపదిలంగా కాపాడుకుంటూ వచ్చిన తన జన్మరహస్యంతోపాటు అన్నీ చెప్పెయ్యాలనుకున్నాడు సుశీలను చూసింతరవాతనే తనకీ నిర్ణయం కలిగింది అవును, నిజమే - ఈనాడు ఏదో వొక స్వార్థాన్ని పురస్కరించుకొని కొన్ని రహస్యాలు దాచివుంచితే తను ఎవర్ని మోసగించినట్టు? ఆమెనా! కాదు, తననే - ఎవరి సాహచర్యంతో జీవితంలో యెడనెడా సంభవించగల వొడుదుడుకుల్ని యెదుర్కొని సాఫీగా సాగిపోవాలని అడుగు వెయ్యబోతున్నాడో ఆవ్యక్తికూడా తనలాగే అనుకోవాలంటే ఆమెయెదట అభివ్యక్తం కావలసినవి మాయలూ - మర్మాలూ కావు. పవిత్రమైన హృదయం, నిష్కల్మషమైన మనస్సూను. మరి తనవంటి విశాలభావన ఆవ్యక్తికీవున్నదని యెలా తెల్సుకోవడం? ఆమెకళ్ళల్లో కనబడిన మిలమిల నీలిమలే అందుకు తార్కాణం. కాకపోతే ఆమె మొహంలో అంతటిదైన్యం, హృదయాన్ని పట్టియివ్వగల కరుణాపూరితమైన ఆచూపులు తను చూడలేదు. ఏమైనా తన హృదయం విప్పినప్పుడుగదా యెదటిది స్పందించేది? అనే భావసంఘర్షణలోనే కిటికీదగ్గరగావచ్చి మరొక్కసారి 'సుశీలా' అని పిల్చాడు. ఆమె పెదవులపై చిందులాడిన చిరునవ్వే తన అభ్యర్థనకు అనుజ్ఞ యిచ్చినట్లయింది. చెప్పడం మొదలుపెట్టాడు.

తను కొత్తగాజీవితంలో అడుగుపెట్టాలనే ఆవేశంకలవాడుకనక మాటలుకూడా అందుకు

★ సుశీల ★

తగినట్లుగానే నటించిపోతున్నే. ఒకొక్కప్పుడు వాస్తవాన్ని గమనించక కేవలం ఆదర్శవాదిగానే మాట్లాడుకుపోతున్నానా అన్నంత అనుమానం కలిగింది. కాని సుశీల అలా అనుకున్నట్లు కనబడకపోవడంతో ముందుకు సాగాడు. అయితే ఆమెనించి తను తెల్సుకోవా లనుకున్నది బహుస్వల్పం. తను చెప్పేనదానికి వొప్పుకుంటుందా, లేదా అనేదే సమస్య. అప్పుడుగాని తనకా వ్యక్తిపై ఒకవిధమైన గౌరవభావము, విలువ యేర్పడవు. సుశీలలా పెరిగినవారు వ్యక్తుల విలువలు గ్రహించలేరు. వారు కేవలం ఆర్థిక కారణాల ఆడంబరాలకు మాత్రమే వశీభూతులై వుంటారనిగదా యిన్నాళ్లూ తన నిర్ణయం? అది మారాలంటే సుశీల తను చెప్పింది వొప్పుకోవాలి! అప్పుడు గాని వారి మనసుల్లో వున్న యాంత్రికభావాలు సాంతం అడుగంటిపోవు. అందుకని వారిలో వున్న మానవత్వాన్ని మేల్కొల్పి ఆవేశాన్ని రెచ్చగొట్టాలి! వీట్లల్లో యేది అణగి మరేది తలయెత్తుతుందో తనప్పుడు గ్రహించాలి. దానికి తగినట్లుగానే తను మాట్లాడుకుపోతున్నాడు.

కాలేజీ జీవితంనించి కడపటి సంఘటన వరకూ అన్నీ చెప్పాడు. అప్పట్లో ఆమెను గురించి తానేమనుకొన్నది, ఆమె తనను గురించి యెలా అనుకోవడానికి అవకాశం వుండేదికూడా వివరించి, 'ఏమంటావ్?' అని ఆమెను ప్రశ్నించాడు 'అవున'న్నది సుశీల 'ఇప్పుడూ అంతేనా' అన్నాడు. 'కాదు' అన్నది. ఆమాత్రం ఆసరాజూసుకుని ప్రస్తుతపు తనభావాలేమిటో వివరించి చెప్పాడు. 'అయితే యిదివరకటిభావాలు మార్చుకోడానికి నువ్వు సిద్ధమేనా?' అని సూటిగా అడగటంతో ముందుగా కొంత ఉక్కిరిబిక్కిరయినట్టయింది సుశీలకు తరవాత తమాయించుకుని 'అవును సిద్ధమే' అని జవాబిచ్చింది. మనసు కొంత కుదటబడింది "లోకాపవాదుకి భీతిల్లక నీతో వొకవిషయంగురించి చర్చించాలని వచ్చాను ఏమంటావ్?" అన్నాడతను. ఆమె జాలిగా చూసింది. 'ఆమెను ఆలంబనంగా తీసుకుని తనలోభావాల్ని యెలా రెచ్చగొట్టారో, అందుకు తనెంతటి బాధతో యిక్కడికి వచ్చాడో ఉన్నదున్నట్టు బైట పెట్టాడు

"అవును నాకూ అలాగే చెప్పారు" అన్నది సుశీల "వారికి యేమని సమాధానం చెప్పావ్?" అనడిగాడతను "అచ్ఛంగా యీ మాటలే నాన్నగారితో చెప్పా"నన్నది సుశీల. తనతో చెప్పగలిగినంతటి సాహసం వుండి వుండకపోవచ్చు అనుకున్నాడు. "మన హోదాకు తగినవాళ్ళు. తప్పక వొప్పుకోవా లన్నాడు నాన్న" అన్నది తనంతట తానే వారి మనస్తత్వాన్నిబట్టి అది నిజమే కావచ్చు కాని, తను ఏ మానవత్వాన్ని ఆధారంగాగొని కొన్ని నిర్ణయాలు చేసుకోవా లనుకుంటున్నాడో అది కొంత లోపించుతున్నట్టు తోచింది. ఈ హోదాలు, పదవులు అనేవి కాలం తీర్పుకి కట్టుబడి స్థాయి తప్పుతూ వుంటయ్ ఆ కాలమే మానవత్వానికి మెరుగులు దిద్దుతుంది. అందుకని తననుగురించిన అసలు రహస్యం బైటపెట్టి, ఆమె నిశ్చయంలో యధార్థం యెంత వున్నదో పరీక్షించి తెల్సుకోవాలనుకున్నాడు 'అయితే నేనొక రహస్యం చెప్తాను వింటావా?' అన్నాడు తను. 'ఏమిటది?' అన్నట్లు కళ్ళు పెద్దవి చేసి చూసింది సుశీల అనుకున్నదంతా చెప్పనే చెప్పాడు. 'తనకు బాల్యంలోనే తల్లిదండ్రుల వియోగం, తరవాత శ్రీనివాసరావు గారితో కలిగిన సంబంధం— అంతా మౌనంగానే విన్నది సుశీల. మరొక్క రహస్యం కూడా చెప్పాలన్నాడు. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం రెట్టింపయింది. ఆర్థిక విలువలకు సంబంధించినంత వరకు తన బ్రతుకంతా పరాధీనమన్నాడు స్వశక్తిపై సొంత కాళ్లమీద నిలబడగలిగే వరకూ తనకేమీ హోదా లేదన్నాడు. ఈ రహస్యం బైటపెట్టినట్టు తెలిస్తే రావుగారి దగ్గర్నుంచి తన కొక దమ్మిడీ కూడా దక్కదన్నాడు. 'మరేమంటావ్?' అన్నట్టు ఆమె మొహంలోకి చూశాడు 'మంత్రగాడి యెదట వున్న తాచుపాములా తల దించేసింది సుశీల. తన సిద్ధాంతాల నాగస్వరపు నొక్కుల్లో తిరిగి మేల్కొల్పాడు. కాని ఆశించిన సమాధానం అందలేదు. తను నిరుత్సాహం పొందలేదు, కాని ఆలోచించుకోవడానికి ఆమెకు కొంత అవకాశం యివ్వాలన్న తలంపుతో వెళ్లిపోతున్నాడు. వెనకనించి 'సుగుణా!' అన్న పిలుపు వినబడింది అది పిలుపు అనేకంటే హృదయం చీల్చుకువచ్చిన 'అంతర్నాదం' అనడం బాగుంటుందేమో. తను ఇన్నాళ్లూ పడిన ఆవేదన అంతా ఆ పిలుపుకోసమే. అడుగులు వేసుకుంటూ అటే వెళ్ళాడు. "అయితే నేను వొప్పుకున్నాను" అన్నది సుశీల అదే ఆమె జీవితం గురించి చేసుకొన్న దృఢనిశ్చయం తనకు కావలసిందీ అదే ఆమెకూ తనకూ వున్న సంబంధ మేమిటో స్థిరపడిపోయింది! ఇంక యెవరడ్డినా అది సడలిపోవడం కల్ల మానవత్వాన్ని పురస్కరించుకొన్న విలువలు మనుష్ని యెంతటి ఔన్నత్యానికి తీసుకుపోగలవో ... అనుకుంటూ తన నిశ్చయాన్ని ఆమెకు మరొకసారి తెల్పి అక్కణ్ణించి తిరిగి వచ్చేశాడు.

15

సుగుణభూషణుడు కుర్చీలోనుంచి లేవబోతూవుండగానే చరాల్ని తలుపు తోసుకుని గదిలో అడుగుపెట్టాడు రావుగారు. ఆయన అంత తీవ్రతలో రావడం అతడెన్నడూ చూడకపోవడంతో ముందు కొంచెంగా కలవరపడినా తరవాత తమాయించుకుని ప్రక్కకు తొలిగి డ్రాయరుకు ఆనుకొని నిల్చున్నాడు. అప్పటికి రాత్రి కొంచెం పొద్దే పోయింది అయినా అతడు రాగానే యింట్లో యెవ్వరున్నారో లేరో తెల్సుకోకుండానే సరాసరి గదిలోకి వెళ్ళిపోయాడు మధురస్మృతులబరువుల్లో మునిగిపోయాడు.

చూస్తే రావుగారు ఇంట్లోనించి కాక యెక్కణ్నించో యెవ్వరితోనో వాదులాడి పంతం నెగ్గించుకునేధోరణిలో యిక్కడికి తిరిగివచ్చినట్టున్నారు కొంత సూక్ష్మంగా పరిశీలించినతరవాతఅతడూహించుకున్నదది. ఏదో ప్రత్యేకమైనపని వుంటేగాని తను ముందుగా మాట్లాడే అలవాటు లేదు. బల్లపై వున్న యేదో పుస్తకం దులిపి షెల్ఫులో పెట్టబోతూ వుండగా వెనకనించి గద్దించినట్టుగా యిలా అన్నారు రావుగారు, "జడ్జీగారి సంబంధంగురించి యేమాలోచించావోయ్?" అని

'ఇదేమిప్రశ్న' అన్నట్టు ఆశ్చర్యంతో ఆయన మొహంలోకి తేరిపారజూశాడు సుగుణభూషణుడు. వెంటనే తల దించేసుకుని పుస్తకంలోని పేజీలు తిప్పుతూ యిలా సమాధాన మిచ్చాడు.

"నిన్ననుమీతో చెప్పేశానుగా, వొప్పుకుంటానని. అయినా ఆ సంగతి యిప్పుడెందుకు? . అని రావుగారి మొహంలోని తీవ్రత మరింత హెచ్చింది.

"లాభం లేదు అయిందేదో అయిపోయింది ఇప్పుడు నీ నిర్ణయం మార్చుకోవాలి! ఆ సంబంధం ఖాయమవడానికి యేంతమాత్రం వీల్లేదు" అనడంతో కొరడ్తాతో కొట్టినట్టయింది సుగుణభూషణుడికి. అదిరిపడి ఆయనవంక జూశాడు. ఇలా యెందుకు అంటున్నాడో అర్థం కాలేదు కొద్దిక్షణాలకుగాని అతను తేరుకోలేదు అసలు సంగతి యేమిటో తెలుసుకుందామని నిదానంగానే అడిగాడు "మీ రిప్పుడు ఇలా యెందుకు అంటున్నారో నా కర్థం కావడంలేదు మీ సలహాపైనే నిన్నను వొప్పుకున్నాను మరి యివ్వాళ మీ రే వద్దనడానికి కారణం యేమిటో కూడా బోధపడ్డంలేదు" అని— "కారణాలు చాలా వున్నయ్ అయినా నీకనవసరం ఈ సంబంధం వొప్పుకోడానికి మాత్రం వీల్లేదు జడ్జీగారు మనల్ని నిలువునా మోసం చెయ్యాలని చూశాడు" అన్నాడు రావుగారు "మోసం" అనే మాట వినేసరికి అతని అభిమానం దెబ్బతిన్నట్టయింది. "ఏమిటది?" అని వెంటనే అడిగాడు

"ఏమున్నది? నిన్నటికీ యివ్వాల్టికీ ఆయన ధోరణే మారిపోయింది ఏదో నెపంతో పిల్లల్ని ఉసికొల్పి, వాళ్లిద్దరూ యిష్టపడ్డారని వంకబెట్టి కట్నాలూ, కానుకలూ లేకుండా చేసెయ్యాలని చూస్తున్నాడు. అందుకు నేను వొప్పుకోలేదు నువ్వూ వొప్పుకోకూడదు రేపీపాటికి దీని తాతలాంటి మరో సంబంధం వస్తుంది" అన్నారాయన. అదా కారణం, అన్నట్టు తలపంకించాడు సుగుణభూషణుడు. రెప్పపాటు కాలం ఆలోచించినట్టున్నాడు తేరదించినట్టు అంతా అర్థమయింది తండ్రిది కేవలం ఆవేశం మాత్రమేనని ఆలోచన కొంచెమైనా లేదని గ్రహించుకున్నాడు— "అయితే జడ్జీగారన్నమాట బాగానే వున్నదిగా" అని సాగదీశాడు వ్యవహారం మాటాడే ధోరణిలో అది ఆయనగారి ఆవేశాన్నికి యింధనం జతచేసినట్లయింది; యిలా రగిలింది. "అది వట్టి చవకబారు నిర్ణయమని చెప్పేశాను ఇంక బాగోగులమాట విచారించేది సున్న. ఇటువంటి పద్ధతులు నాకసలు నచ్చవు వెకిలి మనుషులూ, వెకిలి వేషాలూను" అన్నాడు, చీదరించుకుంటున్నట్టు మాటలధోరణి మార్చి తన నిర్ణయమేదో వొక్క ముక్కలోనే చెప్పెయ్యాలని యిలా అన్నాడు సుగుణభూషణుడు "అయినా నేనెందుకు వొప్పుకుంటున్నాను అన్ని వొకతీరానికి వొచ్చేశాక ఇప్పుడు కాదనడం నావల్లకాదు. నమ్మించి వాగ్దానం చెయ్యడం కూడా జరిగింది. ఇప్పుడు కాదనడం ప్రమాదం క్షమించండి నేనే ముందు సాహసించాను. నేను వొప్పుకుంటున్నట్టు జడ్జీగారి అమ్మాయితో చెప్పేశాను" అంటూవుండగానే, "ఛీ ఏమిటి నీమాటలు?" అంటూ కసిరికొట్టాడు రావుగారు అతడు వెనకాడక అంతా చెప్పేశాడు "అవును నిజమే మొదట్లో నాకూ యిష్టంలేదు అందుకనే ఆనాడు మీతో అలా చెప్పాను కాని యీవిషయంలో మాత్రం తప్పక వొప్పుకు తీరాలని మీరన్న తరవాత కాదనలేక 'సరే' అన్నాను. మీ మాటకు భయపడి ఏంజెయ్యాలో తోచక నా పరిస్థితి చెప్పి ఆమెనే అడిగి తేల్చుకోవాలని వెళ్లాను వొప్పుకున్నది సుశీల. ఇప్పుడు కాదంటే, ఆగేదేమీ, లేదు రావుగారు ఆగ్రహంతో గుర్లురిమి చూశారు వ్యవహారం తలకుమించిపోతోందనేకక్షు ఆయన కళ్లల్లో స్ఫురిస్తోంది "ముర్ఖ నీ పెత్తనమేమిటి బోడిపెత్తనం? కాదన్నదల్లా ఔవునవమేనా తెలివి? నా యిష్టంలేకుండా యీసంబంధం చేసుకుంటే నా ఆస్తిలో దమ్మిడీకూడా దక్కదని తెలుసా?" అని గర్జించాడు సుగుణభూషణుడిలో ఉద్రేకం లేదు మరింతశాంతంగా చెప్పుకుపోతున్నాడు

"అదొక్కటేగా మీ చేతిలో వజ్రాయుధం? అయినా ఫరవాలేదు మీదయవల్ల నా బ్రతుకు నేను బ్రతగ్గలస్థితిలోకి వచ్చాను ఈ సంగతీ ఆమెకు చెప్పేశాను. నాజన్మరహస్యం చెప్పాకె అంతా ఆలోచించుకుని వొప్పుకున్నది సుశీల నాకు భోగభాగ్యాలు లేవని, నాజీవితానికి ఆర్థికపు విలువలేదని చెప్పాకే వొప్పుకున్నాం ఇప్పుడు కాదంటే ఆగిపోయేదేమీలేదు అనవసరంగా మాలో లేనిపోని ఆశలు రగిల్చి కోర్కెలు రెచ్చగొట్టి అవన్నీ వొకతీరానికి తెచ్చుకున్నాక కాదనడంలోని ఔచిత్యం మీకే తెలుసు సుగుణభూషణుడు చెప్పడం మానేశాడు; రావుగారు అణచుకోలేని ఆవేశంతో అటూ యిటూ తిరుగుతున్నారు

ఎవరో వొక వ్యక్తి కొంకికర్ర చేతబట్టుకుని మెల్లగా అడుగులువేసుకుంటూ మెట్లు యెక్కి గదిగుమ్మంలో అడుగుపెట్టడం, మునిముసి నవ్వుల ముసుగుల చాటునించి మెత్తని మాటల మూటలు విప్పడం వొక్కసారే జరిగింది—"విన్నాను అంతా విన్నాను. టీపార్టీ కాగానే అమ్మాయికి యేదో చెప్పాలని యింటికి వచ్చాను కాని అదే నాకు చెప్పింది జరిగిందంతా చెప్పింది. పిల్లల యిష్టమే నా యిష్టం ఇప్పటికీ నాది అదే మాట, చాలా గొప్ప రహస్యం దాచిపెట్టారు బావగారు!" అంటూ ఆయనవంక అదోలా నవ్వుతూ చూశారు. రావుగారి సమాధానం అపేక్షించకుండానే తిరిగి యిలా అన్నారు జడ్జీగారు. మిగతా వ్యవహారాలు మనం మాట్లాడుకుందాం, అమాయికపు పని మనస్సుల్ని బాధపెట్టడమెందుకూ? రేపు కలుసుకుంటాను. మరి శెలవు!' అని కదలబోతూ సుగుణభూషణుడివంక చూసి, 'వెళ్ళొస్తా నాయనా!' అన్నారు. ప్రతివచనంగా అతని పెదవులపై చిరునవ్వు మాత్రం మెరిసింది. వెళ్లిపోతున్న జడ్జీగారివంక తీక్షణంగా చూసి చకచకా లోపలికి వెళ్లిపోయాడు రావుగారు.

(అయిపోయింది)

సినిమా చాలా బావుంటుందని చెప్పి అతడు తన స్నేహితుణ్ణి తీసుకొనివెళ్లాడు. స్నేహితుడు సినిమా చూస్తున్నంతసేపు ఏమీ బాగా లేదని నసుగుతూనే ఉన్నాడు. అతడు ఎలాగయినా స్నేహితుని సమాధాన పరచాలని ప్రయత్నించ సాగాడు.

"అనుకున్నంత బాగా లేకపోయినా, మొత్తంమీద బాగానే ఉన్నది ఈమధ్యన ఎప్పుడూ ఇలాంటి పిక్చరు రాలేదు. మొత్తానికి సినిమాపరిశ్రమ అభివృద్ధి పొందుతున్నదనే చెప్పవచ్చు"

"అవునవును. మొదటి రోజుల్లో బొమ్మలు ఊరికె కదుల్తూ ఉండేవి. ఆ తరువాత మాట్లాడటం కూడా ఆరంభమైంది. ఇప్పుడు ఈసినిమాల్తో వాసన వెయ్యటం కూడా ఆరంభం కాబోతున్నట్లున్నది"



గృహోన్ముఖులు

చిత్రకారుడు: ఎ. వి. ఎస్ ఆర్ జోస్యులు—గుంటూరు.

మాలో మేం - ఆంధ్రులం

అంగర సూర్యారావు

ఒకటవ దృశ్యం.

[ఒక పత్రిక కార్యాలయం. ఉదయం 9 గంటలు. విశాలమైన హాలు. టేబిలు ముందు కుర్చీలో సంపాదకుడు పుల్లేశ్వర రావు కూర్చుని రాసుకుంటూ వుంటాడు. వయస్సు 40 సంవత్సరాలు, లాల్చీ, పరాయి వేసుకొని వుంటాడు. హాలులో వరుసగా మూడు కుర్చీలు ఖాళీగా వుంటాయి కుడివైపునుండి పిచ్చేశ్వర్రావు ప్రవేశిస్తాడు. వయస్సు 30 సం॥ లోపు. ఫుల్ పాంట్, షర్టు, సన్నగా కత్తిరించిన చిన్న కోరమీసం అతని ముఖానికి వింత సోయగం ఇస్తూవుంటుంది. చేతిలో హేండ్ బేగ్ వుంటుంది]

పుల్లేశ్వర్రావు: (తల పైకెత్తి) రండి పిచ్చేశ్వరరావుగారూ! కూర్చోండి.

పిచ్చేశ్వర్రావు: (హాలంతా కలయజూస్తూ) ప్చ్! పత్రిక ఆఫీసంటే ఎంత దర్జాగా వుండాలి! యిదేదో కిరాణా దుకాణంలా వుందికాని పత్రిక కార్యాలయంలా లేదు మద్రాస్, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మొదలైన నగరాలలో పత్రిక ఆఫీసులు ఎంత హుందాగా వుంటాయనుకున్నారు?

పు అవన్నీ మీరు చూశారనుకుంటాను

పి ప్చ్! చూసి చెప్పడం ఏం గొప్ప? అసలు నేను వాటిని చూడనే లేదు. నేను పదహారణాల ఆంధ్రుణ్ణి గనుక ఆంధ్రుడికి సహజమైన వూహాగానశక్తి నాలో వుంది కనుక యిట్టే చెప్పేశాను. అదీకాక ఆంధ్ర దేశపు పొలిమేరల కావల ప్రముఖ పత్రికలన్నీ వున్నాయి కనుక - ఆంధ్రదేశానికి నడిబొడ్డునవున్న మన పట్టణంలో స్థాపించబడిన మీ పత్రిక కార్యాలయం యింకా హుందాగా వుండాలని నే నభిప్రాయపడుతున్నాను.

పు. దానికేం? నిక్షేపంగా వుంది. అలాగే అభిప్రాయపడండి.

పి: సజషన్స్ బుక్కు ఏదైనా వుంటే యిలా పారేయండి దానిలో నా సలహా రాసేస్తాను. (కూర్చొని జేబులోంచి పెన్ తీస్తాడు)

పు: పుస్తకం ఎందుకు? అదేదో నోటితోనే చెప్పెయ్యండి.

పి (పెన్ను తిరిగి జేబులో పెట్టుకొని) అయితే ఒక వరుసనుంచి ప్రారంభిద్దాం (ఒక క్షణం ఆగి) చూడండి పుల్లేశ్వర్రావుగారూ! ఈ పత్రికను స్థాపించడంలో మీ ఉద్దేశం ఏమిటి?

పు ఆంధ్ర రాష్ట్రం స్థాపించబడినది మొదలు ఆంధ్రుణ్ణి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నై. ప్రతీది ఒక సమస్యే! అన్నీ సమస్యలే! యీ సమస్యలనుండి ప్రజల నుద్ధరించడంకోసం యీనాడు ఆంధ్ర దేశంలో ఎన్నో ఉద్యమాలు తలెత్తినాయ్. అన్ని ఉద్యమాలకు ఉచితస్థానం యిచ్చి వాటిని ప్రోత్సహించేందుకుగాను మేం మా పత్రికను స్థాపించేం.

పి ఆశయం అమోఘంగా వుంది కాని అది అమలు జరగడంలోనే చిక్కువుంది.

పు: ఉద్యమనాయకులు అందరూ మాతో సహకరించినట్లయితే మా ఆశయం యిట్టే నెరవేరుతుంది.

పి. ఆంధ్రదేశంలోని యీనాటి అన్ని ఉద్యమాలకంటే సంఘసంస్కరణోద్యమం గొప్పది. అటువంటి మహోద్యమాన్ని నేను నా భుజస్కంధాలమీద వేసుకున్నాను ఈ విషయంలో మీ సంపూర్ణ సహకారం లభిస్తుందని నేను ఆశిస్తున్నాను

పు చిక్కంతా అక్కడేవుంది. ప్రతీ నాయకుడు తన ఉద్యమమే గొప్పదనుకోవడం మిగిలినవన్నీ పనికిరాని సమస్యలనుకోవడం జరుగుతోంది. మీ దృష్టిలో మీ ఉద్యమమే గొప్పదవచ్చు. కాని మేం అన్ని ఉద్యమాలను కూడా సమానదృష్టితో చూడదలచుకొన్నాం.

పి. (కోపంతో) అలా డొంకతిరుగుడు సమాధానం చెప్పేకంటే మీ ఉద్యమం మీద మాకు సానుభూతిలేదని ఖచ్చితంగా చెప్పెయ్యరాదూ?

పు: సానుభూతి నిజంగా లేనినాడు లేదనే ఖచ్చితంగా చెప్పివుండేవాణ్ణి. అభ్యుదయానికి దోహదమిచ్చే అన్ని ఉద్యమాల మీద మాకు సానుభూతివుంది. ప్రతి ఉద్యమానికి ప్రముఖస్థానం యివ్వలేంకాని మా పత్రికలో ఉచితస్థానం యివ్వగలం.

పి: మీరు పత్రిక స్థాపించారని తెలియగానే నే నెంతో ఆనందించాను. నా ఉద్యమానికి ఎంతో సహకారం లభిస్తుందని ఆశించాను. (నిస్పృహతో) కాని చివరకు ఆశాభంగం పొందవలసివచ్చింది. సంఘ సంస్కరణోద్యమం ఎంత ముఖ్యమైనది! సమాజపు పునాదులు శిథిలమై కదలిపోతూవుంటే (ఆవేశంతో) సమాజం నిలువునా పతనమై పోతూవుంటే చూస్తూ వూరుకోవలసిందేనా? ఇది ముఖ్యమైన సమస్య కాదా?

పు అది ముఖ్యమైన సమస్య అని నేను ఒప్పుకుంటాను. కాని ఆ ఒక్క సమస్యను పట్టుకొని దానితో వేళ్లాడుతున్నందువల్ల పూర్తి ప్రయోజనం లేదంటాను - ఉదాహరణకు నిరుద్యోగసమస్య తీసుకోండి. ఇది ముఖ్యమైనసమస్య కాదని మీరనగలరా? యీనాడు ఎందరో యువకులు చేయడానికి ఉద్యోగాలు లేక దారిద్ర్యంలో, దైన్యంతో అలమటిస్తూవుంటే దేశం యేవిధంగా పురోగమిస్తుంది? పిచ్చేశ్వర్రావుగారూ! యీమాటలు నేను స్వానుభవంతో చెబుతున్నాను. నేను పొట్ట చేత్తో పట్టుకొని కన్యాకుమారిఅగ్రం మొదలు కాశ్మీరంవరకూ తిరిగాను. కేవలం నాతిండికి ఒట్టకు సరిపోయే ఉద్యోగం దొరికినా చేస్తానన్నాను. కాని నాకీదేశం చిన్న గుమస్తా ఉద్యోగంకూడా యివ్వలేకపోయింది. - నేటి యువకప్రపంచాన్ని కల్లోలపరిచే సమస్య యింతకంటే పెద్దది ఏముంది?

పి (రాజీ పడుతూన్నట్లు) మీ నిరుద్యోగ సమస్యతోపాటు నా సాంఘికసమస్యకు కూడా ప్రముఖస్థానంయిస్తే చాలు సంతోషిస్తాను, (హేండ్ బేగ్ లోంచి ఒక కాగితాలకట్ట బయటకితీసి సంపాదకుడికిస్తూ) యీనాటి సామాజికసమస్యలను, సనాతనుల దౌర్జన్యాలను చిత్రిస్తూ నూటఏభై పేజీల సుదీర్ఘవ్యాసం రాశాను. దీనిని మీ పత్రికలో ప్రకటించగలందులకు కోర్తాను.

పు. నూటఏభైపేజీలవ్యాసం చిన్న పత్రికలో ఎలా ప్రకటించగలుగుతాం చెప్పండి? మీరేమి అనుకోకపోతే చిన్న సలహా యిస్తాను

పి (కొంచెంకోపంతో) ఏమిటా సలహా?

పు దీనిని ఒక పుస్తకరూపంలో ప్రచురించుకోకూడదూ?

పి. ఏడిసినట్టే వుంది ఈ మాత్రం సలహా మీరు చెప్పాలటండీ డబ్బుంటే ఏనాడో యిటువంటి పుస్తకాలు కొన్ని వందలు అచ్చువేసి ఆంధ్రదేశంమీద వదలివుండేవాణ్ణి.

[యీ చివరిమాట అనే సమయంలో కుడివైపునుంచి తిమ్మేశ్వర్రావు వస్తాడు. వయస్సు 30 సంవత్సరాలు. పంచెకట్టు,

★ మాలో మేం - ఆంధ్రులం ★

కంటి మెడచొక్కా, నొసట విభూతిరేఖలు తలపాగ, శుద్ధ పూర్వాచారపరాయణుడని చూడగానే తెలిసిపోతోంది]

పు: ఏమిటి తిమ్మేశ్వరరావుగారూ!— యిలా దయచేశారు. కూర్చోండి ఏమిటి విశేషాలు?

తి: విశేషాలనంతములు - వాటికి లోటే మున్నది పుల్లేశ్వరరావుగారూ!—అందులో ఈమధ్య లోకము బొత్తిగా చెడిపోవుచున్నది. రోజురోజుకు నాస్తికులు పెరిగి పోవుచున్నారు. పోనీ పోతే పోయారు లెమ్మని మేం వూరుకుంటూవుంటే (పిచ్చేశ్వరరావుకేసి కోపంగా చూస్తూ) పుస్తకములు రాసి ఆంధ్రదేశంమీదికి వదలిపెడుదురట! పుస్తకములు!

పి: ఏమండోయ్ తిమ్మేశ్వరరావుగారూ! మీరు అనవసరంగా భుజాలు తడుముకున్నందువల్ల ప్రయోజనం లేదు. లోకం రోజురోజుకూ పురోగమిస్తోంది. దాన్ని వెనక్కి మళ్లించడం మీ సృష్టికర్త అయిన బ్రహ్మకుకూడా తరంగాదు.

తి. (కళ్లుమూసుకొని) పాపము శమించుగాక! ఓ బ్రహ్మదేవుడా! యిటువంటి పరమనాస్తికులను కూడా ఎలా సృష్టించితివయ్యా?

పు సరే దానికేంగాని తమరు యిలా రావటానికి కారణం?

తి: బాగా జ్ఞాపకం చేశారు. చెప్తాను. నాస్తికుని ముఖము చూచినవెంటనే సచేల స్నానం చేయవలెనని శాస్త్రములు ఘోషించుచున్నవి.

పు: శాస్త్రాల మాటకేంగాని తాము వచ్చిన పని?

తి. (చిరాకుగా) అదే ఉపోద్ఘాత పూర్వకముగా చెప్పుచున్నానయ్యా మహానుభావా! (తిరిగి ఉపోద్ఘాతాన్ని కొనసాగిస్తూ) వేదకాలములోనే చార్వాకుడు అనే నాస్తికు డొకడు బయలుదేరినాడు. వాడు పెట్టిన వరవడిలో నేడు నాస్తికులు పుంఖానుపుంఖములుగా తయారగుచున్నారు. వేదములను, బ్రహ్మను, తిరస్కరించుటయే వారి పని. బ్రహ్మ ఒక స్త్రీని నీవు వితంతువు కమ్మని శాసించినా వినకొనుడు. వెంటనే ఈ నాస్తికులు బ్రహ్మపై తిరుగుబాటుచేసి ఆ వితంతువునకు తంతువు బిగించి సతంతువుగా మార్చుచున్నారు.

పి: (గట్టిగా నవ్వుతూ) సెహభాష్! మా మంచిమాట చెప్పేవయ్యా! మీలాంటి వాళ్లు కొన్ని వేలమంది చేరినా కాలాన్ని వెనక్కి మళ్లించలేరు.

తి. (పిచ్చేశ్వరరావు ముఖంకేసి చూడకుండా అతనితోనే) నీతో నేను మాట్లాడరాదు. నా మాటలకు నీవు అడ్డురాకూడదు. (పుల్లేశ్వరరావుకేసి చూస్తూ) పుల్లేశ్వరరావుగారూ! యీనాస్తిక ఉధృతమును అణచవలసిన బాధ్యత ప్రతీ భారతీయునిపైన గలదు (జేబులోంచి ఒక వ్యాసముతీసి) ఆస్తికత్వమును ప్రబోధించు నీ వ్యాసరాజమును మీ పత్రికలో ప్రచురించుకొందురుగాక. నాకు తొందరపని ఉన్నది. తిరిగి కనిపించెదను (వ్యాసం బల్లమీద పెట్టి కుడివైపు వెళ్ళిపోతాడు)

పు: (పిచ్చేశ్వరరావుతో) చూశారుకదూ! యిదీవరస! తిమ్మేశ్వరరావుగారి దృష్టిలో నారిదే మహోద్యమం. ఎవడిపిచ్చి వాడి కానందం.

పి: (కోపంతో) పుల్లేశ్వరరావుగారు మీరు కంద చెప్పండి, వెయ్యి చెప్పండి. నా ఉద్యమం మహోద్యమంకాదని నా జీవితంలో ఒప్పుకోను. ఒప్పుకుంటే నాఓటమిని నేను చేతులారా తెచ్చుకున్నట్టే అవుతుంది. సరే దానిమాటకేం? నా వ్యాసంగురించి ఏమీ చెప్పారుకాదేం?

పు: చెప్పడానికేముంది? ఆ వ్యాసాన్ని కుదించిరాస్తే ప్రచురించుకోవడానికి ప్రయత్నిస్తాం.

(తెరలోంచి పెద్ద నినాదాలు వినిపిస్తూ వుంటాయి. అవి అంతకంతకు దగ్గరగా వినిపిస్తాయి. భలేరావు అతనివెనుక మరో నలుగురు విద్యార్థులు నినాదాలుచేస్తూ ప్రవేశిస్తారు. అయిదుగురిభుజాలకు "కార్యాచరణసమితి" అక్షరాలువున్న బేడ్జ్‌లు వుంటాయి. చూడగానే వాళ్లంతా విద్యార్థులని, భలేరావు విద్యార్థినాయకుడని తెలుస్తుంది. అందరివయస్సు 20 సం॥ లో పు. అయిదుగురిచేతుల్లోను రంగు డబ్బాలు బ్రష్‌లు, గుడ్డపేలికలు వుంటాయి, భలేరావు చేతిలో దినపత్రికకూడా వుంటుంది)

భలేరావు (గట్టిగా) ఆంధ్రరాష్ట్రం...

నలుగురు విద్యార్థులు } (చెవులు చిల్లులుపడేటట్టు ఒక్కసారిగా) వర్ధిల్లాలి!

భ: అపభ్రంశప్రయోగాలు...

నలు. వి: నశించాలి!

భ: కార్యాచరణసమితి!

నలు వి: జై!!!

పి: (కోపం) ఏమిటయ్యా దేనికైనా హద్దూపద్దూ వుండాలి. ఏమిటా గావుకేకలు!

భ: ఏమండోయ్ పిచ్చేశ్వరరావుగారూ! మేం యితర ఉద్యమాలలా శుష్కనినాదాలు చేసే బాపతుకాదు. ఫలానాపని మాకు మంచిదనిపిస్తే మేం వెంటనే ఆపని చేసి వూరుకుంటాం. అందుకే మేం "కార్యాచరణసమితి"ని స్థాపించాం.

పు. అయితే యీరంగుడబ్బాలు బ్రష్‌లూ ఎందుకు?

భ. యీనాటి ఎలిమెంటరీస్కూలు విద్యార్థులు బ్లాకుబోర్డులమీద రాసిన అక్షరాలను అంత శ్రద్ధాభక్తులతో చదవడంలేదు. కాని వాళ్లు నిత్యంరోడ్లమీద తిరుగుతూ ప్రతీదుకాణానికి తగిలించిన బోర్డులనూ అత్యంతాసక్తితో చదువుతున్నారు. బోర్డు రాయించుకొనేవాడికి సరైనభాషరాదు, రాసేవాడికి అంతకంటేరాదు. ఈ పరిస్థితులలో బోర్డులనిండా అపభ్రంశప్రయోగాలు కుప్పలు తిప్పలుగా వుంటున్నాయి. ఈ బోర్డులను నిత్యం పఠిస్తూవుంటే చిన్నపిల్లల భాషాజ్ఞానం కుంటుపడుతోంది. ఈ ప్రమాదాన్ని మా కార్యాచరణ సమితి వారు వెంటనే కనిపెట్టారు. శుష్క నినాదాలు విడిచిపెట్టి వెంటనే కార్యరంగంలోకి దూకేశాం. ఇవేళ రెండు గంటలలో 20 బోర్డులలోని అపభ్రంశ ప్రయోగాలను తొలగించేశాం.

పు (నవ్వుతూ) యిది నిజంగా నూటికి నూరుపాళ్లు కొత్తఉద్యమం.

పిచ్చే: భలేరావు! నీ చేతిలో పేపరు ఒకసారి యిలా యియ్యి (భలేరావు పేపరు యిస్తాడు, పేపరు తెరుస్తూ) మీ రిద్దరూ స్థిమితంగా ఉద్యమంగురించి మాట్లాడుకుంటూ వుండండి యీలోపున నేనీ పేపరులోని విశేషాలు చూసేస్తాను. (పేపరు చదువుకొంటూ వుంటాడు.)

పు: పుల్లేశ్వరరావుగారూ! మా ఉద్యమ స్వరూపం మీకు చెప్పేశాను. మీరు దీని మీద ఒక సంపాదకీయం రాసెయ్యాలి.

పు: యిందుకేనా మీరు వచ్చింది!

భ. కాదు. యింకా చాలా పనులమీద వచ్చాను. వరసగా ఒక్కొక్కటి చెప్తాను. ముందుగా మీ బోర్డుగురించి మాట్లాడదాం. మీ బోర్డులో-సచిత్ర వార్తా వారపత్రిక అని వుంది. యిందులో అపభ్రంశ ప్రయోగం లేకపోయినప్పటికీ, స్వల్పమైన మార్పు అవసరమని మాకు తోస్తోంది.

పు: వీల్లేదు! మా బోర్డులో రవంత మార్పు చేయడానికి కూడా మేం అంగీకరించం.

భ: (కోపంతో) మా కథలలోను, వ్యాసాలలోను మీకు తోచినన్ని మార్పులు చెయ్యవచ్చును కాని మేం మీ బోర్డును మార్పు చెయ్యకూడదేం?

పు. ఏ రచనైనా మా పత్రికలో ప్రచురించుకొనే ముందు అవసరమైన మార్పులు చెయ్యడం మా బాధ్యత!

భ (జేబులోంచి పత్రిక తీసి) చూడండి! మొన్న మీరు ప్రచురించిన నా కథలో "ఆమె తన నీల లోచనాలతో అతనివైపు చూసింది" అని నేను రాశాను. ఆ వాక్యాన్ని మీరు "ఆమె తన నీల సులోచనాలతో అతనివైపు చూచింది" అని దిద్ది ప్రచురించారు నా కథలోని నాయికకు మీరు సులోచనాలు తగిలించడంతో కథ పూర్తిగా దెబ్బతింది. దీనికి మీరేం సమాధానం చెబుతారు?

పు నీలలోచనాలు అంటే 'బ్లూ ఐస్' అన్న వర్ణన పాశ్చాత్యులది మనదేశంలోని స్త్రీల కళ్ళు నీలంగా వుండవు ఒకవేళ ఖర్మంకాలి ఎవరికైనా వున్నా వాటిని పిల్లి కళ్లు అంటారు అందువ. మీ వర్ణనలో స్వల్పమైన మార్పు చెయ్యవలసివచ్చింది.

భ తరువాత మీతో మాట్లాడవలసిన మూడవ విషయం. వారం రోజులు నేను అహోరాత్రాలు కష్టపడి రాసిన రచనను మీరు నిన్న తిప్పి పంపేశారు అందుకు కారణం కూడా తెలుసుకోడానికి వచ్చాను

పు (సమాధానంగా) నాయనా! భలేరావు! నీవింకా కుర్రాడివి! నీకు అనుభవం చాలదు పెద్దసమస్యలను తీసుకొని నీవు కథలల్లకూడదు, అదికాక ప్రతి రచయితకు తన రచన గొప్పదనే విశ్వాసం వుంటుంది.

భలే. (కోపంగా) మీరు యింకా తాతల నాటిపాత కబుర్లు చెబుతున్నారు. పూర్వ కాలంలో రచయితలు తక్కువగా వుండే వారు. వారిరచనలను పాఠకులు చదివి ప్రశంసించేవారు. కాని రోజులు మారిపోయాయి. ఈనాడు పాఠకులకంటె రచయితలెక్కువై పోయారు ఒక రచయిత గొప్పతనాన్ని మరో రచయిత అంగీకరించడానికి ఎంతో విశాలహృదయం ఉండాలి. ఈ పరిస్థితిలో ఎవరి రచనను వాళ్ళు పొగుడుకోవడంకంటే గత్యంతరం లేదు.

పు: అందుకోసం నీరచన నువ్వే పొగుడు కుంటానంటావు?

భ: ఓ! ఢంకా బజాయించి పొగుడు కుంటాను! (ప్రక్కనున్న నలుగురు విద్యార్థులకేసి తిరిగి గట్టిగా నినాదంయిస్తూ) మా రచనలను పొగడుకొనేహక్కు...

స. వి. (హాలు ప్రతిధ్వనించేలా) మాకు వుంది! (యింతసేపటినుంచి మౌనంగా పేపరు చదువుకుంటున్న పిచ్చేశ్వర్రావు పేపరు చేత్తో పట్టుకొని అమాంతంగా లేస్తాడు)

★ మాలోమేం - ఆంధ్రులం ★

పి: (పేపరుకేసి దీర్ఘంగా చూస్తూ ముందుకు నడచి) ఘోరవార్త! ఘోరవార్త! (భలేరావు, పుల్లేశ్వరరావు ఆత్రుతతో అతని ముఖంలోకి చూస్తారు)

భ: (పిచ్చేశ్వరరావుదగ్గరకు వచ్చి) ఎక్కడైనా కొంపలు తగులబడ్డాయా?

పి: (విచారంగా) ఉహూ! లేదు.

పు: (ఆత్రుతతో) ఎక్కడైనా రైలు ప్రమాదం జరగలేదు కదా!!!

పి: (దిగులుతో) లేదు! లేదు!

భ: గొప్పవాళ్లెవరూ కీర్తిశేషులు కాలేదుకదా!

పి: (విచారంతో) ఏం చెప్పను? అంతకంటె గొప్పప్రమాదం!

పు: (చిరాగ్గా) అదేదో! వేగం చెప్పవయ్యా మహానుభావా!

పి: (పేపరుచదువుతూ) "భర్తకు భార్య మనోవర్తి యివ్వాలన్న సూచనకు పార్లమెంటులో మహిళల తీవ్రప్రతిఘటన" (పేపరు క్రింద పారేసి) యింతకంటె ఘోరవార్త మరేదైనా వుందా? పురుషులతో సరిసమానమైన హక్కులు స్త్రీలకు కావాలన్నప్పుడు యీ సూచనకు స్త్రీలెందుకు అంగీకరించకపోవాలి?

పు: అంగీకరించకపోయినంత మాత్రాన మీకు కలిగేనష్టం యేమిటి?

పి: (కోపంతోను ఆవేశంతోను) నష్టం నాకొకడికే కాదు! పరిస్థితులు యిలాగే కొంతకాలం సాగితే యీ దేశంలోని ప్రతీ పురుషుడికి తీరని నష్టం కలుగుతుంది. పురుషుడితో సరిసమానమైన హక్కులు స్త్రీలకు కావాలని మనం ఇంతవరకూ వాదించేం. ఇకముందునుంచి స్త్రీలతో సరిసమానమైన హక్కులు పురుషులకు కావాలని మనం ఆందోళన చెయ్యాలి ప్రతి పట్టణంలోను, ప్రతి పల్లెలోనూ సమావేశాలు సభలు జరిపి తీర్మానాలుచేసి పార్లమెంటుకు పంపాలి.

భ యిప్పుడు మీరంత తొందరపడవలసిన అవసరం యేమొచ్చింది?

పి (విచారంతో)నువ్వు పిచ్చివాడవురా నాయనా! నీకింకా తెలియదు. మనదేశపు జనాభాలో సగానికిపైగా స్త్రీలువున్నారు. వాళ్లాడిన ఆటలకు యిలా మనం కల్పగించి చూస్తూవుంటే మా తరం పోయి మీ తరం వచ్చేసరికి ఆడవాళ్లు స్వేచ్ఛగా ఉద్యోగాలుచేస్తువుంటే మగవాళ్లుయింట్లో ఘోషాలో వుంటూ వంటచేసుకొని బ్రతకవలసిన రోజులు వచ్చి తీరతాయి. (రెండు నిముషాలు తీవ్రంగా అటూ యిటూ తిరిగి) యిక లాభం లేదు వెంటనే చర్య తీసుకోవాలి. నేను రేపు మిమ్మల్ని మళ్లా కలుసుకుంటాను పుల్లేశ్వరరావుగారూ! (తీవ్రంగా ఆలోచిస్తూ కుడివైపు వెళ్లిపోతాడు)

పు (అతను వెడుతున్నవైపు చూస్తూ) పాపం! పిచ్చేశ్వరరావుగారికి మరో కొత్త సమస్య ఎదురయ్యింది.

భ దానికేముందిలెండి! ప్రతి ఉద్యమానికీ సమస్యలను వెతుక్కోవలసిన అవసరం ఎప్పుడూ వుంటూనే వుంటుంది. ఈ ఒక రోజులోను మేం ఎన్ని సమస్యలను ఎదుర్కొన్నామో తెలిస్తే మీరు తప్పకుండా ఆశ్చర్యపోతారు. దిద్దవలసిన ప్రతిబోర్డు మాకో సమస్య అయి కూరుకుంది.

పు బోర్డు దిద్దడంలో కష్టం యేముంది?

భ: భలేగా అడుగుతున్నారే మీరు! బోర్డు దిద్దడం కష్టంకాదూ? దిద్దేముందు ప్రతి షాపువాడితోను తీవ్రంగా పేచీ పడవలసి వచ్చేది.

[కుడివైపునుంచి తొందరగా తుక్కోజీరావు వస్తాడు. అతని ముఖం కోపంతో జేవురించి వుంటుంది. వయస్సు 30 సం॥ చిన్న గెడ్డం. మీసం, ముఖంలోని సహజస్వభావాన్ని మరుగుపరుస్తూ వుంటాయి. ఖద్దరు లుంగీ కట్టుకుంటాడు ఖద్దరు శాలువా కప్పుకొని వుంటాడు. రాగానే భలేరావును సమీపిస్తాడు]

తుక్కోజీరావు. (కళ్లెర్రజేసి) మా బోర్డు ఎందుకు చెరిపేశావ్? మా బోర్డు దిద్దే అధికారం నీ కెవరిచ్చారు?

భ ఆవేశపడకండీ తుక్కోజీరావుగారూ! శాంతంగా ఆలోచించి చూస్తే మీ బోర్డు దిద్దడం సరైన పనని మీకే తోస్తుంది.

పు. (భలేరావుతో) మీరు బోర్డులు దిద్దేముందు బోర్డు కలవాళ్ళకు తెలియజేసి దిద్దితే పేచీలు వుండేవి కావు.

భ మీరింకా వెనకటి కాలంలో వున్నారు అలా చెబితే ఎవరూ అంగీకరించరు. చెప్పకుండా చెయ్యడంలోనే అందం ఆనందం రెండూ యిమిడివున్నాయి. ఆంధ్రాభ్యుదయంకోసం భాషాభ్యుదయంకోసం మా ఉద్యమాన్ని మేం తీవ్రంగా కొనసాగిస్తాం ఇలాంటిఆటంకాలను మేం లెఖ్ఖచెయ్యం.

(మిగిలిన విద్యార్థులకేసి తిరిగి గట్టిగా)

అపభ్రంశప్రయోగాలను తొలగించే హక్కు .

వి (హోలు ప్రతిధ్వనించేలా)మాకువుంది.

భ ఆంధ్రరాష్ట్రం...

వి వర్ధిల్లాలి!

భ కార్యాచరణసమితికి

వి జై!!!

(నినాదాలుచేస్తూ భలేరావు, నలుగురు విద్యార్థులతోను కుడివైపు వెళిపోతాడు)

తు (నిస్పృహతో కుర్చీలో కూలబడి) లోకం రోజురోజుకు చెడిపోతోంది. లేకపోతే చిన్నపిల్లల మనస్సులలోకూడా విప్లవాంకురాలు మొలకెత్తాలా!

పు పెద్దవాళ్ళకే స్థిరత్వంలేని రోజులివి. అటువంటప్పుడు చిన్నపిల్లల మనస్సులు రోజురోజుకు మారడంలో ఆశ్చర్యమేముంది?

తు మారవచ్చునండీ! మారవచ్చు! ఆ మారేదేదో మంచిగా మారితే అందరం సంతోషిస్తాం. అగ్నిజ్వాలల కెదురేగే శలభాలవలె యీ కాలపు పిల్లలు విప్లవపంథావైపు మొగ్గుతున్నారు. మనం కల్పగించి యీవిధంగా చూస్తూ వూరుకొంటే మరోతరంలో ఆంధ్రులంతా విప్లవకారులై వూరుకుంటారు

పు. అక్కడే మీరు పొరబాటు పడుతున్నారు మనస్సు నిష్కల్మషంగా వున్నవాడికి యిట్టే ఆవేశం కలుగుతుంది.

ఆంధ్రులు ప్రతి ఉద్యమానికీ స్వాగతం యిస్తారు. దానిలో ఏమాత్రం దోషం కనిపించినా వెంటనే విడిచిపెడతారు.

తు: నీది ఏమైనప్పటికీ మహోదయ సిద్ధాంతాలమీద నిర్మించబడిన మా అఖిలాంధ్ర నిర్మాణ సంఘానికి ఆంధ్రులు తగిన స్వాగతం యివ్వలేదు. సరికదా! యీ కుత్సితులు మా "అఖిలాంధ్ర నిర్మాణసంఘం" పేరును "అఖిలాంధ్ర సంఘనిర్మాణం"గా మార్చేశారు.

పు (నవ్వుతూ) మీరు దేశాన్ని మరామత్తు చెయ్యాలనుకుంటే వాళ్లు బోర్డులను మరామత్తు చెయ్యాలనుకున్నారు.

తు: (కోపంతో) మా సిద్ధాంతాలను మీరు పూర్తిగా తెలుసుకుని వుంటే మమ్మల్ని ఆ కళ్ళు తెరవని కుర్రవాళ్లతో పోల్చివుండరు. ఈనాడు లోకంలో దరిద్రనారాయణుల సంఖ్య అమోఘంగా పెరిగిపోయింది. తినడానికి తిండిలేక, కట్టుకోడానికి బట్టలేక, నివసించటానికి కొంపలేక (నిస్పృహతో) చివరకు చెయ్యడానికి పని కూడా దొరకక కోటానుకోట్ల మానవప్రాణులు అల్లాడుతున్నాయి. యీ పరిస్థితులను కొందరు రాజకీయవేత్తలు తమ స్వప్రయోజనాలకోసం ఉపయోగించుకుంటున్నారు. మన సోదర దరిద్రనారాయణులు దౌర్భాగ్యంవైపు మొగ్గుచూపుతున్నారు. దరిద్రులకు ధనవంతులకు మధ్యనున్న తగువులను పరిష్కరించి సమరసభావం పెంపొందించేందుకు మా అఖిలాంధ్ర నిర్మాణ కార్యకర్తల సంఘం కృషి చేస్తోంది.

పు ఆ పరిష్కార మార్గాలేమిటో దయచేసి సెలవిస్తారా?

తు. ధనవంతుల మనసులలో పరివర్తన కలిగించడమే ఉత్తమ పరిష్కారమార్గం. మేం ఎందరో ధనవంతులలో పరివర్తన కలిగించాం. మా భూదాన యాజ్ఞానికి ఎందరో తమ భూములను అర్పించి మాకు తోడ్పడుతున్నారు. నేటికి మేం ఈ వద్యారతంలోను కొన్నిలక్షల యకరాలను భూదానయజ్ఞంద్వారా రాబట్ట గలిగాం. "దున్నేవాడిదే భూమి" అన్న విప్లవకారుల నినాదానికి యిది నిజంగా గొడ్డలిపెట్టు.

పు. అని మీరనుకుంటున్నారు. కాని మాలాంటి సామాన్యులకు కనపడుతున్న దేమిటంటే, మీ ఉద్యమం బయలుదేరినతరువాత మీరు విప్లవకారులని ఎవరినైతే పిలుస్తున్నారో వాళ్లు మరింతబలపడ్డారని.

తు: లేదు! లేదు! వాళ్లు బలపడ్డానికి అవకాశం ఎంతమాత్రం లేదు. మేం మా ఉద్యమాన్ని యింకా విస్తృతం చేస్తున్నాం సంపత్తిదానం, శ్రమదానం, గృహదానం మొదలైన కొత్త సిద్ధాంతాలను కూడా అమలులో పెడుతున్నాం.

పు: బాగానేవుంది!

తు: దానిని అధికారంలో వున్న రాజకీయ నాయకులు మాత్రం ఉపయోగించుకుంటారు. వాళ్లు వాగ్దానాలతో గద్దెలు ఎక్కి వాగ్దానాలు చేస్తూనే దిగిపోతూ వుంటారు. ఆసూత్రం మాపట్లమాత్రం ఉపయోగించదు. ఎవరు ఎన్ని విధాల అనుకోనివ్వండి, మా ఉద్యమానికి కర్మభూమి అయినటువంటి మనభరతఖండంలో మహోజ్జ్వలమైన భవిష్యత్తు వుంది—నాకు చాలా పనివుంది. మరోసారి వచ్చి మా ఉద్యమంగురించి మీకు సుదీర్ఘంగా వివరిస్తాను జై! సీతారామ్! (ఎడమవైపు వెళ్ళిపోతాడు)

[పుల్లేశ్వర్రావు ఒక దీర్ఘనిశ్వాసం విడిచి తిరిగి పుస్తకం చదువుకోడానికి ఉపక్రమిస్తాడు. ఒక నిముషం నిశ్శబ్దంగా గడుస్తుంది కూనేరావు తొందరగా కుడివైపునుంచి వస్తాడు వయస్సు 30 సంవత్సరాలలోపు. ఖాకీ ఫుల్‌పాంట్, మాసిన తెల్ల చొక్కా, చింపిరి జుత్తు, బూటు—బూటు దగ్గర ఫుల్‌పాంటు అంచులు చిరిగిపోయి వుంటాయి. ముఖంలో తీక్షణత. కళ్ళలో ఎరుపు కనిపిస్తూవుంటాయి. సన్నంగా పొడవుగా వుంటాడు]

పు: ఏమండోయ్! కూనేరావుగారూ! యిలా వచ్చారు. రండి! రండి! కూర్చోండి!


కూనేరావు: నేను కూర్చోడానికి రాలేదు. ఒక క్షణం వృధాగా కూర్చుంటే ఎన్నో అమూల్యమైన పనులు ఆగిపోతాయి. ప్రజావిరోధి తుక్కోజీరావు యిలా మీ ఆఫీసులోకి రావడం నేను చూశాను. ఏడీ! ఎక్కడకు పోయాడు?

పు ఆయనతో మీకేం పని?

కూ మీకు మార్క్సిజంగురించి ఏమాత్రం తెలిసినా మీరీ ప్రశ్న వేసివుండరు. ప్రజావిరోధుల నెప్పుడూ ఒక కంటితో కనిపెడుతూ వుండాలి బూర్జువాల ఏజంటులైన తుక్కోజీరావులాంటివాళ్ళను ఏమాత్రం అశ్రద్ధగా విడిచిపెట్టినా దేశానికి ఘోరప్రమాదం జరుగుతుంది

పు ఆయనవల్ల దేశానికి కలిగే ప్రమాదం యేమిటో ఎంత వూహించినా - నా బుర్రకు తట్టడంలేదు

కూ (గంభీరంగా) పుల్లేశ్వర్రావుగారూ! జనం, అనగా ప్రజానీకం, అంతా మాక



★ మాలో మేం - ఆంధ్రులం ★

పోతున్న దొక్కటే! ఆ సిద్ధాంతాలు పైకి ఎంతో మంచి సిద్ధాంతాలలా కనిపిస్తూ వుంటాయి. మార్కిస్టు దృక్పథంతో చూస్తే అవెంత ప్రమాదమైనవో బోధపడతాయి. ప్రతి దేశంలోనూ బూర్జువాలు, పెటీ బూర్జువాలు తమ ఆధిక్యాన్ని నిలుపుకోవడం కోసం పీడితప్రజలను దోచుకోవడం - ఎన్నో పన్నాగాలు పన్నుతూ వుంటారు. తుక్కోజీరావులాంటివాళ్ళు వాళ్ళకు పరోక్షంగా తోడ్పడుతూవుంటారు. ఈ రకం ప్రజావిరోధులను అశ్రద్ధగా చూస్తే యీ దారిద్ర్యం - యీ దోపిడీవిధానం యిలా ఎన్నోతరాలు కొనసాగుతూనేపోతుంది.

పు. అయితే వీటికి పరిష్కారమార్గం ఏమిటి?

కూ: అలా అడగండి చెబుతాను. మనం పీడిత ప్రజానీకాన్ని కూడగట్టుకోవాలి. గనిలో పనిచేసే కూలీలు, కర్మాగారంలో పనిచేసే కార్మికులు, భూమి దున్నుకు బ్రతికే కర్షకులు, మొదలైన శ్రమజీవులందరికీ సంఘాలు ఏర్పాటు చేయాలి యీ శ్రమజీవులనందరినీ సంఘటితపరచి నేటి బూర్జువా నాయకత్వంమీద తిరుగుబాటు చేయించాలి. రేపు రాబోతున్న ఎన్నికలలో బూర్జువా నాయకులను చిత్తుగా ఓడించి మనం వాళ్లకు గుణపాఠం నేర్పాలి - మరోసారివచ్చి మీతో అన్ని విషయాలు మాట్లాడతాను తుక్కోజీరావు ఎక్కడికి పోయాడో వెంటనే తెలుసుకోవాలి. (జేబులోంచి ఒక కాగితంతీసి) రేపటి ఎన్నికలగురించి చిన్న గేయం రాశాను. ఎన్నికలకు ముందు బూర్జువాలు ఏంచేస్తారో - ఎన్నికలయినతరువాత ఏంచేస్తారో యీ గేయంలో వివరించాను. దీనికి మీ పత్రికలో ప్రముఖస్థానం యిచ్చి ప్రచురించుకోవాలి. ఇది ప్రజాభాషలో రచించబడిన ప్రముఖ గేయం.

[కాగితం టేబిలుమీద పెట్టి తొందరగా ఎడమవైపు నిష్క్రమిస్తాడు. పుల్లేశ్వరరావు గేయాన్ని చిరునవ్వుతో చదువుతూ వుంటాడు]

— తెర —

* * *

రెండవ దృశ్యం.

[వారం రోజులు గడచిన తరువాత — అదే హాలు. తెర లేవగానే మనుషులెవరూ కనిపించరు. ఒక టేబిలు. టేబిలుమీద పుస్తకాలు కాగితాలు ఎప్పటిలావుంటాయి ఐదు కుర్చీలు ఖాళీగా వుంటాయి కుడివైపు నుంచి పుల్లేశ్వరరావు, తుక్కోజీరావు మాట్లాడుకుంటూ ప్రవేశిస్తారు]

తు. మీరే చెప్పండి పుల్లేశ్వరరావుగారూ! ఇంతకంటే ఘోరం మరేమైనా వుందా? మీలాంటి ప్రముఖులంతా ఈ పట్టణంలో వుండికూడా మా ఉద్యమానికి జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ వూరుకుంటారా?

పు· (విసుగ్గా) అబ్బబ్బా! అరగంటనుంచి 'అన్యాయం', 'ఘోరం' అని ఉపన్యాసం దంచుతున్నారేకాని అసలు విషయం చెప్పడంలేదు. అసలు మీకు జరిగిన ఘోరం ఏమిటో వివరించనిదే నేనేం జవాబు చెప్పగలను?

తు: (విచారంగా) ఏం చెప్పను? నాకు చెప్పడానికి నోరురావడం లేదు. మన దేశంలో దరిద్ర నారాయణులకు సేవచేసే ఉద్దేశంతో మేం భూదానయజ్ఞం ద్వారా భూములను సంపాదిస్తున్న విషయం మీకు తెలుసు.

పు (చిరాగ్గా) ఓ పూర్తిగా తెలుసు. (కుర్చీలో కూలబడతాడు)

తు: (ప్రసంగాన్ని కొనసాగిస్తూ) సదరు భూదానయజ్ఞంద్వారా సంపాదించిన భూమి మన పట్టణంలో వుందన్న సంగతి కూడా మీకు తెలుసు.

పు: (సహనం కోల్పోతూ) తెలుసునయ్యా! మహానుభావా! తెలుసు!

తు: (దృఢస్వరంతో) ఆ భూమిపైన సర్వహక్కులూ మాకు వున్నవన్న సంగతి జగద్విదితం.

పు (తల రెండుచేతులతో పట్టుకొని) సరే! అలాగే అనుకుందాం

తు: (సూటిగా) అటువంటి పరిస్థితుల్లో ఆ భూమిమీద అడుగుపెట్టే హక్కు యితరుల కేమివుంది?

పు అయితే యిప్పుడు ఎవరు అడుగు పెట్టేరు?

తు: (ఆవేదన ఆవేశం మిళితమైన స్వరంలో) అడుగు పెట్టి వూరుకుంటే బాగానే వుండును నిన్న మధ్యాహ్నం యావన్మంది ప్రజలు చూస్తూవుండగా ఆ బందిపోటు దొంగ ఏభైమంది కూలీలను తీసుకొని జయజయ ధ్వానాలు చేసుకుంటూ మా భూమిలో అడుగుపెట్టి అక్కడ ఎర్రజెండా పాతి పెట్టాడు.

పు· (చిరునవ్వుతో) యింతకూ అతనెవరో చెప్పారుకారు!

తు (కోపంతో) యింకా అర్థంచేసుకోలేదటండీ! మనపట్టణం మొత్తంమీద యింతకంటె ఘోరానికి ఒడికట్టేవాళ్లెవరున్నారు, ఆ కూనేరావు మినహా!

పు· మీరు దరిద్రులకు పంచిపెట్టాలనే ఉద్దేశంతో భూమిసంపాదించారు. యీలోపున మీకేవిధమైన శ్రమా లేకుండా కూనేరావు ఆభూమిని ప్రజలకు పంచిపెట్టేశాడు. కనక మీ యిద్దరి ఆశయం నెరవేరినట్లే! యిందులో అన్యాయం ఘోరం నాకేం కనిపించడం లేదు.

తు (నిస్పృహతో) మీరా దేశద్రోహిని బలపరుస్తారని నే నెప్పుడూ అనుకోలేదు. (కోపంతో) మేం కష్టపడి సంపాదించిన భూమిని కూనేరావు లాక్కోవడంలో మీకేం అన్యాయం కనిపించడం లేదూ? శ్రమ మాది, ఫలిత మతనిదీనా? (యీ చివరి మాట అనేసమయంలో కూనేరావు తొందరగా కుడివైపునుంచి ప్రవేశిస్తాడు)

కూ: (వస్తూనే) యింతకాలం పీడిత ప్రజలు తమ శ్రమశక్తిని ధారపోసి గుత్త వ్యాపారస్తులకూ పెట్టుబడిదారులకూ ఫలితాన్ని సంపాదించి పెట్టారు. ఈనాడు యావత్ప్రపంచంలోను పీడిత ప్రజానీకం కన్ను తెరిచారు దోపిడీవిధానానికి 'ఫుల్ స్టాప్' పెట్టేశారు. పీడితవర్గంలో కలిగిన చైతన్యస్రవంతిలో దోపిడీదారులు

వారి తాబేదారులు అయిన తుక్కోజీరావు లాంటివాళ్ళు కొట్టుకుపోక తప్పదు.

తు: (కోపంతో) మహా చెప్పొచ్చావ్! ఆగవయ్యా! మేం మా ఉద్యమంద్వారా సంపాదించిన భూమిని ఆక్రమించే హక్కు నీకేముంది?

కూనే: (భుజానికి తగిలించివున్న సంచి లోంచి పుస్తకం ఒకటి తీసి, పేజీలు తిప్పుతూ) కారల్ మార్క్స 'కాపిటల్' అన్న గ్రంథంలో ఏం చెప్పాడో తెలుసా?

పు కూనేరావుగారూ! దయచేసి మీరా గ్రంథాన్ని యిప్పుడు తెరువవద్దు. మరో సారి మాకు తీరుబడైనప్పుడు ఎప్పుడైనా వచ్చి చదివి వినిపించుదురుగాని

కూనే: (నిస్పృహతో) మీ లాంటి మధ్యతరగతి మేధావులే మార్క్సిజాన్ని అశ్రద్ధగా చూస్తే ఎలాగ చెప్పండి పుల్లేశ్వ్రరావుగారూ! (పుస్తకం తిరిగి సంచిలో పెడతాడు.)

తు: (కోపంతో) ఏమయ్యోయ్! కూనే రావు! నువ్వు ప్రసంగాన్ని మార్చేస్తున్నావ్! మా భూమిని, ఆక్రమించుకున్నందుకు నువ్వు మాకు సంజాయిషీ చెప్పుకోవాలి లేకపోతే నిన్ను నేను కోర్టుకు యీడ్వవలసిన అవుసరం వుంటుంది.

కూనే. (గట్టిగా నవ్వుతూ) ఎంతటి వెర్రిమాట చెప్పావోయ్ తుక్కోజీరావు! నువ్వు చెప్పేదంతా వట్టి తుక్కు.. మీ బూర్జువా రాజ్యాంగ చట్టానికి - మీ బూర్జువా న్యాయస్థానాలకు జడిస్తే మేం ఏనాడో మా ఉద్యమాన్ని వదులుకొని పారి పోవలసివచ్చేది మేం మీ కోర్టులకు, మీ తీర్పులకు జడిసే ఘటాలంకాం యిప్పటి కైనా బోధపడిందా?

తు: (కోపంతో) బోధపడుతుంది. తొందరపడకు నిన్ను కోర్టు కీడ్పించి శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపించకపోతే నా పేరు తుక్కోజీరావు కాదు.

కూ: (కోపంతో) సరే! అయితే నా ప్రతిజ్ఞకూడా విను! నీ ప్రజావ్యతిరేక చర్య లనన్నిటినీ బహిర్గతంచేసి నిన్ను ప్రజా న్యాయస్థానంలో శిక్షించకపోతే నా పేరు కూనేరావే కాదు!

పు. (లేచి యిద్దరి మధ్యకు వచ్చి) మీరు యిలా బావురుపిల్లుల్లా పోట్లాడుతున్నందు వల్ల ప్రయోజనం లేదు. శాంతించి కూర్చోండి! రాజీపద్ధతిలో వ్యవహారం నడిపించడానికి ప్రయత్నిద్దాం. (తుక్కోజీ రావు, కూనేరావు ఒకరివైపు ఒకరు తీక్షణంగా చూసుకుంటూ కూర్చుంటారు. పుల్లేశ్వ్రరావు టేబిలుముందు తన కుర్చీలో తిరిగి కూర్చుంటాడు) యీనాడు ఆంధ్రదేశం లోని పరిస్థితులు చాలా విచిత్రంగా వున్నాయ్ ఎటు చూచినా సమస్యలే! ఎన్నో సమస్యలను మనం ఎదుర్కొంటున్నాం. యీ సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ఎన్నో ఉద్యమాలు బయలు దేరాయి. కాని నిజానికి యీ ఉద్యమాలు ఏం చేస్తున్నాయ్? (యిద్దరివైపు ప్రశ్నార్థకంగా చూస్తాడు)

తు: కొన్ని ఉద్యమాలు మంచిపనులే చేస్తున్నాయ్!

కూ: కొన్ని ఉద్యమాలు అభివృద్ధి నిరోధకాలుగా వున్నాయ్!

పు: మీరు యిద్దరు చెప్పినదీ నిజమే! కాని అంతకంటె ఒక్క మాటలో చెప్పాలంటే యీ ఉద్యమాలు సమస్యలను పరిష్కరించడానికి బదులు వాటిని మరింత చిక్కుపెడుతున్నాయ్! యీ పరిస్థితులే కొంతకాలం సాగితే ఆంధ్రదేశానికి అభ్యుదయమనేది గగనకుసుమంగా మారుతుంది

కూ: మీ అభిప్రాయం సరైనదని నే నొప్పుకోను మీరు పరోక్షంగా మార్క్సిజాన్ని తృణీకరిస్తున్నారు.

తు: పుల్లేశ్వ్రరావుగారు! నేను కూడా మీ అభిప్రాయాన్ని అంగీకరించలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. ప్రపంచానికి ఆశాజ్యోతిని చూపే మహోదయ సిద్ధాంతాలను మీరు న్యూనపరుస్తున్నారు.

పు. రోగాన్ని కుదిర్చేమందు సాధారణంగా చేదుగా వుంటుంది. నగ్నసత్యం కూడా చేదుగా వుంటుంది. మీరేకాదు ఏ ఉద్యమనాయకుడు కూడా నా అభిప్రాయాన్ని అంగీకరించడని నాకు తెలుసు.

కూనే. ఎవరూ అంగీకరించని అభిప్రాయాన్ని పట్టుకొని మీరెందుకు వేళ్లాడాలి?

తు: అవును! నిజమే మీ అభిప్రాయాన్ని వెంటనే మార్చుకోవడం మంచిది.

పు. నా అభిప్రాయాన్ని మార్చుకోవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఉదాహరణకు దూరపుకొండ నునుపు అని అందరూ అంటున్నారనుకోండి ఆ కొండ దగ్గరకు వెళ్ళిచూసి వచ్చిన మనిషి ఆ కొండకు ఎగుడు దిగుళ్లూ, వంకరలూ - వున్నాయని చెబుతాడు. కాని దూరాన్నించి చూస్తున్న ప్రజలెవరూ అతని మాట నమ్మరు. అటువంటప్పుడు అతను ఆత్మవంచన చేసుకొని ఎవరూ నమ్మడం లేదుకదా అని తన అభిప్రాయాన్ని మార్చుకోవలసిందేనా?

తు. యీ ఉదాహరణకు దానికీ ఏం సంబంధంలేదు.

కూనే. మీ సమర్థనలో పసలేదు.

పు. నా అభిప్రాయాన్ని అర్థం చేసుకోవడానికి మీకు కొంచెం విశాల హృదయం కావాలి! మరో చిన్న ఉదాహరణ చెబుతాను. కొందరు వ్యక్తులు ఒక ఉన్నత శిఖరాన్ని నిర్మించడం అవసర మనుకున్నారు. వెంటనే నిర్మించటానికి పూనుకున్నారు. శిఖరాన్ని నిర్మించుతుంటూ పైకి వెడుతున్నారు. యీ సమయంలో మరికొందరు వ్యక్తులు యీ శిఖర నిర్మాణం యీ ప్రదేశంలో యీ పరిస్థితులలో అనవసరం అనుకున్నారు. వెంటనే నిర్మించబడిన రాళ్లను ఒక్కొకటిగా తీసెయ్యడం ప్రారంభించేరు. సరిగా యీనాటి ఆంధ్రదేశపు పరిస్థితి యిది.

తు }
కూ } : మీ సిద్ధాంతాలలో సారం లేదు. మీవి బూర్జువా సిద్ధాంతాలు! వట్టి తుక్కు!

పు. మీ ఉద్యమాలను దూరాన్నుంచి చూస్తూ - కలుగుతున్న పరిణామాలకు చింతిస్తూ - రోజులు ఎప్పటికి మారతాయా అని ఆలోచిస్తున్న మాలాంటి సామాన్యులం కొందరం వున్నాం. (నిస్పృహతో) యీ పరిస్థితులలో మాలాంటి సామాన్య ప్రజలు నిస్పృహలో కూలబడి మంచిరోజులకోసం కలలుకంటూ నిద్రావస్థలో వుండవలసిందే!

[సరిగ్గా చివరిమాట అనే సమయంలో "ఆంధ్రుల్లారా లేవండి" అనే బృందగానం చెవులు గింగురుమనేటట్లు నేపథ్యంలోంచి వినిపిస్తుంది. ముగ్గురూ ఆశ్చర్యంగా తుడివైపు చూస్తూవుంటారు. థరేరావు నలుగురు విద్యార్థులతో పాట పాడుకుంటూ ప్రవేశిస్తాడు. ఐదుగురి భుజాలకు "కార్యాచరణ సమితి" అనే అక్షరాలతో బేడ్జస్ ఎప్పటిలా వుంటాయి. ఐదుగురూ భుజాలకు పొడుగుపాటి గుడ్డ సంచులను తగిలించుకొని వుంటారు. చేతులలో కాఫీపౌడర్ పొట్లాలు వుంటాయి ఐదుగురు వరుసగా నిలబడి పాట పాడుతూ వుంటారు.]

థరేరా }
విద్యా } : (బృందగానం)

ఆంధ్రుల్లారా లేవండి
అరకప్ కాఫీ చవి చూడండి!
ఆశకాని కి సరైనమందు
ఆలోచన కలిగించును మెండు
ఘనమైనది ఆంధ్రా కాఫీ
మీ టేస్టుకు సూటైన కాఫీ
ఆంధ్రులకు తగిన హాఫీ
అందించేదే యీ కాఫీ
కళాకారులకు మంచి చురుకు
కలిగించే నిసలైన సరుకు
పదణాలకు ఒకే ఒక పేకట్ -
చూడండి వెంటనే మీ పోకట్!
ఆంధ్రుల్లారా లేవండి!
అరకప్ కాఫీ చవి చూడండి!

థ. (ప్రేక్షకులవైపు తిరిగి) ఆంధ్ర మహా జనులారా! నేడు ఆంధ్రదేశములో కాఫీ తాగేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. 1954 సం॥లో వేసిన అంచనా ప్రకారం యావద్భారతంకంటే కాఫీ తాగే ప్రజలు కేవలం ఆంధ్రదేశంలోనే ఎక్కువగా వున్నారని తేలింది. ఆంధ్రులు కాఫీ



★ మాలోమేం - ఆంధ్రులం ★

ద్వారా ఆవేశాన్ని యిట్టే పొందగలుగు తున్నారని విదేశీయులు తమ నివేదికలలో తెలియజేశారు యీ పరిస్థితుల్ని ఆధారంగా తీసికొని కొందరు స్వార్థపరులు కల్తీ కాఫీపౌడర్లను తయారు చేస్తున్నారు. వీధి వీధిన సందు సందున కాఫీ పౌడర్ షాపులు పెరిగిపోతున్నయ్ యీ పరిస్థితుల్లో ఆంధ్రులకు సిసలైన కాఫీ అందించే ఉద్దేశంతో "ఆంధ్రా కాఫీ" స్థాపించబడింది

కూ భలేమాట చెప్పావోయ్ భలేరావ్! అయితే కార్యాచరణసమితివాళ్ళు కాఫీ హోటల్ ప్రారంభించారన్నమాట.

వ లేదు! లేదు! మీ రక్కడే పొరబాటు పడుతున్నారు

కు సోరి మీరు కాఫీ పౌడర్ ఏజన్సీ తీసుకున్నారా?

భ ఊహూఁ! అదీ కాదు.

పు మరి యేదీ కాకపోతే - గొంతు చించుకొని అరుస్తూ కాఫీ పౌడర్ అమ్మవలసిన అవసరం మీకేం వచ్చింది?

భ అదదీ! అలా అడగండి చెబుతాను (కాఫీ పౌడర్ పేకెట్ చూపిస్తూ) యీ ఆంధ్రా కాఫీ ప్రొప్రయిటర్ వున్నాడు చూశారూ? ఆయన మా కార్యాచరణ సమితి- సానుభూతిపరుడు చాలా మంచి వాడు కడు బీదవాడు 'ఆంధ్రుల అనురాగ పాత్రమైన కాఫీని-అంటే పూర్తిగా నికార్సయిన కాఫీని ఆంధ్రప్రజలకు అందించే వుద్దేశంలో ఆయన "ఆంధ్రా కాఫీ" స్థాపించాడు కాని పాపం పెట్టుబడిదారుల పోటీకి - తట్టుకోలేకపోయాడు యీ వ్యాపారంమీద వచ్చే సొమ్ము ఆయన జీవనోపాధికి చాలడంలేదు

కు (మనస్సులో అనుకొని) అందుకు మీరు జాలిపడి అతని వ్యాపారాన్ని విస్తృతం చేయడానికి పూనుకున్నారన్నమాట

భ (హేళనగా) ఒహోహో! ఏం బుర్రండీ. మీది తుక్కోజీరావుగారూ! అందుకే మీ కెవరో అలాంటి పేరు పెట్టారు

కు (కోపంతో) అబ్బాయి! నువ్వు కొంచెం మర్యాదగా మాట్లాడ్డం నేర్చుకోవాలి నీకు పెద్దంతరం చిన్నంతరం తెలియకుండా వుంది

కూ నే మిస్టర్ తుక్కోజీరావు! నువ్వు అక్కడే పొరపాటు పడుతున్నావ్! యీ దేశంలోనే కాదు - ప్రపంచంలో ఏ మూలనైనా సరే చిన్నవాడికి పెద్దవాడిమీద తిరుగుబాటు చేసే హక్కు వుంది. కూలీకి యజమానిమీద తిరుగుబాటు చేసే హక్కు వుంది పీడిత ప్రజలకు

తు (మనస్సులో అనుకొని) అది ఎంతమాత్రం పనికిరాదని మేం చెబుతున్నాం. విభిన్న వర్గాలమధ్య సామరస్యం నెలకొనాలని మేం చెబుతున్నాం.

భ (కోపంతో మాట్లాడటానికి ఉపక్రమిస్తోన్న కూనేరావుతో) కూనేరావుగారూ! మీరు దయచేసి కొంతసేపు మమ్మల్ని మాట్లాడనివ్వాలి మేం యిక్కడకు రావడానికిగల కారణం అత్యంత విచారకరమైనది (చేతిలో పేకెట్ చూపిస్తూ) యీ కాఫీ ప్రొప్రయిటర్ గారికి నిన్న రాత్రి ఆకస్మికంగా జబ్బుచేసింది తక్షణం హాస్పటల్లో చేర్పించాం యింతకాలం ఆంధ్రులకు కల్తీలేని కాఫీని అందించిన ఫలితంగా ఆయన జేబులో చిల్లిగవ్వయినా లేదు

పు (జాలిగా) పాపం! ఆయన కుటుంబం గడిచేదెలా?

భ: [illegible] అసలు కుటుంబం లేనే లేదు ఆయన ఒక్కడి జీవితం గడవడమే కష్టంగా వున్నప్పుడు కుటుంబాన్ని కూడా ఎలా పోషించగలడు? అందుకోసం ఆజన్మ బ్రహ్మచారిగా వుండిపోయాడు.

కూ యీ దేశంలో నిరుద్యోగ రాక్షసికి గురిఅయి అష్టకష్టాలు అనుభవిస్తున్న కార్మికులు యెందరో వున్నారు. దేశాన్ని పెట్టుబడిదారుల హస్తాలనుండి తప్పించే వరకూ యీ పరిస్థితులు చక్కబడవు.

భ (తిరిగి ఉపన్యాసధోరణిలో) మహాశయులారా! యింతవరకూ మీకు పరిస్థితులను వివరించాను ఏ పరిస్థితులలో మేం కాఫీ పౌడర్‌ను అమ్మడానికి ఉపక్రమించామో మీకు మనవిచేశాను తనకు మీ తోటి మనిషికి ఒకడికి ప్రాణభిక్ష పెట్టడంకోసం వెంటనే తలా ఒక పేకెట్ కొనండి

[పుల్లేశ్వర్రావు రూపాయినోటు భలేరావు కిచ్చి పేకెట్ తీసుకుంటూవుంటాడు కుడివైపునుంచి తిమ్మేశ్వర్రావు వస్తాడు]

పు రండి! రండి! తిమ్మేశ్వర్రావుగారూ! చాలాకాలానికి దయచేశారు

భ మీరు సరిగా సమయానికి వచ్చారు తిమ్మేశ్వర్రావుగారూ! మీరు కూడా ఒక కాఫీ పేకెట్ కొనాలి.

★ మాలో మేం - ఆంధ్రులం ★

తి నాయనా! కాఫీ త్రాగుట తప్పు! కాఫీ వచ్చిన తరువాతనే మనదేశము చెడిపోయినది. కఠోర నియమములను పాటించవలసిన పూర్వసువాసినులు కూడా నేడు కాఫీ త్రాగుచున్నారనగా లోకమెంత చెడిపోయినదో ఊహించుడు.

భ. (కోపంతో) మీరు తాగకపోతే మానెయ్యండి కాని వ్యతిరేకప్రచారం మాత్రం చెయ్యొద్దు

పు: కూర్చోండి! యేమిటి యిలా దయచేశారు.

తి: (కూర్చుని) యీమధ్య హిందూ ధర్మ చట్టమునకు సవరణలను పేరుతో కొందరు హిందువులే హిందూమతమును కూలద్రోయుటకు పూనుకొనినారు. ఒక స్త్రీ విడాకులను యిచ్చి పెక్కు పురుషులను వివాహమాడవచ్చునట! యిదే జరుగుచో మన శ్రుతిస్మృతిపురాణేతిహాసములలో చెప్పబడిన భార్యాభర్తల కర్మబంధము గతి యేమి కావలెను? పరలోకములో భార్య ఎందరి భర్తలకోసము ఎదురుచూస్తూ కూర్చుండవలెను.

తు : తిమ్మేశ్వరరావుగారూ! హిందువులలో కొన్ని సవరణలు అవసరం. మీరు యింకా ఆ పూర్వకాలపు పరిస్థితులు కొనసాగాలనడంవల్ల లాభం లేదు.

కూ: తిమ్మేశ్వరరావుయొక్క అభివృద్ధి నిరోధక పంథాను మనం ప్రజలముందు బహిర్గతం చెయ్యాలి.

భ. కాలం మారిపోయింది తిమ్మేశ్వరరావుగారూ! మీ సిద్ధాంతాలను వినేవాళ్లెవరూ లేరిక్కడ!

[కుడివైపునుంచి పిచ్చేశ్వరరావు తొందరగా ప్రవేశిస్తాడు. అతని చేతిలో పేపరు వుంటుంది ముఖంలో ఉత్సాహం నిండి వుంటుంది]

పి: (సంతోషంతో) శుభవార్త! శుభవార్త!

తు ఎవరైనా కోటీశ్వరుడు తన ఐశ్వర్యాన్ని దానం చేశాడా!

కూ ఎక్కడైనా విప్లవం వచ్చిందా!

పి. (ఉత్సాహంతో) గొప్ప శుభవార్త! యీసమయంలో మీరందరూ యిక్కడ వున్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. శ్రద్ధగా వినండి (పేపరు చదువుతూ) "పార్లమెంటులో భర్తకు భార్య మనోవర్తి యివ్వాలన్న తీర్మానం గెలుపు!" (పత్రికను మూసి) యింతకంటె శుభవార్త మరేముంది చెప్పండి? పురుషులు తమ హక్కులను కాపాడుకోడానికి సాగించిన పోరాటంలో యిది మొదటి విజయం.

భ: పిచ్చేశ్వరరావుగారూ! కేవలం శుభవార్త అని సంతోషించినంత మాత్రాన ఏం ప్రయోజనం. ఈ శుభసమయంలో ఆంధ్రా కాఫీతో అల్పాహారవిందు ఒకటి ఏర్పాటు చేస్తే వ్యవహారం రక్తికడుతుంది.

పి (సంతోషంతో) అమోఘమైన సలహా చెప్పావోయ్ భలేరావ్! అయితే యీ భారాన్ని నీ భుజస్కంధాలమీద పెడుతున్నాను. వేగం అల్పాహార విందుకు ఏర్పాట్లు చెయ్యి. యిదిగో పదిరూపాయల నోటు! (జేబులోంచి నోటు తీసి భలేరావుకు యిస్తాడు)

భ. (నోటు తీసికొని) క్షణంలో అల్పాహారవిందు జరుగబోతోంది. కనక ఎవరూ తమ తమ స్థానాలనుంచి కదలవద్దని మా ప్రార్థన.

[భలేరావు నలుగురు విద్యార్థులతో కుడివైపు వెళ్లిపోతాడు]

తి (లేచి ఉపన్యాసధోరణిలో) ఆర్యులారా! లోకము రోజురోజుకు తగులబడిపోవుచున్నది. ప్రతి మానవుడు పరమార్థచింతమాని స్వార్థమునకు పాటుబడుచున్నాడు. ఈ పిచ్చేశ్వరరావు ఒక ధనవంతుని కూతును వివాహమాడినాడు. యితని పిచ్చిచేష్టలను సహించలేక ఆమె యితనిని విడిచిపెట్టినది.

పి: (లేచి మధ్యలో అందుకొని కోపంతో) లేదు! లేదు! అందుకు కావలసినంత కథ వుంది.

పు: (పిచ్చేశ్వరరావుతో) ఆయన చెప్పదలచుకున్న దేదో చెప్పనివ్వండి

(పిచ్చేశ్వరరావు విధిలేక కూర్చుంటాడు)

తి: (ప్రసంగం కొనసాగిస్తూ) తన భార్యను తన యింటికి పంపమని ప్రాధేయపడుచూ యీ పిచ్చేశ్వరరావు మామగారి యింటి చుట్టూ తిరిగినాడు మామగారు అందుకు నిరాకరించినాడు యిట్టి సమయమునందు భార్య భర్తకు మనోవర్తి యివ్వవలెనను తీర్మానము గెలిచినది. దీనివలన తుచ్ఛమైన స్త్రీ ధనముతో పిచ్చేశ్వరరావు యికముందు మరి ఘోరకార్యములకు పూనుకొనును. యీ పరిస్థితులయందు పిచ్చేశ్వరుని వైఖరికి నిరసన సూచకముగా నేనీ సమావేశమునుండి నిష్క్రమించుచున్నాను.

(తొందరగా కుడివైపు వెళ్లిపోతాడు)

తు : (లేచి) మన సమావేశమునుంచి మిష్టర్ తిమ్మేశ్వరరావు వాకౌట్ చేసినందుకు నేను విచారిస్తున్నాను. (కూర్చుంటాడు.)

కూ. (లేచి) యీ శాసనంవల్ల మనలో ఒకరికైనా తక్షణం ప్రయోజనం కలుగుతున్నందుకు నేను సంతోషిస్తున్నాను. (కూర్చుంటాడు)

పు ఇంతకూ పిచ్చేశ్వరరావుగారి చిరకాల వాంఛితం నెరవేరింది.

[కుడివైపునుంచి భలేరావు విద్యార్థులతో తిరిగి ప్రవేశిస్తాడు. నలుగురు విద్యార్థుల చేతులలోను నాలుగు ట్రేలువుంటాయి ఒక ట్రేలో కాఫీగ్లాసులు, ఒక ట్రేలో బిస్కట్లు, ఒక ట్రేలో సిగరెట్లు, మరో ట్రేలో కిళ్లీలు కనిపిస్తూవుంటాయి. టేబిలు మీద ప్లేట్లు సర్ది వాటిలో బిస్కట్లు మొదలయినవి పెడతారు]

పు (లేచి) శుభసమయాలలో జరిగే సమావేశాలు బృందగానంతో ప్రారంభమవడం మన ఆంధ్రదేశపు ఆచారం.


భ. (సంతోషంతో) ఓ! దానికేముంది. మేం సిద్ధంగా వున్నాం. మా విద్యార్థి బృందంవారి బృందగానంతో యీ అల్పాహారవిందు ప్రారంభింపబడుతున్నందుకు మేం మిక్కిలి సంతోషిస్తున్నాం.

[ఐదుగురు ప్రేక్షకులవైపు తిరిగి వరసగా నిలబడతారు. భలేరావు మిగిలిన విద్యార్థులతో కలిసి పాడడం ప్రారంభిస్తాడు]

బృందగానం:

మాలో మేం ఆంధ్రులం
మహోద్యమ నాయకులం
రోజు కొక ప్రకటన చేస్తాం
ఏదైనా త్యాగం చేస్తాం
ఎవరు చెప్పినా కాదంటాం
మాకు తోస్తే సరైనదంటాం
అవునంటాం అది కాదంటాం
అవసరమైతే చేస్తాం టాం టాం
మాలో మేం ఆంధ్రులం!
మహోద్యమ నాయకులం!!

[అల్పాహార విందు ప్రారంభమవుతుంది. వెంటనే తెర దిగుతుంది.] ★



వనితాలోకం

జపాన్‌లో వైవాహిక సంప్రదాయాలు

నవంబరు, డిసెంబరు నెలలంటే జపాను దేశంలో ఎక్కడ చూచినా పెళ్ళిళ్ళ సందడే. పెద్ద పెద్ద బౌద్ధదేవాలయాలు, షింటో దేవాలయాలు పెళ్ళిళ్ళ హడావిడితో కళకళలాడుతూ ఉంటాయి. హోటళ్ళు కిక్కిరిసి ఉంటాయి. మిఠాయి చేసి అమ్మేవాళ్ళందరకు చేతినిండా పని, జేబునిండా డబ్బు. చిన్నపిల్లలు రంగు రంగుల బట్టలతో, ఆటలతో, పాటలలో అల్లరిలో మునిగి ఉంటారు. ఈ రెండు మాసాలలో జపానులో డబ్బు ఒక చేతినుండి యింకో చేతికి పరిగెడుతుంది. అయితే పెళ్లిళ్ళకోసం, చేతికి వచ్చినట్టుగా డబ్బు ఖర్చుపెట్టే సంప్రదాయం క్రమేపీ తగ్గిపోతోంది. ముఖ్యంగా యుద్ధానంతరం పెళ్ళిళ్ళకు డబ్బు వెదజల్లే కుటుంబమే లేదని చెప్పాలి.

విందులకు, వినోదాలకు - వేడుకలకు, వివాహాలకు తలకుమించిన ఖర్చులు చేసే సంప్రదాయం జపాను దేశస్థులకు తరతరాల నుండి వస్తూవుంది. చేసే ఖర్చులకు రాబడికి పొందిక ఉండేదికాదు. పెళ్ళినాడు వధువు ధరించే "కిమానో" ఖరీదు రూ 1000 నుండి రు 1500 వరకూ ఉంటుంది. దానికి తగ్గ నగలు ధరించాలంటే మరొక రు 1200 అవుతుంది. పాశ్చాత్య దేశస్థుల గుడ్డలతో సరిపోలిస్తే, 'కిమానో' ఖరీదు చాలా ఎక్కువనే చెప్పాలి. పాశ్చాత్యులలో పెళ్లినాడు వధువు ధరించే దుస్తులు 300 రూ|| నుండి 350 రూ||లలో కొనవచ్చు. అందుచేత ఆర్థిక పరిస్థితులు కూడా జపాను దేశంలో వనితాలోకాన్ని పాశ్చాత్యదేశ దుస్తులవైపు మళ్లిస్తున్నాయి.

సంప్రదాయం ప్రకారం ఆడపెళ్లివారు, మగపెళ్లివారిని అన్నివిధాలా సంతోష

దారా నేస్తలింగం

పెట్టాలి. వివాహానంతరం, వనిత తన అత్తమామలకు, మగనికి అత్తవారింటిలో తదితరులకు అణగి, మణగి ఉండాలి. పెళ్లినాడు విరివిగా ఖర్చు పెట్టకపోతే, తరువాత అత్తవారింటిలో కూతురు ఏ సూటిపోటుమాటలు వినవలసివస్తుందోనని తండ్రి ఖర్చుకు లోటు చేయడు. అత్తవారింటిలో కాలు పెట్టినది లగాయతూ అందరకూ వధువు చేయశక్తులా సేవచేయాలి. అన్నివిధాలా వారి మెప్పును పొందని నాడు ఆమె జీవితమే దుర్భరమవుతుంది.

అందుచేత వివాహ దినంనాడు తండ్రి కూతుర్ని పిలిచి, నలుగురి పెద్దలముందూ నీతిబోధ చేస్తాడు. భార్యగా ఆమె జీవించవలసిన విధం, అత్తమామలకూ - ఆడపడుచులకూ మెప్పు కలిగించేవిధం చెప్తూ నీతులన్నీ ఏకరువు పెడతాడు. అంతేకాకుండా ఆమె చేతికొక కత్తి కూడా యిస్తాడు. "నలుగురిలో గౌరవం పొందుతూ, అత్తవారింటిలో మెప్పు పొందుతూ నీవు సంతోషంగా కాలం గడపలేని నాడు నీ జీవితం చాలించుకో తల్లీ" అంటాడు. ఆ మాటల అర్థం తెలిస్తే వివాహమంటపంలో కూర్చున్న ఏ విదేశస్థునికైనా ఒళ్లు జలదరిస్తుంది. నవీనాచారాలకు అలవాటుపడ్డ మనకు (భారతీయులకు) ఈ సంప్రదాయం కఠోరంగానే ఉండవచ్చు. కాని జపాను దేశస్థులు ఒక్క రోజులో ఈ ఆచారాలనెలా సంస్కరించగలరు? అంతేకాదు; వితంతు వివాహం చాలా నీచమైనదిగా పరిగణిస్తూ వచ్చేరు. ఇప్పటికీ వివాహం చేసుకోని వితంతువును సంఘం ఉత్తమురాలుగా పరిగణిస్తుంది.

వివాహం జరిగేరోజున కళ్ళకు కట్టినట్లు కనబడేది వధువు వివాహ దుస్తులపై ధరించే తెల్లని బట్ట - 'ఉచికాకె' అంటారు. తల్లి తండ్రుల నీడలో అల్లారుముద్దుగా పెరిగిన రోజులు గడచిపోయాయి. కొత్తయింటిలో, కొత్తవారితో కాయకష్టంచేసి మెప్పించి జీవించవలసిన కాలం వచ్చిందని దీనిభావం.

వివాహం మాత్రం వరుని ఇంటిలోనే జరపడం చాలా కాలంనుండి ఆచారంగా వస్తున్నది. వివాహ లగ్నం శీతకాలంలోనే నిర్ణయించడంలో కారణాలు లేకపోలేదు.

★ జపాన్‌లో వైవాహిక సంప్రదాయాలు ★

వివాహానికి విచ్చేసే అతిథులకు డాబుదర్పాలతో తాతలనాటినుండి వచ్చే విలువైన ఉన్ని దుస్తులు ధరించే అవకాశం శీతకాలంలోనే కలుగుతుంది. పెళ్ళినాడు కావలసిన పిండివంటలు, ఫలహారాలు, ఒకటి రెండు రోజులు ముందుగాచేసి చెడిపోకుండా దాచాలంటే శీతకాలమే అనుకూలంగా ఉంటుంది. శీతకాలంలో నడుమువంచి పని చేయాలంటే జపాను వనితలు వెనుతీయరు కాని వేసవికాలంలో ఏ చిన్న పనికైనా సరే భయపడతారు. అందుచేత తరతరాలనుండీ నవంబరు, డిశెంబరు నెలలే పెళ్ళిళ్ళకు నిర్ణయించబడినాయి.

వధూవరులను నిర్ణయించడం కూడా పాశ్చాత్య దేశాలలోవలె కాకుండా, భారతీయ సంప్రదాయాలకుమల్లే, మధ్యవర్తిద్వారా నిర్ణయిస్తారు. కులభేదాలు లేకపోవడంవల్ల వివాహాల విషయంలో పెద్ద చికాకు తప్పిపోయింది. కాని ఆర్థిక పరిస్థితులు, కుటుంబ చరిత, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంచడంలో మనవారి కెంతమాత్రమూ తీసిపోరు. ఈ మధ్యవర్తి ఉభయ కుటుంబాలను బాగా తెలిసినవాడై ఉండాలి. సంఘంలో ఉన్నతిపొందినవాడై ఉండాలి. మన తెలుగువాళ్ళమాదిరిగా జరీకండువా ధరించకపోయినా, ఈ మధ్యవర్తి వివాహ దినంనాడు గంభీరంగా చేతులు తిప్పుకుంటూ మాట్లాడడంలో ఎంతమాత్రమూ తీసిపోడు.

మనదేశంలో వరశుల్కం ప్రబలిఉంది. కాని జపాను దేశంలో సనాతనకాలంనుంచీ కన్యాశుల్కమే ఆచారం. యుద్ధానంతరం కన్యాశుల్కం చాలావరకు తగ్గిపోయింది. కన్యాశుల్కాన్ని పుచ్చుకున్న తల్లిదండ్రులు, అంతకు రెట్టింపు ఖర్చుచేసి వివిధ గృహపరికరాలతో సహా వధువుని అత్తవారింటికి పంపుతారు. ఆ విధంగా ఖర్చుచేయలేనినాడు వధువు తల్లిదండ్రులు చిన్నబుచ్చుకోవలసి వస్తుంది.

వివాహం సాధారణంగా వరుని యింటిలోనే జరుపుతారు. పైగా వివాహపు ఖర్చులు ఉభయపక్షాలవారూ భరిస్తారు. జపాను దేశంలో మద్యపాన నిషేధం లేదు. మామూలు రోజుల్లోకూడా బాగా మద్యం సేవించే జపాను దేశస్థులు వివాహోత్సవ దినాలు ఊరికే పోనిస్తారా? వివాహానికి విచ్చేసిన అతిథులు విందులు వినోదాలు మద్యపానాలలో మునిగిపోతారు. అతిథులంతా నూతన దంపతులకు రకరకాల కానుకలు అర్పించటంకూడా ఆచారం.

పెళ్ళికి ఎదిగివచ్చే పిల్ల యింటిలో ఉంటే జపాను దేశస్థులుకూడా గుండెమీద కుంపటిగా భావిస్తారు. తాహతుకు మించిన ఖర్చులు చేయాలికదా అని దిగులుపడతాడు తండ్రి. ఇంత విపరీతంగా ఖర్చులు చేయడానికి మగవాడికి ఎంతమాత్రం మనసొప్పదు. కాని, భార్య పెట్టే పోరుపడలేక రోటిలో తల దూర్చవలసి వస్తుంది మగవానికి. "కొంపమీద అప్పయినా తెచ్చి చిట్టితల్లి వివాహం ఘనంగా జరిపించకపోతే వీల్లేదు. దాని జీవితానికంతకూ తోటివారితో చెప్పుకొని గర్వపడవలసిన శుభకార్యం యిదేకదండీ. ఈ శుభకార్యం దాని జీవితంలో ఒక్కసారే వస్తుంది కాని, పదిసార్లు వస్తుందా? యింతకీ మన వివాహం మా నాన్న ఎంత ఘనంగా జరిపించేడో అప్పుడే మరచిపోయారా?" అని ఎత్తిపొడుపు సాగిస్తుంది యిల్లాలు. దానితో ఒప్పుకోక తప్పదు మగవాడికి.

అయితే కాలం మారుతున్నకొద్దీ దేశపరిస్థితులు అర్థంకావడంతో, ఈ రోజుల్లో కన్యలు ఈ భారీ ఖర్చుల వివాహాలను వ్యతిరేకించడం మొదలుపెట్టేరు. "ఒక్క పెళ్ళినాడు ధరించే ఈ దుస్తులకోసం వేలాదిగా డబ్బు ధారపోయడానికి బదులు, ఆ ఒక్క రోజుకోసం ఆ దుస్తులు అద్దెకెందుకు తీసుకోకూడదు" అని ఎదురు ప్రశ్న వేస్తుంది కాలేజీలో చదువుకున్న అమ్మాయి. ముఖ్యంగా యుద్ధానంతరం విద్యావతులైన యువతులంతా ఈ అర్థంలేని సంప్రదాయాలను మానుకోవాలని పోరాడుతున్నారు. "ప్రేమలేని వివాహమేమిటి? నేను ప్రేమించినవానికి బదులుగా, మా నాన్న తెచ్చిన కొయ్యను నే నెందుకు పెళ్ళిచేసుకోవాలి" అని ప్రశ్నించే యువతులిప్పుడు చాలమంది ఉన్నారు.

వివాహ విషయాలలో తమ అభిప్రాయాలు, ఆదర్శాలకోసం పోరాటంలో ఈ కాలం యువతు లెంతమాత్రం వెనుదీయడం లేదు. ఈ విషయాలపై చాలా కుటుంబాలలో మనస్పర్థలు కూడా కలుగుతున్నాయి. అయితే కాలప్రవాహానికి ఎగురీదలేమన్న సత్యాన్ని గుర్తించిన తల్లిదండ్రులంతా తమ పిల్లలకు అభిప్రాయాలలో, ఆచరణలో స్వేచ్ఛనిస్తున్నందువల్ల ఈ సమస్య నానాటికి తేలికపడుతోంది జపానుదేశంలో.

పాశ్చాత్యదుస్తులలో ఉన్నంత అందము, ఆనందము స్వేచ్ఛ కిమానోలో లేవనడం ప్రతి యువతికీ పరిపాటి అయింది. "కానుకలుగా ఈ పెట్టెగు కిమానోలు తీసుకొని వెళ్ళకపోతే మనకు నలుగురిలో నగుబాటు తల్లీ అని మా అమ్మ నాన్న గోలపెడితే తీసుకొనివచ్చేను కాని ఈ 'కిమానో' అంటే నాకు రోత" అని చేతులు తిప్పుకుంటుంది అప్పుడే కాలేజి విడిచి పెళ్ళిచేసుకున్న యువతి. "పెళ్ళికి నవంబరు, డిసెంబరు నెలలేమిటి? చక్కగా వేసవిలో పెళ్ళిచేసుకుని, వెంటనే ఏ సముద్రతీరానికో - హనీమూన్‌కి వెళ్ళకపోతే ఆ పెళ్ళి, పెళ్ళేనా" అని ప్రశ్నిస్తుంది మరొక పట్టభద్రురాలు.

ముప్పైనలభై ఏళ్ళక్రితం లేని డిపార్టుమెంటు స్టోర్సు ఈరోజున జపాను ప్రజా జీవితంలో అతి ముఖ్యపాత్ర వహిస్తున్నాయి. ఏ ఊరిలో చూచినా మిక్కిలి ఎత్తైనది, పెద్దదైన భవనం డిపార్టుమెంటు స్టోరే. దినవెచ్చానికి అవసరమైన ఉప్పు, కారం మొదలు బ్రహ్మాండమైన విందులకైతేనేం, చిన్న కాగితం పిన్ను నుండి టెలివిజనువరకు యంత్రపరికరాలైతేనేం, ఏది కావాలిస్తే అది ఈ స్టోర్సులో దొరుకుతుంది. నవంబరు, డిసెంబరు నెలల్లో ప్రత్యేకంగా ఈ స్టోర్సువారు విశాలమయిన గదులను అలంకరించి వివాహోత్సవాలకుగాను విడిచిపెడతారు. ఉచితంగా వివాహోత్సవంకోసం దొరికే ఈ స్టోర్సు భవనాలలో వివాహాలు జరపడం నానాటికి ప్రబలమయింది. వివాహానికి అవసరమైన వివిధ వస్తువులను, పిండివంటలు, భోజనసామగ్రికి అవసరమైన వస్తువులను కొనడానికి, సంపాదించడానికి, కాలమూ శక్తి వృథాపరచే అవసరం లేకుండా, సగానికి సగం వివాహాలు ఈ డిపార్టుమెంటు స్టోరులోనే జరుపబడుతున్నాయంటే, వాటి ప్రాముఖ్యత అర్థమవుతుంది.

కాలక్రమేణా తిథి, వార, నక్షత్రాలతో పనిలేకుండా వివాహాలు జరిగిపోతున్నాయి. వివాహ దినంనాటి దుస్తులు అద్దెకు తెచ్చి, చాలా తక్కువలో వివాహాలు పూర్తి చేసి చాలా కుటుంబాలు తేలిక పడుతున్నాయి. ఇంతకూ వరుని ప్రత్యేక వివాహ దుస్తులు ఉన్నాయనుకుంటారేమో మగవానికి వివాహదినంనాడు కూడ మామూలు సూటే! అదే నాకు ఆశ్చర్యం కలిగించింది. ★

వనితా లోకం:

ఆమె అభిప్రాయం

1

రోజూ ఆఫీసు సాయంత్రానికే మూసేస్తారు! అయినా, కృష్ణమూర్తి ప్రతిదినం రాత్రి ఏ ఎనిమిది తొమ్మిది గంటలకో గాని ఇల్లుచేరడు కనుకనే, ఆనాడు కనుచీకటి వేళకే కృష్ణమూర్తి ఇంటిలో కాలు పెట్టగా, గొప్ప వింత చూడవచ్చినట్లు ఎదురొచ్చింది, లక్ష్మి! వచ్చి, మందహాసంతో సరసంగా "ఊరకరారు మహానుభావులు!" అని కూడా రాగవరసని అంది అతనూ చిరునవ్వుతో కోటు తీసి ఆమె చేతికందిస్తూ "అవునవును! మా నాన్న ఇవ్వాళ చిన్న ఉత్తరమొకటి రాశాడు" అన్నాడు

"చిత్రంగా వుందే! వేళకి ఇంటికి రాని వాడు వచ్చెయ్యడం - సాధారణంగా ఎవ్వరికీ జాబులు రాయని మామగారు, అందులో ఈ సుపుత్రుడికి ఉత్తరం వ్రాయడం - అంటే, ఏదో గొప్ప విశేషమే వుండాలి!"

"ఏమీ లేదు! అమ్మకి ఒంట్లో బాగో లేదట! ఒదినకి నిండు నెలలట! ఇంట పరిస్థితులూ ఏమీ సరిగా లేవట! ఏ వేళకి ఏం జరిగినా ఆదుకో నేవారే లేరట!" బూట్లు విప్పుకొంటూ వివరిస్తున్నాడతను

అప్పటికే ఆమె జరుగనున్నది అర్థంచేసుకుంది కాబట్టి, నన్నొకసారి అక్కడికి పంపడం చాల మంచిదని మామగారు వ్రాశారు - అంతేనా?" అన్నది!

ఒకసారి తలెత్తి భార్యని చూచి, తిరిగి తలొంచుకొని "ఆఁ! ఎంత తొందరగా నిన్ను పంపితే అంత ఉత్తమంగా వుంటుందని వ్రాశారు!" అన్నాడు

"అందుకని, నన్ను పంపితే మంచిదనే మీరూ నిశ్చయించేసుకొని - ఆ వార్త ఎంత పెందరాళే చెప్దామా అని ఇలా పరుగెత్తుకొచ్చారు! అవునా?" అందామె ఆమె కుశాగ్రబుద్ధి అతని కేమీ ఆనందం కలిగించలేకపోయింది!

కొంచెం కోపంగానే ముఖం చిట్లించుకొని "అవును, తొందరలోనే నీవు వెళ్లాల్సి వుంటుంది!" అన్నాడు

"అలాగా! కాని, నేను వెళ్ళదల్చుకోలేదు!" అని లక్ష్మి నిష్కర్షగా చెప్పేసింది!.. కృష్ణమూర్తి నిర్ఘాంతపోయాడు.

"అదేమిటే, నిన్న మొన్నటిదాకా నీవేగా, నా ఒంట్లో ఏమీ బాగోడం లేదు, మీతో ఈ పిల్లల్తో వేగలేకపోతున్నానని కూడ, కొంతకాలం మా అమ్మ దగ్గరకో లేక అత్తయ్యవద్దకో పోతానంటూ పోరు పెట్టూ వచ్చావ్?" అని, చమత్కారంగా "ఏం? మామగారింటికి వెళ్లాల్సి వస్తుందని ఇలా గంటున్నావా, ఏమిటీ? పోనీ, మీ పుట్టింటికి పోగలవా?" అన్నాడు.

"ఎక్కడికీ వెళ్లను! నిన్న మొన్నటిదాకా వెళ్తానన్నానంటే - మరి నిన్న మొన్నటిదాకా నా మెళ్ళో నాను, నానులాగే వుంది మరి. ఇప్పుడేది? ఆ నగ తిరిగి నా మెళ్ళోకొచ్చేదాకా నేనీ గడపదాటి పోదల్చుకోలేదు! అంతే!" అని నిక్కచ్చిగా చెప్పి, ఆమె విసవిసా వంటింట్లోకి వెళ్ళిపోయింది!...

కె. పి. బాబు

క్షణకాలం కృష్ణమూర్తి గుండెపోటు వచ్చినంత పనయింది అంతకు వేయింతలు బాధ అనుభవించాడు! ఆ బాధ అతనిలో క్రోధాన్ని ఇనుమడింపచేసింది! చరచర పోయి ఆమెతో "ఆహాఁ! అలాగా! అయితే నాకేం? రేపే మీ కోడలింతలో రాదల్చుకోవడం లేదట అని ఒక కార్డు ఆయనకి రాసి పారేస్తాను!" అంటూ వెళ్లిపోయాడు! లక్ష్మి బిత్తరపోయింది!...

* * *

ఇంతకీ ఆ 'నాను' సంగతేమిటంటే—

దీపావళి ముందొకనాడు తెలతెల వారొస్తోంది! గదిలో చీపురుతో నేల ఊడుస్తున్న శబ్దం వినిపిస్తున్నది! మంచంమీద పడుకొన్న కృష్ణమూర్తి కళ్లు తెరిచి చూచాడు కొద్దిగా! కన్ను తెరువకపోయినా రాత్రిఅంతా అతనికి నిద్ర లేనేలేదు! . .

ప్రస్తుతం అతనికి డబ్బు అవసరమైంది! ఒకవంక, మిత్రుడొకడ్ని ప్రాణాపాయస్థితిలోనుండి కాపాడాలి; మరోవంక దీపావళి మీదకొస్తోంది! కాని నెలాఖరు రోజులు.. ఒకటో తారీఖునాటికైనా జీతానికి మించిన ఋణబాధ కన్పిస్తూనే వుంది! అతనిన్ని రోజులూ ఆ అప్పులు ఎలా సర్దుబాటు చేసుకురావాలా అనే ఆలోచిస్తూ వచ్చాడు.... ఉపాయం చిక్కలేదు సరిగదా, ఈ క్రొత్త అవసరాలొకటి హఠాత్తుగా మీదపడ్డాయి! మరి చిక్కైపోయింది! బంధుమిత్రుల్లో తనకి, అప్పు ఇవ్వకూడదనుకొనే వాళ్లెవ్వరూ వుండరు కాని, ఇవ్వగల్గేవారే కన్పించడం లేదు! ఇంట్లో భార్యాబిడ్డల తాలూకు నగానాణేలన్నీ ఎప్పుడో తుడిచివేశాడు...తనవి అంతకన్నా ముందే!..... మరిక ఎలాగు? ఎలాగో అంటూనే ఆ రాత్రిఅంతా కళ్లు మూసుకొని నిద్ర నటిస్తూ కాలక్షేపం చేశాడు! ..

ఇప్పుడు మళ్ళీ కళ్లు మూసుకొని, వెల్లకిలా పండుకొని, తలక్రింద చేతులుంచుకొని, దీర్ఘాలోచన ఆరంభించాడు!.. గది వూడుస్తూ లక్ష్మి క్రమంగా అతని మంచం చేరువకొచ్చింది ఆమెకూడా ఏదో ఆలోచిస్తూ, వంగి ఎడం చెయ్యి నడుం వెనక్కి పెట్టుకొని, కుడిచేత్తో చీపురుతో నేల వూడుస్తూ అడుగులో అడుగు వేస్తూ కృష్ణమూర్తి మంచాన్ని సమీపించింది! .... ఊడ్పు చప్పుడు దగ్గరైనప్పుడు కృష్ణమూర్తి తిరిగి కళ్లు తెరిచి చూచాడు. ఆమె అప్పుడతనికి చాలదగ్గరలో వుంది! వెల్తురు కూడా కొద్దికొద్దిగా కిటికీలగుండా గదిలోనికొస్తోంది!...

ఆమె ముఖం చాల గంభీరంగా వుంది. జుట్టు విచ్చలవిడిగా, కొంత ముఖంమీదా, కొంత మెడ కిరుప్రక్కలా, మరికొంత వీపు మీదా పడ్తూ లేస్తూ అందంగా వుంది. దుస్తులు కూడా ఒక అగుపులజ్జల్లో లేనట్లుగా ఉన్నాయ్.

స్త్రీ సౌందర్యం - బాల్యం, యవ్వనం, ప్రౌఢం, వృద్ధాప్యం—వీనిలో ఎప్పుడు బలంగా ఆకర్షిస్తుందయ్యా అంటే - ప్రౌఢ వయస్సులోనే నిజంగాను- అనుకొన్నాడు కృష్ణమూర్తి ఆమెని చూస్తూ. అతనికి విపరీతంగా మోహం కలుగసాగింది. కాని అంతలోనే లక్ష్మి మెడలోనున్న బంగారు నానూ, నల్లపూసల గొలుసూ-వంగిన ఆమె మెడనుండి పొగ్గా ఊగిసలాడ్తూ అతని కంటబడ్డాయ్! చివరికా సంసారంలో మిగిలిన బంగారమల్లా అది మాత్రమే!.. అవి కంటబడ్డంతోనే అతని మోహోద్రేకం కాస్తా మంచులా కరిగిపోయినట్లైంది! ఆ వెంటనే అమోఘమైన ఆలోచనలు ఏవేవో కల్గి అతని మనోవ్యథ చాల తీరిపోయినట్లనిపించింది!..

అంతే-మళ్లీ కన్ను మూసేసుకొని కృష్ణమూర్తి ఆలోచిస్తూ నిద్ర నటించాడు! లక్ష్మి ఇదేమీ గమనించని కారణంచేత, తన పని తాను చేసుకొని ఆవలికి వెళ్లిపోయింది!...

★ ఆమె అభిప్రాయం ★

అలవాటుప్రకారం ఉదయం ఏడు గంటలకి పాప వచ్చి కృష్ణమూర్తిని "నాన్నా లే! లే నాన్నా!" అని తట్టి లేపింది. మగత నిద్రలో లేవకుండానే "ఊఁ!" అని గట్టిగా మూల్గి బిర్రబిగిసి పండుకొన్నాడు!. ... పిలిచి, పిలిచి విసిగెత్తి వెళ్ళిపోయిందాపిల్ల!.. ఎనిమిదిగంటల ప్రాంతంలో అమ్మ వేసిన పెసరట్లు పంచదార నంచుకొని తింటూ, ఎక్కడ చేతిలోని ప్లేటు క్రిందపడిపోతుందోనన్న భయంతో, చిత్రంగా నడుస్తూ చిట్టిబాబు వచ్చాడు! వచ్చి కృష్ణమూర్తిని "లే నాన్నా! లే! అమ్మ కాఫీకి రమ్మంటూంది నాన్నా! రా!" అని పిల్చాడు! కాని కృష్ణమూర్తి కదల్లేదు మెదల్లేదు! వాడు కాస్సేపు పిల్చి పిల్చి - తిరిగి తన తిండి ధ్యానంలో పడిపోయి, తిని, ప్లేటు మంచం క్రిందకు త్రోసేసి - పంచదార పాకం చేతులు ఒంటికి రాసుకొంటూ వెళ్ళిపోయాడు!... తొమ్మిదిన్నరైంది! పెద్దబ్బాయి స్కూలుకిపోతూ ఆ గదిలోకి తొంగిచూచి కంగారుపడి "నాన్నా! ఇంకా లేవలేదూ? ఆఫీస్ టైం అయ్యింది నాన్నా - లే!" అంటూ వచ్చి లేపాడు కాని, అప్పటికీ కృష్ణమూర్తి కిమ్మనలేదు! ఇటునుండి అటు తిరిగి మంచాన్ని మరింత గట్టిగా కరచుకొని పండుకున్నాడు! . ఇంటావిడికి రిపోర్టు వెళ్ళిపోయింది!

గాపీగా పనులన్నీ ముగించుకొని మరీ లక్ష్మి గదిలోకి వచ్చింది! సరసంగా భర్త మీద వొరిగి, అతని ముఖంలో ముఖంపెట్టి మందహాసంతో "ఏమండోయ్, లేవండీ! ఏమిటీ విశేషం!" అంది అప్పటికి అతను భారంగా కదిలి కళ్ళు తెరిచాడు! "ఏమిటి విశేషం? ఆఫీస్ టైం అయిపోయిందే! మీరింకా నిద్రలేవలేదు" అన్నది తిరిగి. "రాత్రి నుండీ ఏమీ బాగాలేదు" అన్నాడు. "ఆ సంగతి మిమ్మల్ని చూస్తుంటేనే తెల్సిపోతూవుంది!" "నిజంగా, నా మనస్సేమీ బాగోలేదు లక్ష్మి!" అన్నాడతను. ఆమె నవ్వింది - "బాగానేవుంది కాని, ఎందుకండీ ఇంకా ఈ పిల్లచేష్టలు? ఎవరన్నా చూస్తే నవ్వుతారు, లేవండిక! అనవసరంగా ఆఫీసు ఎగ్గొట్టి ఏం లాభం సంపాదిస్తారండీ? లేవండీ!" అంటూ బలవంతాన లేపింది. ఆ సమయంలో తిరిగి అతని కళ్ళని ఆమె మెడలోని ఆ బంగారు "నాను" ఆకర్షించింది!.. ఇంక తప్పదన్నట్లు లేచి, ముఖం కడిగి స్నానంచేశాడు! పెసరట్లూ, కాఫీ తెచ్చిపెట్టింది. "ఉహుఁ!" అని లేచి పోబోయాడతను.

"ఏమండీ?" అనడిగిందామె.

"నిజం - నాకేం బాగాలేదివ్వాళ!"

"ఏమి?"

"ఏముందీ? చాల అవసరం - డబ్బు!" అన్నాడు చాల సాధారణంగా! ఆమెకూడా నిర్వికారభావం నటించి, మందహాసంతో "అవునూ - ఇప్పుడది మనకు చాల అవసరమే, మరి! దీపావళీ దగ్గరకొస్తున్నది - పిల్లలకైనా బట్టలూ అవీ కొనాలిగా? ఎట్లాగూ ఆఫీసెగ్గొట్టారు - ఈ పెసరట్లు తిని, కాఫీ త్రాగి అలా ఊళ్ళోపడి సంపాదించుకురండీ!" అన్నది. అతనికి ఉక్రోషం, క్రోధం ఉబుక్కొచ్చాయ్! పళ్ళు బిగపట్టి లేచి అవతలికి వెళ్ళిపోయాడేగాని, లక్ష్మి కళ్ళల్లో నీరు గిర్రున తిరిగిన సంగతి మాత్రం గుర్తించలేకపోయాడు!

అలా పోయి - తిరిగి తిరిగి భోజనంవేళకి 'ఉస్సూ'రంటూ ఇల్లుచేరుకున్నాడు కృష్ణమూర్తి! తిన్నగా తన గదిలోకిపోయి బట్టలైనా విప్పకుండానే వాలుకుర్చీలో, నీరసంగా పండుకొన్నాడు! ఆ వెంటనే పాప వచ్చి "రా నాన్నా! అమ్మ భోజనానికి రమ్మంటూంది నాన్నా!" అంది. కృష్ణమూర్తి ఆ పిల్లని గుర్రుమని చూచాడు! బెల్లబోయి పాప పారిపోయింది లోనికి!

మరి కొంతసేపటికి లక్ష్మి వచ్చింది! "భోజనానికి లేవరూ!" అంది "ఉహుఁ! ఆకలిగాలేదు" అన్నాడు.

"ఓహో! చిక్కిన డబ్బుతో హోయిగా స్నేహితులతో కలిసి విందు లారగించి వచ్చారా?" అంది వికాసంలేని మందహాసంతో!

"అవునవును కాని, తమ రిక దయచేయండి!" అని గసురుకొన్నాడు

లక్ష్మి పోలేదు! అతని దగ్గరకుపోయి "నన్నేం చెయ్యమంటారో చెప్పరాదా? ఎందుకిలా ఏమీ బయట పెట్టకుండానే అలిగి ఏడ్పిస్తారూ?" అంటూ బ్రతిమలాడింది

"నాకవసరమైంది దొరక్క నేనుచస్తుంటే, మధ్య నీగోల ఒకటా? వెళ్ళు - వెళ్ళు!" అని ముఖం త్రిప్పేసుకొన్నాడతను!

"మీకవసరమైంది మీకే చిక్కనప్పుడు, ఇక నాకేమి చిక్కుతుంది - చెప్పండీ?"

"ఆఁ! తల్చుకొంటే ఎన్నైనా చిక్కుతాయ్ లెద్దూ!"

"నాకా? ఇంకేమున్నాయనీ - వినకంటే ఆ అరవంకీలూ, వడ్డాణాలూ, నాగరాలూ, నెక్లేసులూ, గొలుసులూ, గాజులూ అవీ—"

"చాల్చాలు! దండకం ఆరంభించావూ?"

"దండకమేముందండీ? వెనుక అవేవో నాల్గు బంగారానివి ఉన్నై కనుక, అవసరాలు గడుపుతూ వచ్చాయ్! చివరికి పిల్లల వస్తువులు సైతం ఆ మార్వాడీ పాల్జేశాం గదా! ఇంకేమున్నాయనీ!"

కృష్ణమూర్తి 'గభాల్న లేచి కూర్చుని "ఎందుకులేవూ? నిజంగా అవసరం తీర్చాలనుంటే ఆ నానులేదా? ఆ నల్లపూసల గొల్సులేదా?" అనేశాడు! .

కొయ్యబారిపోయింది లక్ష్మి! "ఏమిటీ? మీకేమన్నా మతిపోయిందా అవేం మాటలండీ?" అంది తేరుకొని.

"ఇదిగో, నాచేత ఎందు కనిపిస్తావ్ - నివ్వెందుకు బాధపడ్తావ్ గాని, అవతలికిపో! నా బాధేదో నేను పడ్తాను! ఊఁ! వెళ్లూ!" అని లేచి పచార్లు చేయ నారంభించాడు . కొంగులో కన్నీ రద్దుకొంటూ అవతలికి వెళ్ళిపోయిందామె!

ఆ రాత్రికికూడా కృష్ణమూర్తి ఇంట్లో భోజనం చేయలేదు!... మొదటి ఆట సినిమా ఒదిలిపెట్టిన అరగంటకి ఇల్లుచేరుకొన్నాడు. పిల్లలంతా నిద్రపోతున్నారు; కాని లక్ష్మి మాత్రం మేలుకొని వీధి గుమ్మంలోనే దిగులుగా కూర్చుంది! ఆమెను గమనించనట్లే,

ఆమెను రాముగాడే లోనికి పోయాడతను అతన్ని వెంబడించి ఆమె లోనికివెళ్ళింది! "ఏమండీ? భోజనం చెయ్యరూ?" అంటూ ఎంతో మృదువుగా పిల్చింది. కాని కృష్ణమూర్తి నిర్లక్ష్యంగా మంచంమీద కూలబడ్తూ "అక్కర్లేదు" అన్నాడు!

లక్ష్మి భర్త కెన్నోవిధాల అతని ప్రవర్తన ఎంత అపహాస్యమైందో నచ్చజెప్పడానికి ప్రయత్నించింది! కాని ససేమిరా కృష్ణమూర్తి లొంగలేదు! చేసేదేమీ లేక లక్ష్మి అతని మంచానికి చేరువలోనే నేలమీద కొంగు పర్చుకొని దుఃఖిస్తూ పండుకొన్నది!...

* * *

ఆ మరునాడు కూడా మూర్తి ఆఫీసుకి పోలేదు! కాఫీ త్రాగలేదు! భోజనం చేయలేదు! . ఇంట్లోనే కాలుగాలిన పిల్లిలా పచార్లుచేస్తూ, పిచ్చివానిలా ఆలోచిస్తూ ఉండిపోయాడు!...

వంటగదిలో సామాన్లు సర్దుకొంటూ ఇక తుదినిర్ణయం చేసుకుంటున్నది లక్ష్మి! ప్రపంచం ఎంత పరివర్తన పొందుతున్నా నేటికీ సంఘంలో ఆడది అబలగానే, మగాడు పౌరుషంగానే ఉంటున్నారు! ఇప్పుడాయన ఆఫీసు ఎగ్గొట్టినా, రాజీనామా ఇచ్చేసినా ముందు బాధపడేది, అర్ధాంగి ఐనందుకు తానేగదా! ఆయనకేం-ఒంటరిగా, హాయిగా ఎక్కడో ఒకచోట ఏదో ఒకవిధంగా జీవించగలడు! కాని, తానో, ఈ పిల్లలో! చివరికి ప్రకృతికూడా ఆడవాళ్ళనన్యాయంచేసింది! ఇక అటు అత్తమామలు - 'మా అబ్బాయికి నిద్రాహారాలు లేకుండా చేసి, మతిపోగొట్టి, ఉద్యోగమూ ఊడబీకించి, మానెత్తి నెక్కవచ్చావా?' అని ఎంత రభస చేస్తారు!. పోనీ, ఆయన కోరినట్లు ఇచ్చేస్తే - ఆయన్ని అన్నివిధాలా నాశనం చేసేస్తున్నా వంటారు! ఇప్పుడాయన్ని ఇలా వ్యతిరేకిస్తే - రేపు వాళ్ళే, వాడు కోరినట్లుచేయక మా తల్లీ, మాకొంపకి చిచ్చు ముట్టించావే అంటారు! ఎన్ని చావులోగదా ఆడదానికి?. ఏది ఏమైనా ముందు తానొక నిశ్చయానికి రావడమన్నది అవసరమనిపించింది లక్ష్మికి!


అలానే ఆలోచించి భర్తని సమీపించింది!. అవును గాని, తమ కెంతో మంది గొప్ప గొప్ప మిత్రులూ బంధువులూ ఉన్నారని చెప్తుంటారే!- మరి ఈ కాస్తంత అవసరం గడవడానికి ఒక ఆడదాని నానే కావలసివస్తుందంటే, చాల ఆశ్చర్యంగా వుందండీ?"

లక్ష్మి మాటలలోని వ్యంగ్యాన్ని అర్థం చేసుకొనే స్థితిలోలేడతను! అతని ధ్యాసే వేరుగావుంది. పెళ్ళాం మెళ్ళో నానైనాసరే తాకట్టుపెట్టి, అవతల బాధపడ్తున్న ఆ మిత్రునికి సాయపడి 'సెభాష్! ఆదర్శమిత్రుడు - త్యాగమూర్తి' అనిపించుకోవాలి! అంతే...

"ఆఁ! ఇప్పుడా రామూగాడి గతేమయ్యిందేమిటే? వాడి సంగీతానికి మైమర్చిపోయి, తింటే గారెలు తినాలి వింటే రామూ సంగీతమే వినాలని వేదికలెక్కి లెక్చర్లిచ్చిన వారు సైతం వాడి దరిద్రాన్ని పోగొట్టే ప్రయత్నం చేయరు చివరికిప్పుడు వాడి ప్రాణంమీదకొచ్చినా ఆదుకొనే దాత కన్పించలేదు! అంతే, ఎవరికి సంగతైనా?" అంటూ నిట్టూర్చి "పాపం! వాడి పెళ్ళాం, నిండా ఇరవయ్యేళ్ళుండవ్ - వట్టి బేలమనిషిగదా! ఊరికే కంగారు తినేస్తూవుంది" అని కృష్ణమూర్తి చాల హృదయవిదారకంగా వర్ణించాడు!


"అయ్యో పాపం! అటువంటి వాళ్ళకి చేతనైన సాయంచేసి తీరాల్సిందేకాని, ఏ భారత స్త్రీ కూడా తన మాంగల్యాన్ని తన బొందిలో ఊపిరివుండగా తీయలేదుగదా - మీకు తెలియనిదా?" అన్నది లక్ష్మి మెల్లగా! కాని, కృష్ణమూర్తి వికటంగా నవ్వి "ఏ భారతీయుడు కూడా తన మిత్రునికి ప్రాణంమీదకొస్తే చూస్తూ ధర్మపన్నాలు పల్కుతూ నిశ్చింతగా కూర్చోగలడా? అదీగాక, మీ పవిత్ర మాంగల్యాలు ఎవరికి అక్కర్లేదు - వాటిని మీవద్దనే భద్రపర్చుకొని ఆ బంగారు నానుత్రాడు మాత్రం ఇమ్మని కోర్తున్నాను - తెలుసా?" అన్నాడు

"భర్త ప్రాణంమీదికొస్తే ఆ బంగారు నానుత్రాడునేకాదు, తన పవిత్ర మాంగల్యాన్ని సైతం ధారపోయడాని



వెండియంచు

అనడిలో జరిగినకాం



ల నీలిమేఘం
రెస్ మహాసభ దృశ్యం
టో. జి. రామలింగేశ్వర రావు.

★ ఆమె అభిప్రాయం ★

ఓ బొంత స్త్రీయైనా సిద్ధంగానే వుంటుంది మరి - ఆ రమాగారి భార్యామణి ఏం చేస్తున్నట్లు?' అంది లక్ష్మి సూటిగా!

కృష్ణమూర్తి కొంచెం తొట్రుపడినా, వెంటనే తేరుకొన్నాడు - "నీవిస్తే ఇవ్వు! లేకుంటే లేదు - అంతేగాని అల్పబుద్ధిలో తేలికమాటలాడకు" అంటూ గద్దించాడు!

లక్ష్మికి భర్త ధోరణి బాగా బాధ కలిగించింది! "నేను అల్పబుద్ధిదాన్నే. నేను తేలిగ్గానే మాట్లాడుతాను - ఇన్ని తెలిసి నన్నే అడుగుతా రెందుకూ? మీ చెల్లెలు గారు ఆదర్శప్రాయులూ, సంస్కార హృదయులూ గదా - పోనీ, ఆమె నడిగి ఓ చిన్న నగ తెచ్చుకోరాదా? ఏమండీ?" అనేసింది!... కృష్ణమూర్తి పెద్ద చెల్లెలు ఆ వూర్లోనే కాపురం చేస్తోంది!

భార్య మాటలతనికి ఉద్రేకం కల్గించాయ్! "ఏమిటే వాగుతున్నావ్? మళ్ళీ వాగు చెప్తాను!' అంటూ లేచాడు. సహోద్రేకంతో లక్ష్మి తిరిగి సూటిగా చెప్పింది! వెంటనే ఆమె గూబ 'గుయ్' మనిపించి, కృష్ణమూర్తి గిర్రున తిరిగి బయటికి వెళ్ళిపోయాడు!..

తిరిగి కనుచీకటివేళకి ఇల్లు చేరాడు. పిల్లలు ఇంకా వీధిలో ఆటలాడుకొంటున్నారు! లక్ష్మిని వెతుకుతూ లోనికి పోయాడతను ఆమె లోన తన పూజాస్థానంలో కూర్చుని, బహునిష్ఠతో, శ్రద్ధగా దేవుళ్లని ఆరాధిస్తోంది! ఆమె ముందు పూజాపీఠంపైన దీపాల వెలుగులో మెరిసిపోతూ ఆమె బంగారు నాను కన్పిస్తోంది!. నిశ్శబ్దంగా దగ్గరచేరి అదంతా చూస్తూ నిల్చుండిపోయాడు కృష్ణమూర్తి కాని, లక్ష్మి అతని రాక నెలా పసికట్టిందో ఏమో గాని, చట్టున లేచి, ఆ నగ తీసి మౌనంగా భద్రంగా భర్తచేతుల కందించింది!

అప్పుడామె గంభీరమైన ముఖం ముడుచుకొనివుంది! ఆమె అందమైన కళ్లు విడుస్తున్నై. ఆమె చక్కని పెదాలు వణికిపోతున్నాయ్! ఆమె మెడలో పసుపుత్రాడు క్రొత్తగా చక్కగా కన్పిస్తూవుంది!..

ఇదంతా చూచాడతను! చట్టున తలొంచుకొని ఆ నగని పంట్లాం జేబులో భద్రపర్చుకొని బయటకి వెళ్ళిపోయాడు!

మళ్ళీ ఇల్లుచేరేసరికి తొమ్మిదిదాటింది! పిల్లలంతా గాఢనిద్రలో వున్నారు! లక్ష్మి వచ్చి తలుపు తీసి తనగదిలోకి పోయి పడుకొన్నది.. మూర్తి మెల్లగా తన గదిలోకి పోయి మంచంమీద పండుకొని, చాలసేపు అటు ఇటు పొర్లాడు, కాని - అతనికి నిద్ర పట్టేట్లు తోచలేదు!.. కొంతసేపు ఆలోచించి, ఆలోచించి లేచాడు మెల్లగా లక్ష్మి దగ్గరకు వెళ్ళాడు! ఆమెగోడవైపు తిరిగి పండుకొని ఇంకా ఆవేదనతో ఆలోచిస్తూ వుంది! భర్త కరస్పర్శకు తలత్రిప్పి చూచింది! ఆమె చూపులతి జాలికరంగా వుండి, అతని కళ్ళకు మాత్రం వాడిపూవుల్లా కన్పించాయ్!. ఆమెపైకి వంగి, ఆప్యాయంగా భుజం తట్టూ, మందహాసంతో "లే!" అన్నాడు "ఎందుకూ?" అందామె చిరాగ్గా "ఉస్! లేచిరా! చెప్తానుగా" అన్నాడు. "ఉహుఁ!" అందామె "ఉహుఁ! రావాలి!" అని మళ్లీ తట్టాడు. రానని బిర్రబిగిసిందామె! "మర్యాదగా వస్తావా, లేక ఎత్తుకొని పోవాలా?" అన్నాడు నవ్వుతూ. అభిమానంతో "ఉహుఁ నాకేం బాగాలేదివ్వాళ!" అని విదిలించుకొందామె! కాని, మూర్తి వదిలిపోలేదు! "అవునూ - ఇలా వుంటే ఏమీ బాగోదు! అందుకే అలా పోదాం రా! ఊఁ!" అంటూనే తమాషాగా కితకితలు పెట్టి ఆమెను లేవనెత్తుకొన్నాడు! దానితో ఆమె తేలికైపోయి అతని బాహువుల్లో వాలిపోయింది!

2

దీపావళి వచ్చింది .వెళ్లింది! ఒకటో తారీఖు వచ్చింది వెళ్ళిపోయింది! కాని, అనుకొన్నవిధంగా లక్ష్మి నగ తాకట్టునుండి ఆమెను చేరనేలేదు! కృష్ణమూర్తి మాత్రం యథావిధిగా తన వ్యాపకాలు - నాటకాలు, సినిమాలూ - మిత్రులు, పత్రికలకు తన సంపాదన వెచ్చిస్తూనే వస్తున్నాడు! . ఈ వ్యవహారమిక ఇట్లా తేలదనుకొనే ఆమె తన మెడలో ఆనగలేనిదే ఆ యింటి గడప దాటిపోనని పట్టుబట్టింది! కాని, ఏంలాభం ఆయన వెళ్లమన్నా తానే పోనన్నట్లుగా సృష్టించి మామగార్కి ఉత్తరం వ్రాస్తారట! ఆలస్యం చేస్తే అంతపని చేసేస్తారు కూడా! కాని, అది ఎంత ప్రమాదం తెస్తుంది!.. అత్తగారికి ఒంట్లో బాగోలేదని రమ్మంటే రాలేదని ఆమె ఏమైనా చేస్తుంది గదా! తనకు నెలలునిండి పిల్లా పీచులో నానా అవస్థ పడ్తుంటే సహాయం రాలేదని తెలిసి తోటికోడలెంత బాధపడ్తుంది! బావగారెంత ఆగ్రహిస్తారు! ఇంతకీ తన మాట త్రోసివేసినందుకు మామగారింక తన ముఖం చూస్తారా?

ఇంతకీ మగవాళ్లేమిచేయడానికైనా వీలుంటుంది! వాళ్లేమిచేసినా చక్కగానే ఉంటుంది - అనుకొని నిట్టూరుస్తూ, తానొక ఇంటికోడలి నన్న సంగతి స్ఫురణకి తెచ్చుకొని లక్ష్మి స్వయంగా భర్తని పిల్చింది! "మంచిరోజు చూడండి-" అని నసిగింది!... ఆగలేక పకపక నవ్వాడతను! ఇక ఆమెకు కోపం పట్ట శక్యంకాలేదు - "నవ్వండి! అవును మరి, చేసేది ఒకరైతే అనుభవించేది మరొకరు గదా! మరి నవ్వరా దూ? నవ్వండీ!" అంటూ లోనికిపోయింది! పాపం - కృష్ణమూర్తికి జాలికల్గినా నవ్వాగలేదు!

* * *

అత్తగారిల్లు చేరుకొన్న తరువాత అత్తమామలకి ఆమె నానుసంగతి తెల్సిపోయింది. వెంటనే ఒకవంక మామగారు మెల్లగానూ, మరోవంక అత్తగారు గట్టిగానూ లక్ష్మిని చీవాట్లు పెట్టారు "వాడొట్టి వెధవ అని తెల్సుగదా, తెలిసీ తిరిగి ఆ కాస్త బంగారం అప్పగించి వచ్చావూ? అందులో అటువంటి వస్తువు ప్రాణం పోయినా మెడనుండి తీయవచ్చునా? ఏళ్లు రాగానే సరిగాదమ్మా, సంసార బాధ్యతా, కుటుంబ నిర్వహణా తెల్సుకోవాలి! మగాళ్ళు చెడిపోవడానికి ముఖ్యం అర్ధాంగులే సుమా!" అంటూ నానామాటలూ అన్నారు అంతటితో ఆగక - లక్ష్మి పుట్టింటికికూడా ఉత్తరం ద్వారా తెలియజేసి ఆమెకు వాళ్లమ్మా నాన్నల వద్దనుండికూడా నాలు మందలింపులు తెప్పించారు! . లక్ష్మి తోటికోడలు మంగతాయారమ్మకు ముగ్గురుబిడ్డలు! తిరిగి ఎనిమిదో నెల! ఎముకల ప్రోవులా, నలభైఏళ్లదానిలా నీరసంగానూ భయంగానూ ఎదురయ్యింది లక్ష్మికి! "లక్ష్మీ! నీవింకా నాలు రోజు లాలస్యంగా వచ్చివుంటే, నాకూ సేవ చేయాల్సి వచ్చునేమో చెల్లీ!" అంటూ ఆమె నవ్వుతూనే అన్నా లక్ష్మికి చాల జాలికల్గింది! అంతవరకూ ఆ యింట్లో చాకిరి చేయలేకా, తన బాధ వెలిబుచ్చుకోలేకా, మంగమ్మ సతమతమై పోతున్నదని కూడా లక్ష్మి గుర్తించింది! అంతేకాదు, మంగమ్మ అంతవరకూ వహిస్తూవచ్చిన భారాన్నంతా ఇక తానే భరించాల్సి వుంటుందనీ లక్ష్మి తెల్సుకున్నది..

ఇక ఏమనుకోవాలో, ఏమి చేయాలో, ఏమి చెప్పుకోవాలో ఏమీ బోధపడక విస్తుపోయింది లక్ష్మి!...

* * *

ఏలూరునుండి కాంతమ్మ పుట్టింటికి వచ్చింది. లక్ష్మి కామె ఆప్తురాలు! కనుక, ఒకసారి పరామర్శచేసి వద్దామని ఒకనాటి సాయంత్రం కాంతమ్మ వెంకటరావుగారింటికి వెళ్లింది

ఆ యింటిబయట చిన్న కారు నిలచివుంది! అందులో - కాంతమ్మకి దూరపు బంధువు లబ్బాయీ, వెంకటరావుగారి కుటుంబ మిత్రుడూ అయిన మోహన్ స్టీరింగ్ వద్ద ఖులాసాగా కూర్చునివున్నాడు. "ఎప్పుడు రాక అక్కయ్యగారూ? పిల్లా

...ల్లా అంతా క్షేమమా! ఏమిటి విశేషాలూ?" అని చిరునవ్వుతో పల్కరించాడు ఆమె కూడా నవ్వి "ఆ-ఆ! మీ దయవల్ల అంతా క్షేమమే నాయనా! నేను మొన్ననే వచ్చాను కాని—అమ్మా నాన్నా అంతా బాగున్నారా బాబూ?" అంది "ఆహా!" అన్నాడా యువకుడు "అయితే, వేళ గాని వేళ ఇక్కడ మకాం వేశావ్, ఏమిటి విశేషం బాబూ?!" అనడిగింది "అబ్బే! మరేం లేదు - సరోజ వస్తానంది! సినిమాకు పోదామని!" అన్నాడు శాంతమ్మ "అలాగా - బాగుంది నాయనా! మంచిది!" అంటూ యింట్లోకి వెళ్లింది

ఇంట్లో ముందుగదిలో వెంకట్రావుగారి చిన్నమ్మాయి సరోజ నిలువుటద్దంముందు నిలబడి టాయ్‌లెట్ అవుతూవుంది! ఆమె చెంతనే నిలబడి ఆమెకవీ ఇవీ అందిస్తున్నాడు చిట్టిబాబు "ఒరేయ్, ఈ తిలకం సీసా భద్రంగా అందులో పెట్టి, ఆ కాటుక భరిణ ఇలా అందివ్వు! ఊఁ! త్వరగా!" అని ఆమె ఆజ్ఞాపిస్తుండగా శాంతమ్మ అక్కడికి వచ్చింది! ఆమెని చూచి సరోజ మందహాసంతో "రా ఒదినా," అంటూ ఆహ్వానించింది! శాంతమ్మ లోనికి వస్తూనే "ఏమిటే హడావుడీ?" అనడిగింది "ఏమీ లేదు! నీవు వచ్చావని నిన్ననే తెల్సింది! ఒదినకు తీరిక చిక్కలేదు కాబోలు, లేకపోతే తానే నీదగ్గర కొచ్చేది!"

"ఏదీ, లక్ష్మి ఎక్కడుందీ, కన్పించదేం?" అనడిగింది శాంతమ్మ సరోజ వ్యంగ్యంగా "ఎక్కడేమిటే? ఆమె స్థానంలోనే వుండి వుంటుంది!" అంది శాంతమ్మ తెల్లబోయి చూస్తూ "అదేమిటే - స్నానమేమిటి సంధ్యేమిటి నా ముఖం?" అనడిగింది సరోజ నవ్వుతూ "అదీ నేనే విడమర్చి చెప్తే బాగోదు వదినా!" అని, చిట్టిబాబుతో "ఒరేయ్! మీ అమ్మ- ఇప్పు డెక్కడుందో మీ పెద్దమ్మకి చెప్పరా!" అన్నది వాడో సారి ఆమెనీ, మరోసారి శాంతమ్మనీ చూచి, అమాయకంగా చేతులూపుతూ "మరే - మరి- అమ్మా? ఇప్పుడూ వంటింట్లో వుంటుంది, కాదత్తమ్మా?!" అన్నాడు! "రైట్ - రైట్!" అని సరోజ అనేసరికి బయటినుండి కారు హారన్ శబ్దం విన్పించింది! అది వినబడగానే సరోజ ఆత్రంతో కాళ్లకి చెప్పులు తొడుక్కుంటూ, "వస్తా నొదినా! మళ్ళీ కల్సుకొందాం! ఏం?" అంటూనే వెళ్లిపోయింది!

తిరిగి కారు బయల్దేరిన చప్పుడికిగాని, శాంతమ్మ స్పృహలోకి రాలేదు! చిట్టిబాబు చనువుగా ఆమె కొంగుపట్టుకొని "రా - పెద్దమ్మా! అమ్మ అదిగో-వంటింట్లో అన్నం వండుతూ, కూరలు తరుగుతోంది - గా చూద్దువ్ గాని!" అంటూ లాగుతున్నాడు.

★ ఆమె అభిప్రాయం ★

పాపని ఎత్తుకొని ముద్దాడి ముందుకు నడిచింది, శాంతమ్మ.

* * *

లక్ష్మి అత్తగారికి ఉబ్బసం తిరగబెట్టింది! ఆ సమయంలోనే మంగమ్మ ప్రసవమైంది! ఇటు అత్తగారికీ, అటు తోటికోడలికి లక్ష్మి రేయింబవళ్లూ సేవచేయాల్సి వచ్చింది! ఆమె అక్కడున్నందువల్ల తిరిగి తల్లిదండ్రుల కార్థికంగా ఇబ్బంది ఏమో అని, కృష్ణమూర్తి నెలనెలా జీతం అందగానే కొంత డబ్బు పంపుతూ వచ్చాడు! అందువల్ల ఆ కుటుంబ పరిస్థితి మెరుగైందేమోగాని, ఆమె స్థితిమాత్రం చాల అధ్వాన్నమైపోయింది! ఇటు తన పిల్లలు, అటు తోటికోడలి పిల్లలు వాళ్లందర్నీ చక్కబెట్టుకొనిరావాలి! కాగా, మామగార్కిగాని, బావగార్కిగాని, ఆడబిడ్డకిగాని, ఎంత మాత్రం లోటు జరుగరాదు! జరిగితే ఎవ్వరూ సహించే బాపతుకాదు! వారందరికీ ఏ వేళకి ఏమికావాలో అవన్నీ - ఒక్క పనిమనిషి సాయంతోనే - తానొక్కతే సర్దుబాటు చేసుకురావలసి వచ్చేంది! అంత చేసినా ఎవరికీ తృప్తికలుగదు! ఎప్పుడూ ఎత్తిపొడుపులూ, ఎగతాళులూ! లక్ష్మి పైకి అన్నీ సహించుకొంటూ లోలోన చింతించే బాపతు మనిషి - కనుక చాలత్వరగా మనిషి క్షీణించిపోసాగింది!...

శాంతమ్మ వచ్చేసరికి - వంటగదిలో పుల్లలు సరిగా మండక తిప్పలు పెట్టూ వుంటే, వాటిని సరిచేసుకొంటూ, కూరలు తరుక్కొంటూ, మాసినబట్టలతో, చెదిరిన జుట్టుతో, ఎర్ర బడ్డకళ్లతో ఏదో ధ్యాసలో వుంది లక్ష్మి! ఆమెని చూచి శాంతమ్మ దిగాలు పడిపోయింది! “ఏమేవ్ - నేనొచ్చానే!” అంది మందస్వరాన. లక్ష్మి తలెత్తి చూచి, విస్మయానందాలతో లేచి ముక్కాలిపీట వేస్తూ “రా - రా - కూర్చో” అంది —

కూర్చుంటూ శాంతమ్మ “ఇదేమిటే ఇలాగైపోయావ్? బొత్తిగా ఆనవాలు కట్టలేనంత ఇదిగా మారిపోయావ్?” అంది

లక్ష్మి నవ్వుతూ “ఏం, నాకేమే? ఏరా చిట్టి, బాగాలేనురా!” అనడిగింది! వాడు తలాడిస్తూ “ఊహూఁ! ఇక్కడేం బాగోడం లేదు! అక్కడే ఎంతో బాగుండేది'' అనేవాడు! లక్ష్మి నవ్వుతోనే గద్దిస్తూ “ఊరుకో వెధవా! ఎవరన్నా వింటే ఏమనుకొంటార్రా? మంచిబుద్ధులే అబ్బుతున్నాయిలే, చివరికి! అంది! .

కొంతసేపు ఆమాటా - ఈమాటా చెప్పుకొన్న తరువాత మాటమీద మాటవచ్చి శాంతమ్మ “అవున్నే! నీవిలాగై పోవడం చూచీ ఒదలి ఎలాపోయాడే కృష్ణమూర్తి?” అనడిగింది! “నే నిప్పుడెట్లాగున్నానో ఆయనకేమి తెలుసూ?” అంది లక్ష్మి. శాంతమ్మ నివ్వెరపోయి “అదేమిటే - మొన్న మొన్ననేగా ఒక డజనుమంది మగాళ్లు, అరడజను మంది ఆడాళ్ళు - కెమేరాలూ సంగీతవాయిద్యాలూ, పళ్లూ ఫలహారాలతో అట్టహాసంగా కోతేరు చూడ్డానికని వచ్చారు? ఆ బృందానికి నాయకుడు మన కృష్ణమూర్తే గదా! ఏలూర్లో మా ఇంట్లోనే బసదిగారు! అంతా నాటకం సజ్జులాగున్నారు! వచ్చేటప్పుడు వీలుకలుగలేదనీ, వెళ్లేటప్పుడు మాత్రం తప్పకుండా ఇక్కడ దిగుతాననీ కృష్ణమూర్తి చెప్పాడే! దిగనే లేదా? అరె!” అంది. లక్ష్మి గాఢంగా నిట్టూర్చింది! కొన్ని క్షణాలాగి అప్రయత్నంగా “అయితే ఆ నానూ తాకట్టు నుంచి అమ్మకానికి వెళ్ళిపోయుంటుంది!” అనేసింది! “నానేమిటే? అరె అదెలాగిచ్చావే?”

“నీవుకూడా అలాగే అంటున్నావా?” అంది అగోలా లక్ష్మి! శాంతమ్మ నాలిక్కరుచుకొనేలోగానే లక్ష్మికళ్లలో అశ్రువులు నిండాయి

* * *

కృష్ణమూర్తి అందంగా ఉండేవాడు! ప్రపంచ రాజకీయాలపైన వ్యాసాలు వ్రాస్తూండేవాడు! సాంఘిక సమస్యల గురించిన నాటకాల్లో పాల్గొనేవాడు! అందరిలో ఎంతో మంచివాడు అన్పించుకొనేవాడు! కట్నం పుచ్చుకోకుండా ఎంత ఆదర్శప్రాయుడు దొరికాడో అని మురిసిపోయింది లక్ష్మి, పెళ్లి రోజుల్లో! కాని, పెళ్ళైపోయాక కొన్ని వేల రూపాయిల ఆమె స్వంత నగలు క్రమేణా అతని స్వార్థానికి హరించుకుపోయాయ్! ఉదారహృదయుడుగా పేరుప్రతిష్ఠలు గడించే నిమిత్తమే - విరివిగా అనాథులకూ, నిస్సహాయ స్థితిలోనున్న బంధుమిత్రులకూ, తన స్వంత వ్యాసంగాలకే వెచ్చిస్తూవచ్చాడు! సంసారం ఆవిధంగా గుల్లైపోయాక, పొట్ట చేత్తో పట్టుకొని ఉద్యోగంలో ప్రవేశించికూడా అతనా అలౌక్యపు పద్ధతులు వదల్లేదు! .

తనపై ఆధారపడివున్న భార్యాబిడ్డల బాగోగులు చూడలేని వాడెంత కీర్తి గడిస్తేనేమి, ఎన్ని ఘనకార్యాలు సాధిస్తేనేమి? ఇంటిలో ఈగల మోత, ఊళ్ళో పల్లకీల మోతా? బయటప్రపంచంలో నాగరికులుగా ఆదర్శప్రాయులుగా, స్త్రీ స్వాతంత్ర్యాభిలాషులుగా, సాంఘిక విప్లవకారులుగా చలామణి అవుతున్నవాళ్లంతా ఇంతేనా! లేకుంటే - వీరి ఆదర్శం, వీరి సంస్కారం స్వంత సోదరీమణులపైనా, పరాయి అభిమాన స్త్రీలపైనా తప్ప - కష్టనష్టాల్లో యావజ్జీవితం బాధ్యత వహిస్తూ, స్వంత మనస్సనేది లేకుండా మనసారా అనుసరించి వచ్చే అర్ధాంగులపట్ల వర్తించవేం?” అంది శాంతమ్మ. చిత్రమేమంటే - అది లక్ష్మికి కూడా బాధాకరమైంది!...

3

సంక్రాంతి సంభ్రమంగా వచ్చేస్తున్నది!..


వెంకటరావుగారి పెద్దమ్మాయి పెళ్ళయ్యాక అదే ప్రథమసంక్రాంతి! ముందు ముందేమిచేసినా చేయలేకపోయినా మొదటి సంక్రాంతికైనా క్రొత్తల్లుడినీ, కూతుర్నీ ఆహ్వానించాలిగదా - కాని, ఎట్లాగూ? . నెలనెలకీ లెఖ్ఖ తగ్గించి పంపుతూ వచ్చిన చిన్నబ్బాయ్ ఆ నెల అసలు దమ్మిడీకూడా పంపలేదు! ఇక ఉత్తరాలు వ్రాసీ లాభంలేదతనితో, అని వెంకటరావుగారికి అనుభవం కనుక, నీళ్లు నమిలి ఊరుకున్నారు! పెద్దబ్బాయి తన పెళ్లాం పిల్లలకి కావలసిన బట్టలూ అవి కొనడానికే చేతిలో వున్న డబ్బు చాలక తికమకపడ్తున్నాడు! పంతులమ్మైన చిన్నమ్మాయ్ తనదగ్గరున్న డబ్బు ఇంటి అవసరాలకి ఖర్చుపెట్టాల్సి వస్తుందన్న భయంతో ముందే పండుగకేదో క్రొత్తనగకి ఆర్డరిచ్చేసింది, గప్ చుప్ గా! .

ఇక ఇంటావిడకి దడపట్టుకొంది! ముసలాయన కొచ్చేదీ చిన్నబ్బాయ్ పంపేదీ కలిపి - ఆ పండుగకి క్రొత్తల్లుడిని పిలిచి ఎలాగో పండుగ గడిపివేయాలని ఆ వృద్ధ దంపతు లూహిస్తూవచ్చారు కాని . కృష్ణమూర్తి ఇహంకన్న పరమే ముఖ్యంగా భావించేటటువంటి వ్యక్తిగనుక, ఇంకే మిత్రుడో ఆ సంక్రాంతి జరుపుకొనడానికి బాధపడ్తుంటే చూచి, తనదగ్గరున్నది కాస్తా గొప్పకి సమర్పించేసి ఉంటాడని నిట్టూర్చింది లక్ష్మి! భర్త విషయంలో ఆమె ఊహించేదంతా నిజమై తీర్తుంది!


అత్తమామలు పడ్తున్న బాధలన్నీ కూడా లక్ష్మి గుర్తిస్తూనే వస్తున్నది క్రొత్తల్లుడు కొద్దో గొప్పో కలవారి కుటుంబంలోని మనిషి! వేషభాషలు నాగరికంగా కన్పించినా, వారి కుటుంబమంతా బహు సనాతనాచార పరులు! ఆచార వ్యవహారాలన్నీ 'తూచా' తప్పకుండా జరిగిస్తుంటేనే వారికి తృప్తి! . వారి కాగ్రహంవస్తే ఎవ్వరూ ఆపలేరు .. వారలిగితే ఎవ్వరూ తీర్చలేరు! గొప్పింటి సంబంధమని మురిసిపోయిన వారికి ఆ పెళ్లి దినాల్లోనే అవన్నీ అనుభవానికి వచ్చేశాయ్! అందుకనే ఈ సంక్రాంతి పండుగ దగ్గరకొస్తుంటే అత్తా

కూతు లింత కంగారుపడటం!... ఇదంతా కూడా లక్ష్మి గమనిస్తూనే వచ్చింది!

ఒకనాటి రాత్రి తనకు పెళ్లైన తరువాత ఇలాంటి పంగుగల వ్యవహారాలకి తన భర్తతో సహా తన తల్లిదండ్రు లెన్ని బాధ లనుభవించారో - అదంతా నెమరేసుకొన్నది లక్ష్మి! ప్రస్తుతం ఈ పంగుగకి క్రొత్తగా పెళ్లైన తన చెల్లెలి భర్తకొరకని తిరిగి వా రెంత కష్టపడుతున్నారో - అదంతా తలపోసుకొన్నది ఇప్పుడు తన అత్తామామలు క్రొత్తల్లుడి గురించి ఎంత వ్యగ్రత చెందుతున్నారో - అదంతా స్ఫురణకి తెచ్చుకొం







ఆమె అభిప్రాయం

దామె! అటు-తన చెల్లెలి అత్తమామయూ, తన ఆడుబిడ్డ అత్తగూమలు సైతం వారివారి కన్న బిడ్డల్లో పెళ్ళిళ్లైన ఆడుబిడ్డల గురించి ఎంత శ్రమ లనుభవిస్తున్నారో - అదంతా కూడా ఊహించుకొన్నది .

తన తల్లిదండ్రు లవనీ, తన అత్తమామ లవనీ, తన ఆడబిడ్డ అత్తమామ లవనీ, తన చెల్లెలి అత్తమామ లవనీ-ఎవరైతేనేమి ? ఆడ బిడ్డల్నికన్నవా రందరిదీ ఒకటే గాధ; అందరికీ ఒకటే బాధ - అంతేగదా! అన్పించిం దామెకు !! గాఢంగా నిట్టూరుస్తూ నిద్రరాక అటూ ఇటూ పొర్లుతూ చాలసేపు బాధపడిందామె!

తెల్లవారింది ప్రొద్దెక్కుతూ వుంది!. పాత అప్పులవాళ్లు ఇంక అప్పులివ్వరు కనుక క్రొత్త అప్పులవారి నెవరినైనా వెతుక్కొని అప్పుడు క్రొత్తల్లుడికి సంక్రాంతి ఆహ్వానం పంపాలని తుదినిర్ణయాని కొచ్చి వెంకటరావుగారు, దేవుడిని - ఆ అప్పుఇచ్చేవారి నైనా త్వరలో చూపించాల్సిందని ప్రార్థించే నిమిత్తం పూజగదిలోకి వెళ్ళారు! .

అక్కడ లక్ష్మి ధ్యాన నిమగ్నయై నిలబడి వుంది! ఆమె సరసనే మౌనంగా నిలబడిపోయారు వెంకటరావుగారు కొన్ని క్షణాలకి లక్ష్మి కళ్లు తెరిచి ప్రక్కకి తిరిగి చూచింది. ప్రక్కనే మామగారు!

భగవంతునికని జోడించిన తన రెండు చేతుల్నీ మెల్లగా మామగారి చేతుల కందించింది! వశీకే ఆమె మృదుహస్తాలను ఆదరంతో యధాలాపంగా అందుకొన్నాడాయన! ఆయన అంజలిలో ఆమె ముకుళిత హస్తాలు తెరువబడ్డాయి! ఆ వెంటనే ఆ చేతులలో ఏదో వస్తు వుంచబడ్డట్లు వెంకటరావుగారికి స్పర్శ కల్గింది! విస్మయంతో ఆయన దాన్ని చూచుకొన్నారు—అది లక్ష్మి బంగారు నల్లపూసల గొలుసు!...... దిగ్భ్రాంతి చెందాడాయన!.

"అమ్మా! ఇదేమిటమ్మా ?" అన్నాడాయన తేరుకొని! . ఆమె మెళ్ళో క్రొత్త నల్లపూసల త్రాడు, పసుపుత్రాడు ఆమెకో విచిత్ర శోభ చేకూరుస్తూ కన్పించాయ్!

ఆమెకూడా చాలాసేపటివరకూ తేరుకోలేకపోయింది! చివరికి గద్గద కంఠంతో ఇలా అంది—"ఏముందండీ - ఏమీ లేదు! కాని, మీరు దీన్ని నిస్సంకోచంగా పట్టుకెళ్లి, ఏదో ఒకటి చేసి - అమ్మాయిని అతన్నీ పండుగకి రమ్మని నిశ్చింతగా ఉత్తరం వ్రాసి రండి, ముందు!"

"అయ్యో! ఇదేమిటమ్మా? నేనలా చేయలేను. ఉహుఁ! నావల్ల కాదమ్మా!" అన్నాడాయన తొట్రుపడ్తూ.

నీరసమైన మందహాసంతో "అబ్బే! మీరలా బాధపడితే ఎలాగండీ? నాకంతా తెల్సు - ఎవరైతే నేమండీ, ఆడబిడ్డల్ని కన్నవారందరికీ ఒకేమోస్తరు పరిస్థితులెదురౌతాయ్! అంతేగదా—" అంటుంటే ఆమె కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయ్! చటున ముఖం చాటుచేసుకొని "అంతే కాదు - ఆడది కూతురుగా బ్రతికినంతకాలమే అందమైనా చందమైనా! ఆ స్థితి దాటిపోతున్నకొద్దీ ఏ ఆడదానికైనా అంతా అయోమయావస్థే కదండీ ?.. .. పెద్దమ్మాయ్ ఇంతకాలం మీచాటున ఏ చికూ చింతా ఎరుగకుండా హాయిగా ఉంది! ఇక ఆ భాగ్యం ఆ పెళ్లితో పోయినట్లే! కనుకనే, ఆఖరుసారిగానైనా ఈ పండుగ పేరుతో మీ ముచ్చటూ, ఆమె సరదా తీర్చుకోవడమే కర్తవ్యం. ముందు స్థితిగతులు ఎవరేం చెప్పగలం?" . అన్నదామె!

—బరువెక్కిన గుండెతో - భారంగా అడుగులేస్తూ, లక్ష్మి అటు వంటింట్లోకి; వెంకటరావుగారు ఇటు వీధిలోకి నడిచిపోయారు!... ★

★ గ్రంథ స్వీకారం ★

జాగరణ

అసంపూర్తి నవల. మూలం శరత్ బాబు. అనువాదం: చాడేశ్వరీ దేవి, సౌమిత్రి. ప్రచురణ: శ్రీవ్యాస సారస్వత సమితి, విజయవాడ. 144 పేజీలు. వెల ఒక రూపాయి

సంపాదకులుగాని, రచయిత గాని తమ ప్రచురణకో రచనకో తొలిమాటలు చెపుతూ తమ అభిప్రాయాలను పాఠకులకు తెలుపుతూ ఉంటారు. ఈ పుస్తకంలో సంపాదకులు కొన్ని అభిప్రాయాలు వెలువరించారు. నాటి దృష్ట్యా పుస్తకాన్ని పరిశీలించటం శేఽబబు కాదు

ఈనాడు తెలుగులోవస్తున్న శరత్ గ్రంథానువాదాలు ఘోరంగా ఉంటున్నాయనీ మనకు ఆయనమీదున్న గౌరవాన్ని అభిమానాన్ని పూర్తిగా తీసివేస్తున్నాయని,వివరిస్తూ ఇది నిజంగా క్షమించదగింది కాదేమో! అని సంపాదకులు చెప్పారు. ఇందులో సందేహం ఎంతమాత్రం అక్కరలేదు. అయితే తాము ప్రచురించిన ఈ అనువాదంకూడా అటువంటి తెగకు చెందినదే అన్న విషయం మాత్రంసంపాదకులుగుర్తించవలసిఉంటుంది.

సంపాదకులు ఆదినుంచి తుదిదాకా ఈ అనువాదాన్ని మరొక్కసారి చదువుకుంటే, ఇది ఎంత ఘోరంగా ఉన్నదో తెలియకపోదు ఉదాహరణకి ఇవి చాలును· "పాత భవనపు హాద్దులో, ఫ్యాషన్‌బుల్ గల ఈ బిల్డింగు తయారైంది" "రాధా మాధవరాయ్ ఈ విజాతీయ నవీన పద్ధతులకి పూర్తిగా ఆకర్షించబడ్డి అందులో నిమగ్నుడకూడా, అంటే అదీ కనిపించదు" "నిర్భయశుద్ధ శాంత తపస్వి" "రెండు నిమిషాల తర్వాత బైటికి పోయే బట్టలతో ఒక యువతిరే మహాశయుడి ముందునించి సాగిపోయింది. ఆమె ఛాయ ఏమంత యెర్రగా లేదు"

సమర్పణ

కథలసంపుటి. రచన: 'అమరేంద్ర ప్రతులకు:జనరల్ ప్రింటర్సు, గుంటూరు-2 98 పేజీలు: వెల ఒక రూపాయి.

ఈసంపుటిలో పూర్ణయాత్ర, సమర్పణ, రాలినపువ్వులు, ఎదురుగాలి, వైతరణి, మామ్మగారిదినచర్య, చిరవసుడు, సంజదీపం అనే ఎనిమిది చిన్నకథలు ఉన్నాయి కథ తమకు కాలక్షేపం కాదని, తోటిజీవుల మనోవ్యథలకి రూపం ఇవ్వటంకోసమే కథలు వ్రాస్తామని రచయిత చెప్పారు ఈ ఆశయం కథలలో ప్రతిఫలిస్తున్నది.

సంస్కృతి

సారస్వత వైజ్ఞానికపత్రిక, అధిపతి: నాగేశ్వరరావు సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరం వారిప్రచురణ.

సంస్కృతి పత్రిక 2 వ సంపుటి 11 వ సంచిక జనవరిలో వెలువడింది. ఆలూరి కుప్పనార్యుని "పార్థసారధి విజయము" అముద్రిత యక్షగానంగురించి శ్రీయస్వీ జోగారావుగారి వ్యాసము, భరతముని ప్రణీత "నాట్యశాస్త్రము" నకు శ్రీపోణంగి శ్రీరామఅప్పారావుగారి అనువాదము ఇందులోఉన్నాయి ఈఅనువాదం ధారావాహికగా ప్రచురింపబడుతున్నది. ఇవికాక ఇతరపద్యాలు వ్యాసాలుకూడా ఉన్నాయి

బొమ్మరిల్లు

ఎలకమ్మ పెళ్లి

"సోమన్నయ్య"

చిమ్మ చీకటైనయడవి
లోన నెగురు కాకిబావ
కాలిక్రేళ్ళ నందులోన
ఇరుక్కొన్న ఎలుకజారె
ముక్కుమూసి మఠంవేసి
జపంజేసికొనే ముని
ముందుబడిన యెలుకజూసి
పాపమని జాలిగని
గాయాలకు కట్టుగట్టి
సేదదీర్చి సేవసలిపె
జపమాలను మూలబెట్టి,
నియమాలను నీళ్ళగలిపె.
మనసుపడి మహర్షివరుడు
ముద్దులొలుకు బహుచక్కని
ఎనిమిదేళ్ళ పిల్లగాను
ఎలకమ్మను మార్చినాడు.
ఎలకకూతు రెదిగియెదిగి
పెళ్లీడుకు రాగ జూచి
తలపోసెను దానికొక్క
యింటివాన్ని చేయజూచి.
"చిట్టితల్లి! నీకు నచ్చి
నట్టిమగని చెప్పునాకు
ఎచట నున్న వెదకితెచ్చి
యిత్తుసిగ్గు పడబోకుము"
అనగ సిగ్గులొలకబోసి
"నాన్నగారు, నాకు మిగుల
బలముగలుగువాని జూచి
తెచ్చియిందు" అన్నదామె.
సరెలెమ్మని సరాసరిని
కొండచివర కెక్కి "ఓయి
సూర్యుడ! నా కూతురినీ
పెళ్లిచేసికొందువోయి?"
అనుచుండగ ఏనుగంత
మబ్బొక్కటి అడ్డమొచ్చి,
సూర్యదేవు గప్పెనంత,
సూర్యుడదిరి నోరువిచ్చి
"చూచినావుగదా ఋషీ!
నా బింబము మబ్బుతునక
ఇట్టె గప్పివైచె నిసీ?
మబ్బే బలశాలి. కనుక
పో"మ్మటన్న ఋషి మేఘుని
దెసకు తిరిగి పిలిచి "ఓయి
మేఘుడ! నాకూతురినీ
భార్యగ గ్రహియింతువోయి?"
అనుచుండగ పెద్దగాలి
వీచి మబ్బునెట్టివైచె.
మేఘమపుడు చేవజారి
పరుగెడుతూ ఋషినిచూచి
'చూచినావు గదా ఋషీ!
ఇంత పెద్ద శరీరాన్ని
ఇట్టె విసరివైచె నిసీ!
వాయువె బలశాలి' యన్న
కదిలిపోవు గాలిదేవు
నిలిపి నాదు కూతురినీ
చేసికొమ్మటంచు దేవు
రించ, నతడు ఆ కొండను
చూపి "చూడవయ్యముని!
కదలదు రవ్వంతయైన
నాదీఒక బలమే" యని
యంటే "సరె, యటులైన నో
గిరిరాజా! నీవైనను
నాకూతురి జేసికొనుము.
మరల దొరకదెందైనను,
ఏలుకొనుము జాలిగనుము"
అనిన గుహలు మారు మ్రోయ
కొండపలికె "నోయి ఋషీ!
ఎలుక నన్ను తొలిచివేయు
వాడియైన పళ్ల నిసీ!"
విసిగిపోయి వేసరిల్లి
లో లోపల మండిపోయి
నిజము తెలిసి తెప్పరిల్లి
తనయింటికి నడచిపోయి
ఎలుకకూతు నెలుక చేసి
కన్నముందు కాపువేసి
యున్న ఎలుక పైకి దీసి
పెళ్లిచేసి విడిచివేసె.
కాన చిట్టి చెల్లెళ్లూ
ఓయి చిట్టి తమ్ముళ్లూ
ఎలకపిల్ల కెలకె మగడు
ఎవడో పైనుంచి దిగడు.

మహారాజ రహస్యం

మ్యు. వి

ఒక రాజ్యం పాలించుతూఉన్న మహారాజుగారు ఒకసారి వేటకు అడవికి పోయినాడు. రాజులు వేటకి పోవటం ఒక ఆచారం. మహారాజుగారికి వేటాడటం ఏమాత్రం చేత కాదు. అయినా తనవద్దఉన్న సామంతులు, సేనాధిపతులూ కూడా అప్పుడప్పుడు వేటాడి పులినో, సింహాన్నో చంపి గొప్పగా చెప్పుకుంటూ ఉంటటం చూచి ఆయన ఉండబట్టలేకపోయినాడు. పైగా రాజుగారు వేటకు వెళ్ళటంలేదని నలుగురికీ తెలిసిందంటే అవమానం. అందరు రాజులూ వేటాడుతుంటే, మహారాజు ఎందుకు వేటాడడనే ఆలోచనవచ్చి, తీరా కారణం పసిగట్టే కారా, తనకు, రాజ్యానికి కూడా ముప్పువస్తుంది.

ఒకనాడు మహారాజుగారు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఎవరువచ్చి ఏమివేడినా వెంటనే అనుగ్రహించటానికి సంసిద్ధంగా ఉన్నారు. అటువంటి సమయం చాలా అరుదుగా దొరుకుతుంది. పరిచారికలు, పరిచారకులు అదను పోగొట్టుకోకుండా అనేకవస్తువులు సంపాదిస్తూ ఉంటారు. ఆనాడు మహారాణిగారే ఒక కోరిక తీర్చమని మహారాజుగారిని అడిగారు. మహారాజుగారు స్వయంగా వేటాడిన దుప్పిమాంసం తినాలని మహారాణిగారికి బుద్ధిపుట్టింది. ఈ కోరిక వినేసరికి మహారాజుగారు నీళ్లు కారి పోయినారు. రాణీగారికి ఇది కొద్దిగా రికెలా అవుతుంది? దుప్పికోసపాటికోరిక కావచ్చును గాని రాజు మని అడవికి పోతే దుప్పి ఎదురా




ఎన్నికల ఉపన్యాసం?

తుందో సింహమే ఎదురౌతుందో ఎవరు చెప్పగలరు? మహారాజుగారికి వేటంటే చాలా హడలు. ఈ సంగతి మహారాజుగారికీ, మరొకరిద్దరికీ మాత్రమే తెలుసు. అందు చేత అది మహారాజ రహస్యం. ఆ రహస్యం పెదవులు దాటి బయట పడదు. పడితే తలలు కోల్పడటమే అని ఆ రహస్యం తెలిసినవారికి రహస్యంతో పాటే తెలుసు.

మహారాణిగారి కోరిక వినగానే మహారాజుగారికి ముచ్చెమటలు పోశినాయి. తాను వేటకు వెళ్లలేని అసమర్థుడని ఆడవారికి కూడా తెలుస్తే, ఇక పుట్టగతులు ఉంటాయా? కాని మహారాజుగారు బయటపడలేదు. గంభీరంగా ఉన్నారు. అప్పుడు అలా ఉండక పోతే మహారాజు ఎలా కాగలడు కనుక?

మహారాజుగారు మహామంత్రికి స్వయంగా దర్శనమిచ్చారు. తమ మీదికి వచ్చిన ఈ విపత్తును వివరించి, తరణోపాయం అన్వేషించమని ఆజ్ఞాపించారు. మహారాజుగారు వేటకి బయలుదేరారంటే, సపరివారంగా బయలుదేరుతారు. సామంతులు, సేనాపతులు, అంగరక్షకులు, వీరులు, బోయులు, ఇంకా ఎందరెందరో వెంట ఉంటారు. మహారాజుగారి సాహసాన్ని, వారి నైపుణ్యాన్ని కనులారా ఒక్కసారి సందర్శించి తరించాలేగాని, ఆ తరువాత ఈ గుక్కెడు ప్రాణాలుపోయినా ఫరవా లేదని ఉవ్విళ్ళూరేవారు అనేకంగా వెంట ఉంటారు. మహారాణిగారే స్వయంగా వేము బయలుదేరివస్తామని విన్నవించారా— పరిస్థితి ఇంకా ప్రాణాంతకమైనదన్నమాటే! మహామంత్రికి ఏమీ పాలుపోలేదు. ఏ పరివారమూ లేకుండా, ఏ ఆడంబరమూ లేకుండా మహారాజు వేటకు వెళ్లిరావచ్చును. ఈ మాత్రము ఊహ మహామంత్రికి తోచకపోలేదు. వచ్చిన చిక్కు ఈ ఊహ మహారాజుగారికి నచ్చక పోవటమే.

కీడెంచి మేలెంచమని పెద్దల వచనం. ఆ కారణంచేత పెద్ద ప్రమాదం లేకపోయినా, ఒంటరిగా,



ఒటర్ల మందహాసం! వఝ్ఝాది రామారావు—విశాఖపట్నం

★ మహారాజరహస్యం ★

(అంటే స్వల్పపరివారంతో) వెళ్ళి రావటం మహారాజుగారికి చేయదగిన పనిగా తోచలేదు. మహామంత్రి తాము ఈ సమస్యను పరిష్కరించగలమని మనవిచేసి అభయమిచ్చి మహారాజుగారిని అంతఃపురానికి పంపించివేశారు.

మరునాడు మహారాజుగారు సపరివారంగా వేటకు బయలుదేరారు. అదృష్టవశాత్తు మహారాణిగారు బయలుదేరలేదు. అడవికి చేరుకున్నపిదప "మహారాజుగారు బడలికతో ఉన్నారు కనుక ఒకరోజు విశ్రాంతి తీసుకుంటారు, ఆ తరువాత కాని వేటకు బయలుదేరరు"అని మహామంత్రి ప్రకటించారు. వేటంటే అమితోత్సాహంతో పరుగెత్తుకొని వచ్చిన యోధానుయోధులందరూ చాలా నిరుత్సాహపడ్డారు. వాళ్ల నిట్టూర్పు గాలులకు శిబిరాలపైని పతాకాలు రెపరెపలాడినాయి. మహారాజుగారు తమ విడిదినుండి వెలుపలికి వచ్చి, వేటకు పోదలిచినవారందరూ పోయి వేటాడవచ్చునని తాము ఆనాటికి విరమించినంత మాత్రాన వారూ మానుకోవలసిన పనిలేదని వివరించారు. ప్రతి ఒక్కరికీ పోవాలనే కోరిక లోపల ఉన్నప్పటికీ, రాజుగారిని విడిచిపోవటానికి జంకారు. ఎలాగయినా, వారిని వదిలించుకోవాలని చూస్తున్న మహారాజుగారికి గొంతున వెలక్కాయ—పచ్చిది—పడింది.

మహామంత్రి, మహారాజు కొంతసేపు మంతనాలాడినపిదప మహామంత్రి తిరిగి వారివద్దకు వచ్చి "మీరందరూ వేటకిపోవడమే మహారాజుగారి అభిలాష. ఎవరెవరు ఎన్నెన్ని మృగాలను వేటాడి, కానుకలు సమర్పించగలరో చూడాలని మహారాజుగారు కోరుతున్నారు"అని తెలియపరిచాడు. ఉత్సాహంతో కేరింతలు కొడుతూ అందరూ అడవిలోకి వెళ్ళారు.

మహామంత్రి పథకంలో సగభాగం నెరవేరింది. అంగరక్షకులు తప్ప మరి ఎవ్వరూ శిబిరాలవద్ద లేరు. శిబిరాలకు అడవికి మధ్య కొంతదూరం ఉండటంచేత వారికి వన్యమృగాల భయం లేదు. మహారాజు, మహామంత్రి ఇరువురూ కలిసి వాహ్యాళికి బయలుదేరారు కొంతసేపు వినోదంగా ప్రొద్దుపోయే నిమిత్తం వెళ్లుతున్నట్లుగా అంగరక్షకులకు చెప్పారు.

మహామంత్రి తయారుచేసిన పథకంప్రకారం వారు అలా వెళ్లుతుండగా ఒక స్త్రీ ఆర్తనాదం వినిపిస్తుంది. మహారాజుగారు హుటాహుటి వెళ్ళి ఆమెను హింసిస్తున్న భయంకరమైన బెబ్బులిని చీల్చి చెండాడి ఆమెను రక్షిస్తారు. దానితో ఆయనకు వేటపై మనసుపోయి ఆ ప్రాంతమంతటా కలయదిరిగి నానా జంతువితానాన్ని వేటాడి అలిసి గుడారానికి వస్తారు. అయితే దీనికి కావలసిన ఏర్పాట్ల కొరకు కొందరు బోయవారిని ఆ ప్రాంతంలో ఉంచినట్లుమాత్రం ఎవ్వరికీ తెలియకూడదు. ఆ బోయవారే మహారాజుగారి అవక్రపరాక్రమాన్ని అమోఘంగా వర్ణిస్తారు. మహారాజుగారు ఆ బెబ్బులిపై దూకినవిధానం చూసీ చూడటంతోనే మహామంత్రి ఆ సాహసానికి నివ్వెరపోవలసి ఉంటుంది.

వేటనుంచి తిరిగిరాగానే యోధులందరూ తెలుసుకోవలసి ఉన్న వార్త ఇది. ఇంతకుమించి విశేషాలేమీ వారికి తెలియటానికి వీలులేదు. కారణం ఆ విశేషాలన్నీ మహారాజ రహస్యానికి సంబంధించినవి కావటమే

ఈరాజూ మంత్రుల కథలో ఒక దేవతకూడా జోక్యం కలిగించుకోటంవలన ఇదంతా అనుకున్నది అనుకున్నట్లుగా ఇలాగే జరగలేదు. ఆ దేవత వనదేవత. వనదేవతకు రాజుమీద జాలివేసింది. రాజైన తరువాత వేట అనేది సహజమైనది కదా! పాపం వేటాడలేని రాజు అని తెలిస్తే లోకువైపోతాడు. కనుక రాజుపైన కనికరించి ఏదయినా వరమిద్దామని వనదేవత అనుకున్నది.

మహారాజు, మహామంత్రి ఇంకా ఇంకా తిరుగుతున్నారు. ఎంతసేపటికి స్త్రీఆర్తనాదం లాంటిది వినిపించదు. తాము వేసిన పథకం సంగతి బయట పడిపోకుండా ఉండటంకోసం మహామంత్రి ఈ ఆర్తనాదం శిబిరాలవద్ద ఉన్నవారికి కూడా వినిపించేటట్లు ఏర్పాటుచేశారు. వారికి ఒక్కసారి వినిపిస్తుంది. అందరూ ఏమిటోనని కంగారుపడి తెలుసుకోవటానికి సిద్ధపడతారు. కాని ఏదిక్కునుంచి అది వచ్చిందో తెలుసుకునే అవకాశం లేకుండా, ఆ నాదం మళ్లా వినిపించకుండా పోతుంది.

మహారాజుగారికి చిన్న అనుమానం వేసింది. ఎంతసేపటికి ఏమీ

వినిపించలేదు. కొంపతీసి అంతా వెల్లడి అయిపోయిందేమో! మహామంత్రి కూడా తెల్లపోయినారు. ఇప్పుడిది వెల్లడిఅయిందా. మరింత సిగ్గు చేటు. "చాలా కట్టుదిట్టం చేశాను మహాప్రభూ! బహుశా కొద్దిక్షణాలలో వినిపిస్తుంది" అని మనవి చేశాడు:

మహారాజుగారికి దగ్గరలో సన్నగా కిలకిల వినిపించింది. ఎంతో అందంగాఉన్న ఒకస్త్రీ కనిపించింది.

"మీరనుకున్నదంతా తారుమారు అయిపోయిందిలే" అని దేవత నవ్వింది. మహారాజుగారి మొహం మహామంత్రి, మహామంత్రి మొహం మహారాజుగారు చూసుకున్నారు. ఇద్దరూ కలిసివనదేవత మొహం చూశారు. వాళ్లు పడుతున్న కంగారు కనిపెట్టి వనదేవత ఇలా చెప్పింది. "నేను ఈ వనదేవతను మహారాజా! నిన్ను చూసి చాలాజాలిపడ్డాను. ఈ అవస్థ లేకుండా నీకు వేట బాగా చేతనయ్యేటట్లు వరము కావాలంటే ఇస్తాను."

మహారాజుగారికి ఆశ్చర్యం కలిగింది. ఆశ్చర్యంమించి సంతోషం కలిగింది. ఆశ్చర్యం, సంతోషం మించి తొట్రుపాటు కలిగింది. మహామంత్రి కూడా దాదాపు అదేస్థితిలో ఉన్నాడు. మహారాజుగారికి ఆ వరం కోరుకుందామని తొందర కలిగింది. అయితే ఇంతలో మహారాజుకు ఇంకో ఆలోచన కలిగింది. వేటాడటం చేతనయ్యేటట్లు వరం సంపాదించవచ్చు. అంతమాత్రాన తనకువచ్చిన గొప్పతనం ఏమిటి? అందరూ వేటాడుతారు. తానూ వేటాడుతాడు. అలాకాదు. అందరూ నిర్ఘాంతపడిపోయేలాగా తాను వేటాడగలగాలి. అంటే ఎలా? తాను ఇంద్రజాల, మహేంద్రజాల, విద్యలు పొందినవానివలె ఏమితలుచుకుంటే అది జరగాలి. చూస్తూఉండగా ఒకసింహం రావాలి. ఎవ్వరూ దాన్ని వేటాడలేకపోతారు. ఎంత గురిఉన్నవాడు బాణంవేసినా దానికి తగలదు. తాను వెళ్లి హుమ్మనిగర్జిస్తే, అది లొంగిపోతుంది ఈవిధంగా తనశక్తి చాటాలి. ఇటువంటి ఆలోచనలు మహారాజు బుర్రలో గిర్రున తిరిగినాయి.

"ఏమిటి ఇంతసేపు ఆలోచిస్తున్నారు మహారాజా! నామాట అబద్ధమనా? నేను ఏమి చేయదలుచుకుంటె అది చేయగలను. నీవేమి కావాలన్నా సమకూర్చగలను. నాకు అటువంటి శక్తి ఉన్నది."అని వనదేవత హెచ్చరించింది.

మహారాజు ఆలోచనలలోనుంచి బయటపడి తొట్రుపాటుతో వనదేవతను ఇలా ప్రశ్నించాడు

"నేనుకోరిన దేమయినా అనుగ్రహించగలవా ?"

మహారాజు తన్నింకా శంకిస్తున్నాడని వనదేవత అనుకున్నది. అందుచేత నిర్లక్ష్యంగా "ఓ'అయితే ఒక్క కోరికమాత్రమే నేను తీరుస్తాను. మాట అన్నతరువాత తిరగను. కోరుకో, నీ కోరిక నెరవేరుతుంది." అని సమాధానం చెప్పింది.

మహారాజు ఉప్పొంగి పోయినాడు. "చాలు. నాకు ఒక్కకోరిక చాలు. ఆ కోరిక ఏమంటే—నేను కోరుకున్న ప్రతికోరిక తీరాలని." ఇంతవరకు ప్రమాన్పడి చూస్తున్న మహామంత్రి ఇది వినేసరికి ఎగిరిగంతువేశాడు. ఓహోహో! మహారాజుగారు ఎంతటి యుక్తిపరులు? అని అనుకున్నాడు. మహారాజుగారివంక దృష్టిపరపాడు. మహారాజుగారుకూడా తన తెలివికి తానే అబ్బురపడి, ఆనందిస్తున్నారు. వనదేవతమాత్రం చిన్నపోయింది. "మహారాజా! నీవు నన్ను మోసం చేస్తున్నావు. నేను ఆడితప్పను కనుక నీ కోర్కె నెరవేర్చాను. కాని నీ యుక్తికి నీ వంత సంతోషించబోకు. ఎప్పుడో ఒకనాడు నీవు ఇందుకు పశ్చాత్తాపం పొందుతావు." అని చెప్పి వనదేవత అదృశ్యమైంది.

మహారాజు, మహామంత్రి శిబిరంచేరుకున్నారు. సాయంత్రం అయింది. వేటకు పోయినవారందరూ తిరిగివచ్చారు. ఒక్కరి ముఖాన నెత్తురు చుక్క లేదు. అందులో ఏ ఒకరికి ఒక్కచిన్న జంతువుకూడా దొరకలేదు. కనిపించినట్టే కనిపించి మాయమైపోయినాయి. వారు అందరూ విన్నదనంతో ఈమాట విన్నవించేసరికి మహారాజుగారు ముసిముసినవ్వులు నవ్వుతూ మహామంత్రి ముఖం చూశారు. మహామంత్రి తృప్తిగా కనుబొమ తెగరవేశాడు

మరునాడు వేట ప్రారంభమైంది. ఇక చెప్పవలసిందేమిటి? మహారాజగారు మహాఘోరంగా వేటాడేశారు. అంతా సక్రమంగా జరిగింది. అతివైభవంతో మహారాజగారు తిరిగి రాజధాని చేరుకున్నారు.

ఏదయినా సంపాదించటం ఒక ఎత్తు సంపాదించినదానిని సక్రమంగా వినియోగించుకోవటం ఒక

★ మహారాజరహస్యం ★

ఎత్తు. మహారాజుగారు తమకు లభించిన వరాన్ని చక్కగా ఉపయోగించుకొంటే ప్రజలందరిని సుఖపెట్టవచ్చు. తాను సుఖపడవచ్చు. ఇంతటివాడు పుట్టలేదు మరి పుట్టడనిగొప్పకీర్తిసంపాదించవచ్చు. కాని మహారాజుగారు అలా ప్రవర్తించలేదు. నడమంత్రపు సిరివచ్చినట్లు నడుచుకొన్నాడు. కష్టాలలో ఉన్నవారిని ఆదరించి గట్టెక్కించటంపోయి, తన శక్తిచేత మరింత కష్టాల పాలుచేసి వినోదించటం ప్రారంభించారు. ఈవిధంగా మహారాజుగారి వినోదంకొరకు ఎందరో ఎన్నెన్నోకష్టాలపాలు కావలసి రావటం వనదేవత గమనిస్తూనే ఉన్నది. వనదేవత మనస్సులో చాలా కష్టపడింది ఎలాగయినా రాజుకి బుద్ధివచ్చేటట్లు చేయా అని చింతించింది. మహామంత్రికూడా మహారాజుతోపాటే వినోదిస్తూ ఉన్నప్పటికి లోలోన బాధపడుతూనే ఉన్నాడు. మహారాజుగారికి ఇందువలన చిట్టచివరకు ఏమి ప్రమాదం వస్తుందో అనిమాత్రమే అతని విచారం. మహారాజుగారికి లభించినవరం సంగతి ఇంకెవ్వరికీ తెలియకపోవటంచేత, ఆయన చేస్తున్న పనులు ఎవ్వరికీ తెలియలేదు.

ఇలాఉండగా ఒకనాడు మహారాజుగారు ఒక అందకత్తెను చూచారు. మహారాజుగారికి మతిభ్రమసిపోయింది: కాని ఆమె సేనాపతిని ప్రేమిస్తున్నదని, వారిరువురు త్వరలో వివాహం చేసుకోబోతున్నారని మహారాజుగారికి తెలిసింది. ఏమిచేయాలా అని ఆలోచించారు. పదివిధానాలు ఆలోచించారు. కాని ఏ ఒక్కటీ ఆయనకు తృప్తికలిగించలేదు.

చివరకు ఒకనాడు మహారాజుగారు తమకుగల వరప్రభావంచేత సేనాపతిగా మారారు. ఆ అందగత్తె వద్దకు వెళ్ళారు. వరప్రభావాన్ని మహారాజు ఇంకొకవిధంగా ఉపయోగించి ఉండవలసింది. కాని ఆయన ఇంకొకవిధంగా చేయలేదు.

బుక్కింగు మాష్టరు:- నీ ఊరికి రెండుంబావలా అవుతుంది

పల్లెటూరి ప్రయాణీకుడు:- రూపాయి బేడ కిస్తారా?

బు: మా:- ఇదేం కూరగాయల బేరమనుకున్నావా?

ప: ప్ర:- కూరగాయలైతే పావలాకే అడిగేవాణ్ణి.

— కె రామమోహనరావు, కాకినాడ

ఎందుచేతనంటే ఈవిధంగానే జరగాలని వనదేవత నిశ్చయించుకొన్నది ఎలాగైనా మహారాజుగారికి కోరిన కోరిక నెరవేరే శక్తిని పోగొట్టాలని వనదేవత సంకల్పం.

ఇంతలో సేనాపతి అక్కడికి వచ్చాడు. మహారాజుగారు తత్తరపడ్డారు. తాను మహారాజన్న రహస్యం బయటపడకుండా ఉండటానికని ఆయనవస్తున్న సేనాపతిని మహారాజుగా మార్చారు. ఇదంతా కనిపెట్టుతున్న వనదేవత చాలా సంతోషపడింది.

అసలు సేనాపతి వచ్చి నకలు సేనాపతిని చూచి ఆశ్చర్యపోయినాడు. "ఎవరు నీవు?" అని ప్రశ్నించాడు. మహారాజుగారు కొట్టుకుంటున్న గుండెలను చేతితో అదుముకుంటూ "తెలియటం లేదూ? నేను సేనాపతిని" అన్నారు.

సేనాపతిప్రియురాలు నకలు మహారాజును చూచి భయభక్తులతో నమస్కారం చేసింది. నకలు మహారాజు మరింత ఆశ్చర్యపడి "దేనికి నన్నీవేళ ఇంత కొత్తగా చూస్తున్నావు?" అని ప్రశ్నించాడు. ప్రియురాలు మరింత భయపడి "మహారాజుగారు వింతగా మాట్లాడుతున్నారు" అన్నది. నకలుమహారాజు తనవంక ఒకసారి చూసుకొని నిర్ఘాంతపోయినాడు. గబగబవెళ్ళి అద్దంలో చూసుకొని కంగారుపడిపోయినాడు ఇదంతా నకలు సేనాపతి చిరునవ్వుతో గమనిస్తూ ఉన్నాడు సేనాపతి ప్రియురాలికి అంతా అగమ్యగోచరంగా ఉన్నది నకలుసేనాపతి నకలుమహారాజును సమీపించాడు "ఏలినవారు ఎందుచేతో అదోకమాదిరిగా ఉన్నారు. తమకు సెలవైతే తమ ప్రాసాదానికి వెళదాం. మహామంత్రిగారు ఎదురు చూస్తుంటారు" అని మనవిచేశాడు.

రాజప్రాసాదానికి ఇద్దరూ చేరుకున్నారు. మహామంత్రిగారికి కూడా కొంతసేపు వినోదం కలిగించినపిదప ఈ నాటకాన్ని ఆపుచేయవచ్చునని అసలు మహారాజుగారు అనుకున్నారు.

మహామంత్రిగారిని చూడగానే నకలు మహారాజుగారు వంగి నమస్కారంచేశారు. మహామంత్రిగారు తొట్రుపడి, "అపచారం, అపచారం ఏలినవారు నాకు నమస్కారం చేస్తున్నారేమిటి?" అన్నారు సేనాపతిగా ఉన్న అసలు మహారాజుగారు, తమస్థితి గుర్తుకు తెచ్చుకొని మహామంత్రిగారికి వినమ్రుడై నమస్కరించారు నమస్కరిస్తూ ఉండగా ఆయనకు కిలకిల నవ్వు వినిపించింది: ఆ స్వరం వినేసరికి అసలు మహారాజుగారికి ఒకనిమిషం ఎందుకో దడపుట్టింది

కొంతసేపు ఇలాగే గడిచింది ఒకరికి తెలియని భావం మరొకరు మాట్లాడారు. ఒకరికి తెలియని చేష్టలు ఇంకొకరుచేశారు. అసలు మహారాజుగారు ఇక నవ్వు ఆపుకోలేకపోయినారు. పకపక నవ్వారు. చకచకనవ్వారు. విరగబడి నవ్వారు. పొట్ట చేతితోపట్టుకొని నవ్వారు. కింద కూలబడి నవ్వారు. చివరికి గింజుకుంటూ నవ్వారు. ఇంతగొప్ప వినోదం ఆయనకు ఎప్పుడూ కలగలేదు. ఇక నవ్వలేక ఎలాగో కష్టపడి ఆపుకొని "అమ్మయ్య." అన్నారు. మహామంత్రిగారు నిర్ఘాంతపోయినారు. నవ్వు ఆపుకున్న నకలు సేనాపతి లేచి, ఠీవిగా నిలబడి "నేనే మహారాజు"ను అన్నారు. మహామంత్రిగారికి మతిపోయినట్లైంది. అంతవరకు, గంభీరంగా "మహారాజుగారిలాగా కనిపిస్తున్న ఆయన "నేను మహారాజును కానో దేవుడో" అని మొత్తుకొన్నారు.

★ మహారాజరహస్యం ★

ఇప్పుడు సేనాపతిలాగా కనిపిస్తున్న ఈయన "నేను మహారాజు" అంటాడు "నాకేమీ తోచటంలేద" న్నాడు మహామంత్రి అసలు మహారాజుగారు "మంత్రి! గుర్తులేదూ 'మహారాజ రహస్యం'" అన్నారు మహామంత్రిగారికి చటుక్కున జరిగినదంతా తెలిసింది ఇప్పుడు నవ్వే వంతు మహామంత్రిగారిదయింది అసలు సేనాపతి తిక్కమొహం వేసి చూస్తున్నాడు

మహారాజుగారికి ఈ వినోదం ఇక చాలనిపించింది. తిరిగి తాను మామూలుగా మహారాజుగా, నకిలు మహారాజు సేనాపతిగా మారిపోవాలని కోరుకున్నారు సంతృప్తిగా అసలు సేనాపతి వంక చూశారు అతడు మారలేదు తానూ మారలేదు ఎందుకు మారలేదు? మళ్ళీకోరకున్నాడు- మళ్ళీ కోరుకున్నాడు కాని ఏమీ మారలేదు

ఇప్పుడు మళ్ళీ చెవివద్ద కిలకిల నవ్వువినవచ్చింది "ఓయి పిచ్చివాడా!" అనికూడా వినవచ్చింది అసలు మహారాజుగారు ఉలిక్కిపడ్డారు "ఎవరు నీవు?" అని అడిగారు "నేను మహారాజుగారి కోరిక నెరవేర్చిన వనదేవతను ఇంతకుముందే నీవు సేనాపతివని చెప్పకున్నావుకదా! నేను సేనాపతికి కాదుగదా వరమిచ్చింది. కనుక నీకోరిక ఇప్పుడు ఎంత గట్టిగా కోరుకున్నా నెరవేరదు"

మహారాజుగారు అదిరిపోయినాడు ఏడుపుముఖం పెట్టారు ఈ మాటలు మహామంత్రిగారికి కూడా వినిపించినాయి కొంచెము నిగ్రహించుకున్నారు

ఇద్దరూ ఒక్కసారే "సేనాపతీ!" అనిపిలిచారు అసలు సేనాపతి ఇద్దరి వంకా చూశాడు మహామంత్రిగారు గాభరాపడుతున్న మహారాజుగారిని ఊరడించి ఇలా చెప్పారు "నీవు సేనాపతివని తెలుసుకున్నాను జరిగిన విషయమంతా నేను తరువాత చెప్తాను ముందు నీవు మామూలుగా సేనాపతివి కావాలని కోరుకో!"

సేనాపతి నిర్ఘాంతపోయినాడు "కోరుకోవటం ఏమిటి? నేను సేనాపతినే కదా!" అన్నాడు మహామంత్రి మళ్ళీ చెప్పాడు "ఇప్పుడు నీవు మహారాజు వేషంలో ఉన్నావు కదా, తిరిగి ఎప్పటివలె సేనాపతిగా మారిపోవాలని కోరుకో!"

"మహారాజు వేషం పోవాలని



కొంగజపం...

ఫోటో : డి. ఎస్. [illegible]

మా నాటకకంపెనీలో వేషం వెయ్యాలని మీకు అభిలాష ఉండటం ముదావహం. కాని మీకు ఏమాత్రం అనుభవం వుంది

"ఒకపాత్రను ఎలా నటించకూడదో అన్న సంగతి ముఖ్యంగా చాలా బాగా తెలుసండీ ఇన్నాళ్లుగా మీరాడిన నాటకాలను చూస్తూనే ఆమాత్రం అనుభవం గడించాను."

—జి. వి. జి. కృష్ణ.

నేను కోరుకోలేదే! మరి ఎందుకు వచ్చింది?"

మహామంత్రికి ఓర్పు పోయింది "నీవు ఇప్పుడు ఏమి కావాలని కోరుకుంటే అదెల్లా అవుతుంది ముందు నేను చెప్పినట్టు కోరుకో," అన్నారు


సేనాపతి చెవివద్ద ఇలా వినిపించింది "ఎక్కడయినా ప్రపంచంలో ప్రతికోరిక నెరవేరుతుందా? చెప్పు" సేనాపతి విస్మయంతో కలదిరిగి చూశాడు ఎవరూ లేరు "మహామంత్రీ! నేనుకోరుకొన్న ప్రతి కోరికా నెరవేరుతుందా? అలా ఎప్పటికీ జరగదు. నన్నెందుకు ఇలా పరీక్ష చేస్తున్నారు?"

ఇంతవరకూ అదృశ్యంగా ఉన్న వనదేవత ఇప్పుడు అందరికీ ప్రత్యక్షమైంది "తాను కోరిన ప్రతికోరిక నెరవేరదని మహారాజు తెలుసుకున్నాడు ప్రతికోరికా నెరవేటం జరగదని అంగీకరించాడు" అన్నది వనదేవత

మహామంత్రి తొట్రుపాటుతో ప్రశ్నించాడు "మహారాజు అంగీకరించారా? ఎప్పుడు?" వనదేవత సమాధానం చెప్పింది "ఇప్పుడే. మునుపటి మహారాజు తాను కోరుకున్న ప్రకారం సేనాపతి అయినాడు ఆనాడు నన్ను వంచించగలిగానని గర్వపడ్డాడు అందుకు తగినశాస్తి జరిగింది ఆయనకోరిక ప్రకారమే సేనాపతి మహారాజయినాడు ఇక అతడే మహారాజు"

వనదేవత మహారాజయిన సేనాపతివంక తిరిగి "నీవు నీప్రియురాలితో ఈ సింహాసనమెక్కి ఈ రాజ్యంఏలుకో ఇతడు నీకు సేనాపతిగా ఉండి సేవిస్తాడు" అని ఆదేశించింది వనదేవత తన ప్రభావంవలన కొత్తమహారాజుకు జరిగినదంతా తెలిసేటట్లు చేసింది

క్రొత్తమహారాజుగారు ప్రజానురంజకంగా పరిపాలించారు మహారాజ రహస్యాలేవీ ఆయన ఉంచలేదు ★



...ఇందుకేనా?

ఫోటో : జి. రామమూర్తి—మద్రాసు.

బొమ్మరిల్లు సీరియల్



టామ్‌సాయర్ ప్రపంచ యాత్ర

మూలం మార్క్‌ట్వేన్

ఈ సీరియల్ టామ్‌సాయర్, హకల్ బెరీఫిన్ నవలల తరువాత జరిగిన కథను తెలుపుతుంది "హకల్ బెరీఫిన్" నవలలో మాదిరిగానే నవలలో కూడా హకల్ బెరీఫిన్ అనే కుర్రవాడే కథ చెబుతాడు. ఈ నవలలో టామ్‌సాయర్ అనే మరో కుర్రవాడూ, హకల్ బెరీఫిన్, వీళ్ళ స్నేహితుడైన జిమ్ అనే నీగ్రో ముఖ్యపాత్రలు. టామ్‌సాయర్‌కు ఎప్పుడూ ఏదో సాహసం చేస్తూనే వుండాలనీ, తనపేరు దేశదేశాల్లో మోగిపోతూ వుండాలనీ కోరిక. అంచేత ఇదివరకు చేసిన సాహసాలతో తృప్తిపడక, కొత్తవాటికోసం చాలా ప్లానులు వేస్తాడు కాని మిగతా వాళ్ళిద్దరూ అతని ప్లానులు అన్నిటినీ తోసివేస్తారు. ఏంచేయడానికీ పాలుపోకుండా వున్న సమయంలో, ఒక ప్రొఫెసరు బెలూన్‌లో యూరప్ పోవడానికి బయలుదేరనున్నట్టు వాళ్ళకి తెలుస్తుంది. అది చూసివద్దామని వెళ్ళిన టామ్, హక్, జిమ్ ముగ్గుర్నీ ప్రొఫెసరు లోపలికి రానిచ్చి హఠాత్తుగా బెలూన్‌ను బయలుదేర దీస్తాడు. యూరప్ ప్రయాణమై పోతున్న విమానంలో ముగ్గురు మిత్రులు నిర్ఘాంతపోయి కూర్చున్నారు మార్గమధ్యంలో ప్రొఫెసరు తెగ తాగి సముద్రంలో పడి మరణిస్తాడు. బెలూన్ నడపడం టామ్ నేర్చుకున్నందున ప్రయాణం క్షేమంగానే సాగింది కాని విమానం యూరప్ పోవడానికి బదులు సహారా ఎడారిలో ప్రవేశించింది తరవాత వారికొక వర్తకుల బిడారం ఎదురుపడినది. బిడారంమీద దొంగల గుంపు ఒకటి పడి ధనం దోచుకోడానికి ప్రయత్నించారు. కాని ఓడిపోయి పారిపోయారు వర్తకులకు చెందిన ఒక శిశువును దొంగలనుండి మనముగ్గురు స్నేహితులు రక్షించారు.

జిమ్ భయ సంభ్రమాలతో వణుకుతూ కూలబడ్డాడు కాస్తఆగి వగరుస్తూ ఇలా అన్నాడు: "టామ్ గారూ! అది దయ్యమే. సందేహం లేదు. తప్పకుండా దయ్యమే అది మళ్ళీరాకుండా వుంటే బావుండును. రెండుసార్లు సరస్సువేషంలో వచ్చింది. రెండుసార్లూ మాయమైపోయింది. మన్ని ఏడిపించడానికే దయ్యం అలా చేసింది. అసలు ఈ ఎడారిలోకి ఎందుకు వచ్చామోగాని, దీన్నిండా దయ్యాలే. టామ్‌గారూ! మనం దీన్నుంచి వీలైనంత త్వరగా బయటపడాలి. చీకటి పడకముందే మనం వెళ్ళిపోవాలి. రాత్రయితే ఈ దయ్యాలు మన్ని ఏంచేస్తాయో తెలియదు. నిద్ర పోతుండగా వచ్చి ఏమన్నా చేస్తే?"

టామ్ అతని మాటలకు అడ్డంవచ్చి, "దయ్యమా? మట్టిబుర్ర! అది దయ్యంకాదు గియ్యం కాదు. గాలీ, వేడీ, దాహం ఇవన్నీకలిసి నీ మెదడు మీద దట్టంగా అతుక్కుని అక్కడ సరస్సులాంటిది కనబడేట్టుచేశాయి అదివట్టి ఎండమావి. మరేం లేదు ఏదీ ఆ అద్దాలు ఇటివ్వు," అని దూరదర్శినిఅందుకుని పరికించసాగాడు.

"అవిగో, పక్షులు! ఒకే లైనులో ఎక్కడికో వెడుతున్నాయి సూర్యుడు పడమటికి తిరిగాడు కనక ఏదో పనిమీద అవి పోతున్నాయనిపిస్తోంది. బహుశా నీటికోసమో, మేతకోసమో లేక రెండిటికోసమో పోతున్నాయేమో. విమానాన్ని పైకి పోనివ్వండి. ఆ చాలు. మెల్లిగా పోనివ్వండి," అని ఆజ్ఞాపించాడుటామ్.

మేము విమానవేగంతగ్గించి పక్షులకు దాదాపు పావుమైలు వెనకాల వాటిని అనుసరించసాగాము ఆ విధంగా గంటా గంటన్నరసేపు ప్రయాణంచేసిన తర్వాతకూడా ఆదారికి అంతూపొంతూ కనిపించక పోయేసరికి మాకు నిరుత్సాహంకలిగింది మాకు దాహం దుర్భరమై క్రమ క్రమంగా నిస్త్రాణ ఆవహిస్తోంది ఇంతలో టామ్అన్నాడు. "అద్దాలుతీసుకొని చూడండి. పక్షులకు అల్లంతదూరాన కనిపించేది అదేమిటో చూడండి"

జిమ్ దూరదర్శిని తీసుకొనిచూసి మళ్లీ కుప్ప కూలినట్టు కూలిపోయాడు ఏడుపుగొంతుపెట్టి," టామ్ గారూ! అదే, అదే మళ్ళీదయ్యమే. ఇది మూడోసారి. ఈసారి చూశానంటే నేను చచ్చిపోతాను ఈపాడు బెలూన్‌లో ఎందుకు వచ్చానో ఏమిటోగాని —" అన్నాడు

అటుకేసి కన్నెత్తి చూడడానికి కూడా జిమ్ నిరాకరించాడు నాకు కూడా భయంకలిగింది జిమ్ చెప్పింది నిజమేననిపించింది దయ్యాలు ఇలాగే మాకు వేషాల్లోవచ్చి మనుషుల్ని మోసగిస్తాయి నేనుకూడా అటు చస్తేచూడనన్నాను బెలూన్‌ను వెనక్కి తిప్పకు పోదామని టామ్‌ను బతిమాలాము కాని అతడు మమ్మల్ని గడ్డిపమ్మకాలు పెట్టుకున్న చవటకిందకట్టి తిట్టాడు మమ్మల్ని తిడితే పరవాలేదు కాని దయ్యాల్నికూడా తిట్టాడు మరి దయ్యాలు వూరుకుంటాయా? ఎప్పుడో టామ్‌ను మూడిందని అనుకున్నాను దయ్యాలు కొంతకాలం సహిస్తాయి కాని అస్తమానం తిడుతుంటే వాటికి మాత్రం కోపం రాదూ?

కాసేపు ముగ్గురిలో ఎవరమూ మాట్లాడలేదు. టామ్ విమానాన్ని నెమ్మదిగా వేగంతగ్గించి ఒకచోట నిలిపాడు. "చూడండి చవటల్లారా! లేచి చూడండి," అన్నాడు

లేచి చూశాము. విమానంకింద నిజంగానే నీళ్లున్నాయి. నిర్మలంగా, నీలంగా, చల్లగా, లోతుగా గాలికి చిన్నచిన్న అలలుగా కదులుతూ కనిపించాయి నీళ్లు చెరువుకు చుట్టూరా పచ్చిక దట్టంగా పెరిగింది. అక్కడక్కడపువ్వులమొక్కలున్నాయి పొదలు, చెట్లు, ద్రాక్షతీగలు గుబురుగా పెరిగివున్నాయి. అంతా ప్రశాంతంగా, రమణీయంగా వున్నది. ఆదృశ్యం చూస్తే మామూలుమనిషికే ఆనందంగావుంటుందంటే, దాహంతో చావడానికి సిద్ధంగావున్న మా కెంతఆనందంగావుండాలి?

జిమ్ సంతోషంతో ఏడ్చాడు. నాట్యంచేశాడు. పాటలుపాడాడు. అప్పుడు విమానంలో కాపలాకాయవలసిన వంతు నాది. అందుచేత నేను పైనే వున్నాను. టామ్, జిమ్ యిద్దరూ నిచ్చెనమీదుగా కిందికి దిగి ఒక్కొక్కరు ఒక్కొక్క పీపానీళ్లు పొట్టనిండా తాగి గ్రున త్రేన్చారు. బాల్చీతోనీళ్లు పైకి పట్టుకొచ్చారు. నేను అంతకుముందు రుచ్యపదార్థాలు చాలాతిన్నాను తాగానుగాని ఆ నిర్మల సరోవరజలంతో ఏవీ సాటి రావు.

తరవాత వాళ్ళిద్దరూ మళ్లాదిగివెళ్ళి శుభ్రంగా యీదులాడారు. తరవాత టామ్ విమానంలోకి వచ్చాడు. నేను వెళ్ళి జిమ్‌తోకలిసి ఈతకొట్టాను. తరవాత జిమ్ విమానంలో కెక్కాడు టామ్ నేనూ కలిసి కొంతదూరం పరిగెత్తాము కొంతసేపు కుస్తీపట్టాము అంత సంతోషంగా నే నెప్పుడూ లేననిపించింది. సాయంత్రమైనది గనక గాలి చల్లబడింది. ఒంటిమీద బట్టలుకూడా లేవు గోచీలుతప్ప బట్టలు ఇళ్ళలోనూ, పట్నాలలోనూ, సభల్లోనూతప్ప, "నాగరికత'కు దూరంగావున్న యీఎడారిలో వాటి అవసరం ఏమున్నది?

"సింహాలు! బాబోయ్! సింహాలు! టామ్‌గారూ! హాక్! పరిగెత్తండి," అని జిమ్ కేకవినిపించింది

★ టామ్‌సాయర్ ప్రపంచయాత్ర ★

కరిగెత్తడం అలా ఇలాకాదు ప్రాణశక్తి అంతా వుపయోగించి పరుగెత్తుకువచ్చి నిచ్చెన ఎక్కాము బట్టలు తెచ్చుకోటానికి కూడా వ్యవధి లేకపోయింది మేము నిచ్చెనఎక్కీ ఎక్కగానే జిమ్‌కు మతిపోయింది అతనికెప్పుడూ అంతే ఏచిన్నసమస్య ఎదురైనాచాలు మతి ఇట్టేపోతుంది నిచ్చెనకొంచెం పైకి లాగితే సరిపోతుందా—అలా చేయకుండా విమానాన్ని బర్రునపోనిచ్చాడు ఏముంది? విమానం శర వేగంతో పైకిపోయింది అప్పుడు తెలుసుకున్నాడు జిమ్ తనతప్పిదం వెంటనే విమానం నిలిపేశాడు కాని తరవాత ఏంచెయ్యాలో తెలియక తటపటాయిస్తు న్నాడు గాలి బలంగావీస్తున్నందున మేము నిచ్చెన మీద నిలబడి అటూ యిటూ వుయ్యాలవూగు తున్నాము.

కాని టామ్ ధైర్యం కూడదీసుకుని, మెల్లిగా నిచ్చెనఎగబాకి విమానంలోకి వెళ్ళాడు విమానాన్ని కిందికి దింపుతూ సరస్సుకేసి పోనిచ్చాడు ఇదేమిటి, టామ్‌కు కూడా మతిపోయిందా అనుకున్నాను సరస్సు వొడ్డున సింహాలు సభచేసి ఇంకాఅలాగే



కూర్చున్నాయి నేను పైకి పాకివచ్చేధైర్యం కలవాణ్ణి కానని టామ్‌కు తెలుసు మరినన్ను సింహాలసభకు అధ్యక్షుణ్ణిచేద్దామనా అతనివుద్దేశ్యం?

కాదు తను చేసేదేమిటో టామ్‌కు తెలుసు క్లిష్టపరిస్థితిలో అతనిబుద్ధి మరింతచురుగ్గా పని చేస్తుంది విమానాన్నిసరిగ్గా సరస్సుమధ్యకు తీసుకు పోయి నిలిపాడు

"హక్! ఇప్పుడు నీళ్ళలోకి దూకు"

అలాగే దూకాను సూటిగా అడుక్కి పోయి మళ్ళీ పైకి వచ్చాను

"అలాగే కాసేపు నీళ్ళలో తేలుతూవుండు కాస్త ధైర్యం చిక్కాక నిచ్చెనఎక్కి విమానంలోకి రా," అని సలహాయిచ్చాడు టామ్

ఈలోగా సింహాలు, అప్పుడే వచ్చిన పెద్దపులులు మేము విడిచివచ్చిన బట్టల్ని తమలోతాము పంచు కోడానికి ప్రయత్నిస్తున్నాయి పాపం వాటిని సమానంగా పంచుకుందామనుకున్నట్లున్నాయి, కానిఎక్కడో ఏదో అభిప్రాయభేదం వచ్చినట్లుంది ఇక తమలో తాము కీచులాడుకోసాగాయి ఒకపెద్ద విప్లవం వచ్చి ...ంత ఉధృతంగా పోట్లాట చెలరేగింది. దాదాపు ఒక యాభైజంతువులున్నాయి. గర్జిస్తూ, గాండ్రిస్తూ, కొరుక్కుంటూ, పీక్కుంటూ, రక్కుకుంటూ దెబ్బలాడు కున్నాయి. దెబ్బలాట ముగిసేసరికి కొన్నిచచ్చి పోయాయి. కొన్నితీవ్రంగా గాయపడి కుంటుకుంటూ పోయాయి. కొన్ని యుద్ధభూమినుండి తొలగిపోయి గాయాలు నాక్కుంటూకూర్చున్నాయి. మరికొన్ని మాకేసి ఆకలిచూపులు చూస్తున్నాయి. ఇంకాకొన్ని మమ్మల్నికూడా కిందికివచ్చి తమతో ఆడుకోమని అంటున్నట్లు గర్జిస్తున్నాయి.

ఈ దెబ్బలాటలో మాబట్టలు మాయమై పోయాయి. చిన్న ముక్కకూడా మిగల్లేదు. అన్నీ ఆజంతువుల కడుపుల్లోకి వెళ్ళిపోయాయి. బహుశా అరగలేదో ఏమో జంతువులు బాధపడుతున్నట్టుకూడా కనిపించాయి. ఎందుకంటే మాచొక్కా, లాగూ జేబుల్లో మేకులు, చాకులు, పొగాకు, సీమసున్నం ముక్కలు, గోలీలు, చేపలగాలాలు, బొత్తాములు

(55 వ పేజీ చూడండి)

జమీందారుగారి జయరాం

నేమాని వీరభద్రరావు

జమీందారుగారి దివాణంలో ఒక గొప్పమల్లుడు ప్రవేశించాడని తెలియగానే చాలమంది జనంచూడటానికి వెళ్లారు. మనిషి ఆజానుబాహువు కండలు పెరిగినశరీరం. కాని ముఖంలోమాత్రం అంత గాంభీర్యం కనబడటంలేదు. జమీందారుగారు మల్లుని తమదివాణంలో ఉంచిపోషిస్తూ ఉండాలని నిశ్చయించారు. 'దివాణంతాలూకు మల్లుడు కదా' అని ఎవ్వరూ జంకవద్దని, అతనితో పట్టుపట్టి అందరూ తమ తమ బలాబలాలు పరీక్షించుకోవచ్చునని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమాలకు వేరు వేరు స్థలాలు దివాణంలోనే ఏర్పాటు చేయబడినాయి.

దివాణం మల్లునిపేరు 'జయరాం'జయరాంశరీరం చూసినప్పటినుంచి చాలమంది యువకులకు కసరత్తుచేసి అతనిలాగే కండలు పెంచాలన్న బుద్ధిపుట్టింది ఎక్కడ చూసినాకసరత్తులే మొదలుపెట్టారు, ఒక్కనెల పూర్తిగా గడిచిందో లేదో, చాలామందికి దివాణం మల్లునితో కుస్తీపట్టి తమబలాన్ని పరీక్షించుకోవాలనిపించింది. జయరాం అందరినీ చిత్తుచేసి వదిలిపెట్టేడు. జమిదారుగారు తానే ఆపందెం, నెగ్గినంతగా గర్వపడ్డారు. ఈసంగతి చుట్టుప్రక్కల పిల్లమల్లురకు తెలిసి వెంటనే పోటీకి సిద్ధపడ్డారు వారినికూడా జయరాం సునాభంగా ఓడించాడు.

ఈ విషయం జమిందారుగారికి తెలిసిత్పృప్తితోనవ్వుకున్నారు. "దివాణం మల్లునిఎలాగ ఓడించటమా" అన్నసమస్య చాలమందికి పట్టింది. జయరామునిచూచి అసూయపడిన వారందరూ అతనిని ఓడించటానికి ఉపాయాలు అన్వేషించ సాగారు.

ఒకనాటిరాత్రి ఇటువంటివారు కొంతమంది సమావేశమైనారు. సంగతేమిటో చూద్దామని వీరయ్యకూడా చేరాడు వీరయ్యకంకాళంలా ఉంటాడు. కాని కళ్ళలోమాత్రం వింతకాంతి కనిపిస్తుంది. వీరయ్యరాక అందరికీ ఆశ్చర్యకారణం అయింది. జయరాంని ఓడించడానికి అది కాదుఇదనీ, ఇదికాదు అదనీ అనేక ఉపాయాలు సమావేశంలో చర్చించారు. వీరయ్య అన్నీవిన్నాడు. ఆఖరుకు లేచి "మిత్రులారా!" అని సంబోధించి ఇలా చెప్పాడు.

"మీరందరూ జయరాం కనపడినప్పుడల్లా ప్రేమ ఉట్టిపడేటట్లు "అన్నా, ఏం అలావున్నావు?" అని పలకరించండి 'ఏం' అని ఆశ్చర్యపోయి అడుగుతాడు. "ఆ! మరేం లేదు కొంచెం చిక్కినట్లున్నావు" అని నసిగి, జాలిపడినట్లు నటించి చల్లగా జారిపొండి." జయరాంకు ఏమాత్రం అనుమానం తట్టకుండా ఈపనిజరిపించండి. తరువాత ఏం జరుగుతుందో చూడవచ్చును "అన్నాడువీరయ్య.

ఒకరోజున జయపురంనుంచి ఒక గొప్పమల్లుడు జమిందారు గారి దర్శనానికివచ్చాడు. వెంటనే జయరాంకోసం కబురుపంపించారు. ఇరువురి బలాబలాలు పరీక్షచెయ్యటానికి ఒకరోజు నిశ్చయించబడింది. ఈవిషయం నిమిషంలో గ్రామమంతా వ్యాపించిపోయింది. వీరయ్య సలహానుసరిస్తూ ఉన్న వాళ్ళకు గుండెల్లో గుబులుగుబులుమంది సమయం మించి పోతుందనుకున్నారు. ఇకపందెంపట్టుమని పది రోజులు లేదు. ఈ పదిరోజుల్లోనూ వీరయ్య మంత్రంపని చెయ్యాలి. ఇద్దరు మల్లులూ దివాణంలో పడి తెగతింటూ కుస్తీకి తయారవుతున్నారు. ఈ దెబ్బతో తనకీర్తి, జమిందారుగారి కీర్తి దిగంతాలకు వ్యాపిస్తుందని జయరాం ఆశిస్తున్నాడు. గడువు మూడుదినాలలోకి వచ్చింది. జమిందారుగారు చెయ్యవలసిన ఏర్పాట్లుఅన్నీ చేశారు. జయరాం ఆనాడు సాయకాలం బజారువెంట వెళ్తూఉండగా 'ఏమండీ అలా ఉన్నా'రని ఒకఅపరిచితవ్యక్తి పలకరించాడు. జయరాం కళ్లురిమి "ఎలా ఉన్నాను, నీ కళ్ళకు దయ్యాంలా కనబడుతున్నానా?" అనికోపంతోగద్దించాడు ఆఅపరిచితవ్యక్తి భయపడకుండా "అయ్యా! నేను మరోకందుకన లేదు. తమరు కొంచెం చిక్కినట్లుగా కనిపిస్తున్నారు. అందుకనిఅడిగాను" అని చల్లగా జారుకున్నాడు ఇలా మరి నలుగురు అడిగేసరికి జయరాంకు నిజమేమో అనిపించింది. గుండెదిగజారిపోయింది.

(49 వ పేజీ చూడండి)

భారత్ క్రాస్‌వర్డ్స్ రూ. 1,00,000

REGD NO 1866

4 బహుమతులు | **మొదటి బహుమతి రూ. 50,000 ఇతర బహుమతులు రూ. 50,000**

బయటఊరు పోస్టు తేది **3-2-55.** మదరాసు ముగింపు తేది **5-2-55**

1	భారతదేశమందు శీలతకు—ఒక ఆదర్శకము	..	అరుంధతి	అనసూయ
2	ఒక గొప్ప కవి యొక్క—కలిగియుండును	..	ఊహాశక్తి	భావోద్రేకము
3	మనశ్శాంతి సహజంగా ఒకరి—వృద్ధిపరచును	..	ఆరోగ్యమును	ఆనందమును
4	—విద్యార్థికి తన పఠనయందు యెక్కువ సహకరించును	..	కుశాగ్రబుద్ధి	శ్రద్ధ
5	ఈరోజుల్లో—చిత్రాలపట్ల యెక్కువ మక్కువ కలదు	..	ప్రేమ	హాస్య
6	ఆధునిక విజ్ఞానము చాలవరకు—జయించియున్నది	..	కాలమును	దూరమును
7	వివాహ తీర్మానములందు—గొప్ప ప్రాముఖ్యత వహించుచున్నది		విద్య	సంపద
8	యెచ్చోట—కలదో అచ్చోట శక్తికలదు	..	ఐక్యబలము	జ్ఞానబలము
9	గాంధీజీగారి జీవితము పూర్తిగ—నిండియుండెను	.	శోధనలతో	సత్యములతో
10	పీడింపబడిన మనసును—ఉపశాంతి చేయగలదు	..	వెన్నెలు	సంగీతము
11	—ఒక నేరస్థుని సన్మార్గుని జేయును	..	అభ్యుదయము	పశ్చాత్తాపము
12	ఇతరుల తప్పుల—దైవత్వము	..	క్షమించుటయో	మరచుటయో
13	—దైవికమునకు ప్రక్కతోడని చెప్పబడుచున్నది	..	పరిశుభ్రత	దయ
14	—అత్యుత్తమముగా సద్వినియోగించువారు జీవితమున యెక్కువ జయమొందెదరు ..	..	అవకాశమును	జ్ఞానమును
15	కొందరు జీవితమున అపజయముపొందుటకు గొప్పకారణము	..	దురదృష్టము	అశ్రద్ధ
16	ఆర్థిక ప్రపంచమున—ఒక గొప్పశక్తి	..	పరిశ్రమము	మూలధనము

వరుస 1-కి రు. 1. రు. 2-కి 4 వరుసలు. రు. 6-కి 16 వరుసలు. రు 8-కి 32 వరుసలు రు. 16-కి 128 వరుసలు.

1	
2	
3	
4	
5	
6	
7	
8	
9	
10	
11	
12	
13	
14	
15	
16	

ముఖ్య గమనిక :—పోటీదారులు భారత్ క్రాస్‌వర్డ్స్ షరతులకు బద్ధులు. మనియార్డరు రసీదు లేక వచ్చు కూపనులను, మద్రాసు ముగింపు తేదికి పిమ్మట వచ్చు కూపనులను నిరాకరింపబడును. రు. 2-కి తక్కువ పనూలుకు కమిషన్ లేదు.

Name ______________ *Collotor No.* ______

Address ______________

M O Rpt. No——— Rs ——— Coupon Rpt No ——— Date ———

NO.131

Special Prizes
For every First prize Winner 2 Soverign Chain
For every 2 nd Prize winner ½ Soverign Ring.

A rare opportunity! Dont miss!! Try Today Itself !!!

విజ్ఞానవీధులు

"డాక్టర్"

199. జ్యోతిషము

నిజమా? అబద్ధమా? అని చాలామంది అనుకుంటున్నారు ఇదివరలో ఈ సందేహాన్ని గురించి రెండుసార్లు గాబోలు చర్చించాము. మరొక దృక్పథములో ఈ సమస్య ఎలాగ కనపడుతుందో ఇప్పుడు సూచిస్తాము

జ్యోతిషశాస్త్రమును దేవతలు ఋషులకు చెప్పినారని చాలామంది నమ్ముతారు కాని గ్రహాలూ, రాసులూ గురించి భారతీయులకు గ్రీకులు ఈ దేశముమీద దండెత్తి రాక పూర్వము తెలుసుననడానికి ఆధారాలు లేవు కాబట్టి జ్యోతిషము అనాదికాలపు అజ్ఞాతయుగాల్లో కాక చరిత్రకి తెలిసిన, క్రీ పూ. నాలుగో శతాబ్దాంతమందే ఆవిర్భవించిందనాలి. ఆ కాలములోని "ఋషు"లే జ్యోతిషాన్ని నేర్చి వెదజల్లియుండాలి.

పోనీ వాదముకోసము జ్యోతిషమును ప్రారంభములో ఎవరో దేవతలు చెప్పినారనుకుందాము. ఒక జాతకుని జన్మకాలము నుండి గ్రహములకు ఒకొక్కదానికిన్నేసి యేళ్ళు చొప్పున కేటాయిస్తుంది శాస్త్రము ఆ గ్రహానికి అన్నియేళ్లూ, ఈ గ్రహానికి ఇన్నియేళ్లూ నిర్ణయించడానికి కారణము ఎవరూ చెప్పలేరు

"ఇదేమి విడ్డూరమూ?" అని అడిగితే జ్యోతిషములో చక్కని ప్రవేశముగల ఒక మేధావి చెప్పినాడు గదా, "అక్కడనే దివ్యదర్శనము ఇమిడి ఉన్నది ఆ జ్ఞానము ఋషులు తపస్సువల్ల కనుక్కున్నారు మీరు నమ్మినారా, నమ్మండి లేకపోతే పోనీ. జ్యోతిష విజ్ఞానము మీ సైన్సు విజ్ఞానమువలె పరిశోధనశాలలో జడపదార్థాల మీద సోదాలుచేసి గ్రహించినట్టిదికాదు. ఈ పద్ధతులు జ్యోతిషముమీద పనిచేయవు" అని. నే నంటిని. "అట్లనా? అయితే మహా బాగు. మీరు నాపని మరీ సులువుచేసినారు సరే ఒక గ్రహానికి ఆరేండ్లు దశ కలదందాము. ఈ ఆరేండ్లలో జరిగే ఘటనలన్నీ ఒకేరీతిగా ఉండవు. ఈ ఘటనలలో లాభనష్టములూ, ఎగుడు దిగుడులూ ఉండును. ఈ ఫలితాలను సర్దుకోడానికి అగ్రహదశని మళ్లీ అన్ని గ్రహాలకీ పంచిపెట్టినదీ, మళ్లీ ఆ దశాంతర తునకను భాగాలుచేసి అగ్రహాలకు పంచిపెట్టినదీ, ఇలాగ జ్యోతిషాన్ని ఉల్లిపాయవలె చేసిపెట్టినదీ ఋషులేనంటారా? ఇందులో ఘటనలతో లంకె పెట్టడానికి నరమానవులు చేసిన నీరసయత్నము చక్కగా గోచరించడము లేదా?' అని ఆ వాదము అవ్యవధివల్ల ముందుకు సాగినది కాదు

ముక్కల్ని ముక్కలుగా, ఆ ముక్కల్ని మళ్లీ ముక్కలుగా కొట్టడము భారతీయ శాస్త్రకారులకు మామూలు. "వరరథ మొక్కండు వారణ మొక్కండు, తురగములు మూడు కాల్వురును నేవు, రను సంఖ్యగల యదియగు బత్తి,' దీనిని మూడుపెట్ట గుణించుకోండి ఒకొక్క దశకి ఒకొక్క పేరు ఇక 'సూర్యకిరణంలో మెరిసే రేణువును 'త్రస' రేణు వన్నారు (దీనికి నిర్ణీతమగు పొడవు లేదు, అది అలాగ ఉంచండి) దీనిని గుణించుకుంటూపోతే చివరికి అంగుళము వస్తుంది ఆ అంగుళానికి ఇదీ ప్రమాణము అని నిర్ణయము లేదు ఇక అలంకార శాస్త్రము చూడండి. "గుణీభూత వ్యంగ్య భూతధ్వని, వ్యంగ్యీభూత గుణీభూతధ్వని, గుణవ్యంగ్యీభూత, వ్యంగ్యగుణీభూత, గుణ గుణ వ్యంగ్యీభూత, వ్యంగ్య వ్యంగ్య గుణీభూత" ఈ భూతము నరమానవుల వ్యవహారములో కనపడదు. అదీ మమ్మటాచార్యుని గొప్ప స్తనశాస్త్రపరీక్ష కాదా యిది? ఇంతమంది అలంకారికులూ రాసినవి వల్లించిన మహానుభావులు "మాతులంగ లవంగ లుంగ చూతకేతకీ " అని చెట్ల పేర్లన్నీ ఏకరువుపెట్టి దాన్ని అడివి అన్నారు "భిల్లీభల్లులులాయక. " అని జంతువుల పేర్లన్నీ జాబితా వేశారు; అవి ఆ అడివిలో వున్నాయట జలచరాలన్నీ సముద్రము కానీ చవిటిపర్ర కానీ అందులో ఉండవలసిందే!

ఈ రకపు కృతక కల్పన జ్యోతిషములో కనబడుతోందంటాను. "జరిగిపోయిన ఘటనను జ్యోతిషమువల్ల వివరించవచ్చును, భవిష్యత్తును సరిగా చెప్పలేమ"ని మా గురుతుల్యు లొకరన్నారు. జరిగిపోయినదానిని వివరించే నేర్పు జ్యోతిష మెలాగు అవుతుంది? మన దేశభక్త పరిశోధకులు "అణుశక్తి ఆయుర్వేదజ్ఞులెన్నడో ఎరుగుదుర"నీ కాంతితరంగమూలకముగా ప్రసరించుతున్న "భుజగమితా స్సపతరధ్వాః" అన్న వాక్యమనీ దంచేస్తున్నారే, ఈ పరిశోధన కెంత ఉపయోగమో గడచినదానిని వివరించడమూ అంతే ఉపయోగము.

"జ్యోతిషము శాస్త్రము నిజమూ శాస్త్రజ్ఞులబద్ధమూ" అన్నారు మరియొకరు ఏతావాతా ఫలితమొకటే. "గడచినదానిని చెప్పవచ్చు" నన్న వాదానికి సూత్రావతారమే ఈ వాదము.

"నీకు రపేమని సరిపోయే ఫలితము చెపితే? అప్పుడేమంటావూ?" అన్నాడింకొక మిత్రుడు "నాకా ఫలితాలు చెప్పనక్కరలేదంటాను అయ్యేది ఎలాగూ జరిగిపోతుంది తెలుసుకుని లాభమేమిటి?" అన్నాను అయితే ఇది సూటి అయిన జవాబుకాదు అలు జవాబిది "అలాగ చెప్పె నాయనే తిప్ప నెబితే ఏమంటావూ" అని నన్ను ఒకాయన "పడమటికి కాదు తూర్పుకి నీ దూరప్రయాణమ'న్నాడు. అది అలాగే జరిగింది తర్వాత నువ్వు సెగ పదిహేను రోజుల్లో ఊరూ ఉద్యోగమూ మారతావన్నాడు ఇది అబద్ధమాయె. బొమ్మో బొరుసో, ఏదో ఒకటి పడుతుంది జ్యోతిషము దెబ్బ గుడ్డెద్దు తాపు ఇక నిజమంటే ఏమిటి? ★

జమీందారుగారి జయరాం

(47 వ పేజీ తరువాయి)

కుస్తీలుపట్టేస్థలం చక్కగా అలంకరించబడింది. తండోపతండాలుగా జనంవచ్చారు. ఇంత గొప్ప సంగతి తన ఆధ్వర్యాన జరుగుతున్నందుకు, జమిందారుగారు చాలా సంతోషిస్తున్నారు.

ప్రేక్షకులందరూ కుతూహలంతో చూస్తున్నారు మల్లులవైపు. జయరాం ఒకటిరెండుసార్లు క్రింద పడగానే ప్రేక్షకలోకంనుంచి హర్షధ్వనులు వచ్చినాయి. జయపురం మల్లుడు క్రిందపడినప్పుడు అందరూ ఆతృతతో చూస్తున్నారు. చివరకుజయపురం మల్లుడు జయరాంను చిత్తుచేశాడు. ప్రేక్షకులలోనుంచి ఒక్కసారి జమిందారుగారి జయరాం, "రాంరాం" అన్నధ్వనులు మిన్ను ముట్టినాయి. జయరాం ఎందుకు ఓడిపోయినాడో జమిందారుగారికి అర్థంకాలేదు. ★

బొంబాయి సినిమా లేఖ


(ఆంధ్రవారపత్రిక విలేఖరి)

భారతీయ చిత్రపరిశ్రమలోని గొప్ప నృత్య దర్శకులలో కీ॥ శే॥ శాంతి బర్ధన్ ఒకరు. ఈయన స్థాపించిన 'లిటిల్ బాలే ట్రూప్' వారు ఇటీవల బొంబాయిలో రామాయణం ప్రదర్శించారు. భారతీయ, విదేశీయ విమర్శకులు, కళాభిమానులు అందరూ ఈ ప్రదర్శనాన్ని మెచ్చుకున్నారు. ఇతరదేశాల నృత్యకళకంటె మన దేశపు నృత్యకళ విశిష్టమైనదనే సత్యాన్ని ఈ ప్రదర్శనం నిరూపించింది. అతి సుందరంగా కూర్చబడిన ఈ నృత్యం కీ॥ శే॥ శాంతిబర్ధన్ ప్రతిభకు నిదర్శనం.

శాంతిబర్ధన్ స్మారక సంఘం అనే పేరుతో ఒక సంఘం స్థాపించబడింది. దీనిలో శ్రీమతి ఇందిరాగాంధీ, గరమ్‌సే ఖటావ్, డి ఆర్ డి టాటా, డా॥ ముల్క్ రాజ్ ఆనంద్, రాజ్‌కపూర్, నిఖిల్ కుమార్ ఘోష్, హోమీ సేట్నా సభ్యులు. ఈ సంఘం శాంతిబర్ధన్ ప్రారంభించిన కృషిని కొనసాగించే ఉద్దేశ్యంతో స్థాపించబడింది. ఈ సంఘానికి సహాయం చేయవలసిందని హోమీ సేట్నా దేశంలోని కళాభిమానులందరికీ విజ్ఞప్తిచేశారు. శాస్త్రీయ నృత్యాన్ని, జానపద నృత్యాన్ని సమన్వయం చేయడంలో శాంతిబర్ధన్ నిజము పొందారనీ, ఒక క్రొత్తరకం కళను సృజించడమే కాక విద్యార్థులనేకులకు పాత, క్రొత్త పద్ధతులను ఆయన నేర్పి వారిలో నూతనోత్సాహం కలిగించారని ఆయన విజ్ఞప్తిలో ఉన్నది. శాంతిబర్ధన్ స్మారకకేంద్రం, లేక విద్యాశాల ఒకదాన్ని స్థాపించి అందులో శాస్త్రీయ జానపదనృత్య పద్ధతులను బోధించడం, క్రొత్త పద్ధతులను సృజించే ప్రయత్నాలను ప్రోత్సహించడం, శాంతిబర్ధన్ ముగించలేకపోయిన పనులను ముగింపుకు తీసుకురావడం, మొదలైన ఆశయాలను సాధించడానికి నిధిని సేకరించాలని, అందుగా ఆ నిధికి చందా వేయాలని హోమీ సేట్నా కోరారు. చందాలు పంపదలచినవారు కార్యదర్శి, లిటిల్ బాలే ట్రూప్, పెరీరా హిల్, కుర్లా రోడ్, అంధేరి, బొంబాయి చిరునామాకు పంపవచ్చును.

* * *

చిత్ర నికేతన్ లిమిటెడ్ వారు అని



అంజలీవారి "అనార్కలి"లో అనార్కలిపై కుట్రపన్నుతున్న గుల్నార్‌గా బాలసరస్వతి, చెలికత్తెగా కళాదేవి.



కిస్ట్ర్ వారి "పెహలీ ఝులక్"లో నటి రూంవర



ఇటీవల ఎడుదలైన "అర్థాంగి"లో దొరస్వామి,
బి ఎస్ ఆర్

★ బొంబాయి సినిమా లేఖ ★

కాలంలో నాలుగు చిత్రాలు విడుదలచేయ నున్నారు. ఒకటి ఫిల్మ్‌జార్ వారు నిర్మిస్తున్న "తన్‌ఖా" దర్శకుడు చాంగేజీ. ఈ చిత్రంలో మధ్యతరగతి కుటుంబం పడే కష్టాలు ఇతివృత్తం. కుటుంబంలోవారంతా ముసలితండ్రి తెచ్చే నెల జీతంమీదనే ఆధారపడి గడుపుతూ వుంటారు. అతడు ముసలివాడైపోయాడనే కారణాన ఏ కంపెనీ అభివృద్ధికోసం తన జీవితం ధారపోశాడో ఆ కంపెనీవాళ్ళే అతన్ని ఉద్యోగంనుండి తొలగిస్తారు. ఈ చిత్రంలో మామూలుగా విలన్ వేషాలు వేసే ప్రాణ్ సానుభూతికరమైన తండ్రిపాత్ర ధరిస్తున్నాడు. ఇంకా నిగార్ సుల్తానా, అజిత్, జాగీర్దార్, రాధాకిషన్, లీలా మిశ్రా, సైనా, కామో, మాస్టర్ ఆనంద్ నటిస్తున్నారు. వాస్తవిక కథగల ఈ చిత్రంలో పాటలు, నృత్యాలు, హాస్యం అన్నీ ఉన్నాయి. సంగీత దర్శకుడు భోలాశ్రేష్ఠ.

రెండో చిత్రం లీలాచిట్నీస్ ప్రొడక్షన్స్‌వారి "ఆజ్ కీ బాత్". ఇందులో నేటి జీవితసమస్యలను చిత్రించే కథ వున్నది. చిత్రా, లీలాచిట్నీస్, సుందర్, జానీ వాకర్, బిపిన్ గుప్త, రతన్‌కుమార్, మనోమోహన్ కృష్ణ నటిస్తున్నారు. వీరుగాక అజిత్, ఉదయ్ అనేవారుకూడా మొదటిసారిగా ఇందులో నటిస్తున్నారు. "సోహాగ్ రాత్"లో చక్కని సంగీతం ఇచ్చిన స్నేహాల్ భట్‌కర్ దీనికి సంగీత దర్శకుడు. దర్శకత్వం లీలా చిట్నీస్ స్వయంగా నిర్వహిస్తోంది.

మూడవ చిత్రం ఎస్ ఆర్ ప్రొడక్షన్స వారి "చందూ." ఇది హాస్యచిత్రం. హాస్యనటుడు మజ్నూ దీనిలో నటించడమే కాక స్వయంగా దర్శకత్వం వహిస్తున్నాడు. మీనా షోరీ, ఓంప్రకాష్, గోప్, గులాబ్, ఇత్యాది మొదలగు హాస్య నటీనటవర్గం ఇందులో పాల్గొంటున్నది. బిపిన్, బాబుల్ అనే ఇద్దరు కొత్త సంగీత దర్శకులు ఈ చిత్రానికి సంగీతం కూరుస్తున్నారు.

నాల్గవ చిత్రం బి ఎస్ టి ఫిలిమ్స్ వారి "దీనార్". నిర్మాత భగవంత్ సింగ్ ఇస్సార్. దర్శకుడు దిగ్విజయబాలి. సంగీత దర్శకుడు శార్దూల్ క్వాత్రా. సాహస కృత్యాలతో నిండిన అరేబియన్ నైట్స్ వాతావరణంలో జరిగే కథ, మంచి సంగీతం ఇందులో ప్రధానంగా వుంటాయి. గీతాబాలి కథానాయికగా, నర్తకిగా ఈ చిత్రంలో పాల్గొంటున్నది. ప్రదీప్‌కుమార్, కేణుమకర్, కామో, ఎస్. నజీర్, మదన్ పూరి, మజ్నూ మున్నగువారు కూడా నటిస్తున్నారు. ఈ నాలుగు చిత్రాలతో చిత్రనికేతన్‌వారు ఈ యేడాదిలో ఘనవిజయం సాధింపదలచినట్లు కనిపిస్తోంది.

* * *

వైజయంతీమాల, ప్రదీప్ కుమార్ నాయికా నాయకులుగా నటిస్తున్న "సితారా" చిత్రానికి ఔట్‌డోర్ దృశ్యాలు తీసేందుకుగాను ఆలిండియా పిక్చర్స బృందంవారు కలకత్తాకు వెళ్ళారు. దర్శకుడు ఎస్ కె ఓఝా. ఫోటోగ్రాఫరు వి అవధూత్. ఇది మార్చి ప్రారంభంలో విడుదల అవుతుందట.

పి ఎస్ అరోరా స్వయంగా డైరెక్టు



"నాస్తిక్" హిందీచిత్రం రజతోత్సవ సందర్భంలో సులోచన్, మంజూ, ఇందిరా బన్సాల్, డైరెక్టరు నందలాల్ జస్వంతలాల్ మున్నగువారు.

చేస్తున్న అరేబియన్ కథాచిత్రం "హూర్-ఇ-అరబ్" షూటింగ్ చురుకుగా సాగుతున్నది. శశికళ, ప్రదీప్‌కుమార్, గోప్, ఓంప్రకాష్, సజ్జన్ ఇందులో నటిస్తున్నారు.

* * *

"గోల్డ్" చిత్రం నిర్మించిన కులదీప్ పిక్చర్స్‌వారు రంజిత్ స్టూడియోలో "టాంగ్ వాలీ" అనే మరొక చిత్రం ప్రారంభించారు. నిరూపరాయ్, బల్రాజ్ సాహ్నీ నాయికా నాయకులుగా నటిస్తున్నారు. జీవన్ కూడా నటిస్తున్నాడు. కథ, సంభాషణలు పండిట్ ముఖ్ రాంశర్మ వ్రాశారు.

కామధేను పిలిమ్స్‌వారి "శ్రీ నకద్ నారాయణ్" ఎమ్ ఎండ్ టి స్టూడియోలో తిరిగి ప్రారంభమైనది. ఏక్ థీ లార్కీ, ఏక్ దో తీన్ చిత్రాల్లో నటించిన మీనా షోరీ, మోతీలాల్ ఇందులో కలిసి నటిస్తున్నారు. తదితర నటీనటులు లీలామిశ్రా, బద్రీ ప్రసాద్, మురాద్, బేబీనాజ్, చమన్‌పురీ, నర్బదా శంకర్, ఆగా, శ్రీనాథ్, ఓంప్రకాష్. సంగీత దర్శకుడు వినోద్. పాటలు సంతోషి, కమర్ జలాలాబాదీ వ్రాశారు.

* * *

ఫిలిం నిర్మాతలు చాల నాళ్ళుగా వాడుతున్న ట్రేడ్ మార్కులపై సెన్సార్లు దాడి చేయడం ప్రారంభించారు. చిత్రాలలో స్త్రీ తారల వక్షములకు క్లోజప్ ఇవ్వరాదని సెన్సార్లు అభ్యంతరపెట్టడం అందరికీ తెలిసినదే. ఎ. ఆర్. కర్దార్ నిర్మాతగా వుంటున్న మ్యూజికల్ పిక్చర్స్‌వారి ట్రేడ్‌మార్కును తొలగించాలని సెన్సార్లు ఆజ్ఞాపించారు. ఈ ట్రేడ్ మార్కుతో ఆ కంపెనీవారు "జాదూ", "జీవన్ జ్యోతి" ఇదివరలో నిర్మించారు. కాని సెన్సార్లు ఇప్పుడు దానికి అభ్యంతరపెడుతున్నారు.

* * *

సొహ్రాబ్ మోడీ ఈ యేడాది తాను మూడు చిత్రాలు తీయనున్నట్లు ప్రకటించారు.

వీటిలో ఒకటైన "కుందన్"లో సొహ్రాబ్ మోడీ కాక నిమ్మి, సజ్జన్, మురాద్, బేబీ నాజ్ మొదలగువారు నటిస్తున్నారు. విక్టర్ హ్యూగో నవలను అనుసరించే ఈ చిత్రం స్క్రిప్టును పండిట్ సుదర్శన్ రచించారు. సంగీత దర్శకుడు గులాం మహమ్మద్. ఫొటోగ్రాఫరు ఎమ్. మల్హోత్ర.

* * *

ఎమ్. సదీక్ నిర్మిస్తున్న "ముసాఫిర్ ఖానా"లో శ్యామ, కరణ్ దివాన్ ప్రేయసీ ప్రియులుగా నటిస్తున్నారు. ఓంప్రకాష్, జానీ వాకర్, గోప్ మొదలగు హాస్యనటులు, బద్రీప్రసాద్, నిమ్మి, అమర్ మున్నగువారు కూడా నటిస్తున్నారు. "ఆర్ పార్" చిత్రంలో జాజ్ ధోరణి సంగీతం ఇచ్చిన ఓ. పి. నయ్యర్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్నాడు. ★

సినిమా వార్తలు

ఎ. వి. ఎమ్. వారు కొత్తగా ఒక పౌరాణిక చిత్రం తీయనున్నారు. ఈ చిత్రం 'శివకన్య' అనే హిందీచిత్రం కథను అనుసరించి వుంటుందని తెలుస్తోంది. ఈచిత్రంలో జానకి నటిస్తుంది. నాగయ్యగారు కూడా బుక్ అయ్యారు.

* * *

"సతీ సక్కుబాయి"తో విజయం సాధించిన శ్రీ రాజరాజేశ్వరీవారు "సతీ ఎహాళ్య" అనే మరొక పౌరాణిక చిత్రం తీస్తున్నారు. దీనికి ఇదివల ప్రారంభోత్సవం చేశారు.

* * *

సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుగారు స్వంతంగా ఒక ఆర్కెస్ట్రాను స్థాపించారు. ప్రారంభోత్సవ సమ



తాగినీవారి "అర్ధాంగి"లో సురభి బాలసరస్వతి

సినిమా వార్తలు

...యంలో పి. లీల ప్రార్థనగీతం పాడింది. పాకిస్థానీ గాయకుడు బడేగులాం అలీఖాన్, నాగయ్య మున్నగువారు హాజరయ్యారు.

* * *

"నేషనల్ ఆర్ట్‌"వారు తీస్తున్న కొత్త చిత్రాన్ని యోగానంద్ గారు డైరెక్టు చేస్తున్నారు. సముద్రాల జూనియర్ పాటలు, మాటలు వ్రాస్తున్నారు. కెమెరామన్ రహమాన్, కళాదర్శకుడు తోట, సంగీత దర్శకుడు టి. వి. రాజు.

* * *

ఈ యేడాది కానిస్ చలన చిత్రోత్సవంలో ప్రదర్శింపబడడానికి ఆర్. కె. ఫిలిమ్స్ వారి "బూట్ పాలిష్" చిత్రాన్ని భారత ప్రభుత్వం సెలెక్టుచేసింది.

* * *

ఈజిప్టులో హిందీచిత్రాలకు, ముఖ్యంగా "ఆన్" చిత్రానికి ప్రజల్లో వచ్చిన పలుకుబడి చూసి తమ స్వంత చిత్రాలు దెబ్బతినగలవనే భయంతో ఈజిప్షన్ నిర్మాతలు భారతీయ చిత్రాలను ఎగ్జిబిటర్లచే నిషేధింపజేయాలని ఉద్యమం ప్రారంభించినట్లు ఇటీవల మధ్య ప్రాచ్యంలో పర్యటించివచ్చిన నిర్మాత ఎ. ఆర్. కర్దార్ తెలియజేశారు.

* * *

"శ్యాంచీ ఆయీ" చిత్రానికి భారత ప్రభుత్వ బహుమానం పొందిన మరాఠీ నిర్మాత పి. కె. ఆత్రే వినోబా భావేగారి "భూదాన యజ్ఞం" ఉద్యమాన్ని సినిమా తీయాలని ఆలోచిస్తున్నారట.

* * *

1954 లో భారతదేశంలో వివిధభాషల్లో 272 చిత్రాలు తయారైనవి. ఆ క్రిందటియేడు 262 మాత్రమే తయారైనవి. 1954 సం॥ చిత్రాల్లో అన్నిటికంటె బాగా సొమ్ము చేసుకున్న చిత్రం ఫిల్మిస్తాన్‌వారి "నాగిన్" అట. 1953 లో కంటె 1954 లో చిత్రాలపై రాబడి నూటికి 10 వంతులు పెరిగినదట.

* * *

ఎమ్ జి ఎమ్ కంపెనీవారు గౌతమబుద్ధుని జీవితకథ సినిమా తీస్తారట. ఈ చిత్రం సినిమాస్కోప్, పర్స్పెక్టా స్టీరియో ఫోనిక్ సౌండ్ పద్ధతిలో ఉంటుందట. స్క్రిప్టు వ్రాసిన రాబర్ట్ హార్డీ ఆండ్రూస్ బుద్ధుని జీవితవిశేషాలు సేకరించేందుకు జపాన్, థాయ్‌లాండ్, కంబోడియా, లావోస్, బర్మా, సిలోన్, ఇండియా దేశాల్లో పర్యటించాడట.

★

"మిస్సమ్మ" పై ప్రేక్షకుల అభిప్రాయాలు

"మణిపూస"

ఎన్నాళ్ళనుండో ఎదురుచూస్తున్న విజయావారి "మిస్సమ్మ" చిత్రము నేటికి మన ఆంధ్రదేశములో విడుదలై అందరి ఆదరాభిమానములను చూరగొన్నదనుటలో సందేహములేదు. చిత్రము నిడివి 17 వేలకు మించియున్ననూ, హాస్యరసభరితమగుట వలన ప్రేక్షకులకు విసుగును కల్గించకుండా, ఆనందపరవశులను చేసింది. జమీందారు మేనల్లుడైన ఎ. వి. రాజుగా ఎ. నాగేశ్వరరావు హాస్యనటనా చాతుర్యములో ప్రజలను అలరించినారు. మిగతావారందరు బాగా నటించారు.

పాటలు అన్నీ కూడా మనోరంజకముగా వున్నాయి. ముఖ్యముగా ఎ. ఎమ్. రాజా



"అంధేర్ నగరీ చౌపట్ రాజా" అనే హిందీచిత్రంలో మంజూ, అమర్‌నాథ్. సంగీత దర్శకుడు అనిల్ బిశ్వాస్ భార్య ఆశాలతా బిశ్వాస్ ఈ చిత్రం నిర్మిస్తున్నది.

పాడిన "కావాలంటే ఇస్తానే", "తెలుసుకొనవె యువతీ" "ఆడువారి మాటలకు అర్థాలే వేరులే" అన్న పాటలు చాలా బాగున్నాయి. ఇక పి. లీల పాడినవన్ని చాలా బాగా ఉన్నాయని చెప్పక తప్పదు. ఇందుకు ముఖ్యముగా సంగీత దర్శకులైన యస్. రాజేశ్వరరావుగారిని అభినందించాలి సంగీతమే ఈ చిత్రానికి మెరుగు తెచ్చిపెట్టింది

దర్శకులు ప్రసాద్ గారు తీసిన చిత్రాలన్నిటిలోనూ ఇది మణిపూస అని చెప్పక తప్పదు. మార్కుస్ బార్ట్లేగారి ఛాయాగ్రహణము అన్నిటికంటె అత్యద్భుతముగా వున్నది.

జి వి. వి. నరసింహారాజు,

భీమవరం.

* * *

"అద్భుత సృష్టి"

విజయవారి "మిస్సమ్మ" ఒక అద్భుత సృష్టి. చక్కని కథ, సరసమైన సంభాషణలు, కర్ణరసాయనమైన సంగీతముతో ప్రేక్షకుల నెక్కువగా ఆకర్షించినది. వీరి పూర్వపు చిత్రములకంటె, ఇది ఎక్కువగా ప్రజల అభిమానమును పొందగలదు చిత్రం ఆదినుంచి తుదివరకు కడుపుబ్బ నవ్వించి, ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టినది. పాత్రధారులందరు ఒకరినిమించి వేరొకరు నటించి వారివారి నటనా ప్రతిభను ప్రదర్శించిరి. డిటెక్టివ్ రాజుగా ఏ నాగేశ్వరరావు చక్కగా నటించెను మేరీగా సావిత్రి గొప్పగా అభినయించి చిత్రసీమలో వేరొక మెట్టు సాధించగలిగినది రాజేశ్వరరావు గారి సంగీతము పామరజనమునకు కూడ హాయి గొల్పినది.

ఎమ్. వి చైతన్య

—గుంటూరు.

* * *

విజయవారి "మిస్సమ్మ" కేవలం వినోద చిత్రం మాత్రమే. నిర్మాతలు వినోదానికి తగిన కథావస్తువును ఎన్నుకొన్నారే గాని ఏ సాంఘిక సమస్యా యీ చిత్రంలో పరిష్కరించడానికి ప్రయత్నించలేదు. పరమత ద్వేషం కూడదని మాత్రం యీ చిత్రం చూచాయగా చెబుతోంది వినోదాన్నివ్వడమే చిత్రాల లక్ష్యమైతే విజయవారు అభివందనీయులు.

చక్రపాణి మాటలు చక్కగా వ్రాశారు. పాటలు కూడ కథావస్తువుకు తగినట్లుగా నాగేంద్రరావు చక్కగా కూర్చారు మిస్టర్ రావుగా రామారావు, మిస్ మేరీగా సావిత్రి బాగా నటించారు రాజు, సీత పాత్రలలో నాగేశ్వరరావు, జమునలు రాణించడానికి అవకాశాలు తక్కువ రేలంగి తనపాత్రను చక్కగా పోషించాడు.

నూకల రామానుజరావు

—భీమవరం.

* * *

"మిస్సమ్మ బొట్టు"

విజయావారి "మిస్సమ్మ" అనుకున్నంత బాగుండలేదు. కథ అంతా "చాచా" లాగ వుంది. మిస్ మేరి "కేతలిక్సు"కు చెందిన అమ్మాయి. కేతలిక్సులో ప్రతివారు బొట్టు పెట్టుకుంటారు కాని కథలో మిస్ మేరికి బొట్టుఅంటే అసహ్యమని చూపించారు. అది చాల అసంభవము

డి.. యేసుదాసు,

—ఏలూరు.

* * *

విజయావారి "మిస్సమ్మ" విజయవంతంగా సాగుతుందనటంలో అతిశయోక్తి లేదు. ఉద్యోగంకోసం భార్యాభర్తలుగా నటించిన యిద్దరు యువతీ యువకులు చివరకు నిజంగానే భార్యాభర్త లవుతారు కథా సారాంశ మింత చిన్నదైనప్పటికీ ప్రసిద్ధ కథకులు 'చక్రపాణి' కథను రసవత్తరంగా అల్లేరు. ఎన్. టి. రామారావు బాగా నటించాడనే చెప్పాలి దానికితోడు సావిత్రి తన పాత్ర నిర్వహణలో చూపిన సౌలభ్యం చాలవరకు విజయవంతమైంది. ఈ చిత్రంతో ఆమెకున్న పూర్వపు కీర్తి మెరుగులు రావచ్చు.

రాజేశ్వరరావుగారి సంగీతం, గోఖలే గారి ఆర్టు బాగానే ఉన్నాయి. పాటలలో "బృందావన మది అందరి దీ"... "రావోయి చందమామ" "ఏమిటో ఈ మాయా" అనే పాటలు తదితర వాటికంటె బాగున్నాయి రేలంగి వంట, నాగేశ్వరరావు సంగీతం నేర్చుకొనడంవంటిదృశ్యాలు గూసిన ప్రతివారికీ నవ్వొస్తుంది. మొత్తం మీద ఈ చిత్రం హాస్యరసప్రధానమైందని చెప్పకోవచ్చు

అంత ఎత్తు డాబామీంచి పడిపోయినా రావుకు చిన్న దెబ్బైనా తగలలేదు కారణం ఏమిటి? మేరీని పంతులమ్మ అనడం తప్ప ఆమెను ఒక్కసారైనా క్లాసులో ఎందుకు చూపలేదు? డేవిడ్ దిగాడని మేరీ తలితండ్రులు స్టేషన్ పేరైనా చదవకుండా దిగుతారా? అనే చిన్న చిన్న సందేహాలు కలిగినా అవి కథాగమనాన్ని ఆటంకపర్చవు. ఈ చిత్రంలో 'ప్రసాద్'గారి దర్శకత్వంలోని ప్రతిభా, సామర్థ్యాలు ప్రేక్షకులకు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి

గొల్లపూడి సుబ్బారావు

—విశాఖపట్నం.

* * *

చిత్రం చాలా బాగుంది రావుగా రామారావు, డిటెక్టివ్ రాజుగా నాగేశ్వరరావు ఉత్తమంగా నటించి చిత్రాన్ని రాణింపచేశారు దేవయ్యగా రేలంగి హాస్యనటన చిత్రానికి మెరుగుపెట్టింది మేరీగా సావిత్రి, సీతగా జమున, జమీందారుగా రంగారావు, భార్యగా ఋష్యేంద్రమణి చక్కగా నటించారు. పాటలలో 'తెలుసుకొనవె యువతీ' అన్న పాట ఆకర్షణీయంగాఉంది: ప్రసాద్ గారి దర్శకత్వం బాగుంది.

నరిశేపల్లి లక్ష్మినారాయణ,

—గుంటూరు. ★

★ టామ్‌సాయర్ ప్రపంచయాత్ర ★

(46-వ పేజీ తరువాయి)

ఇంకా బోలెడునరకుఉన్నది. జంతువులు బాధపడుతున్నందుకు నాకుఅట్టే విచారంకలగలేదుగాని, మా బట్టలు ఈ విధంగా కొల్లగొట్టబడినందుకు విచారంకలిగింది. ఇకమాకు మిగిలినవల్లా ప్రొఫెసరుగారి బట్టలే. చూట్టానికి బాగానేవున్నాయిగాని తొడుక్కుని నలుగురిలోకీ వెళ్లడానికి అట్టే బాగు లేవు. మా సైజువేరు, ప్రొఫెసరుసైజువేరు. లాగులూ, చొక్కాలూ మా వొంటిమీద లొడుగుల్లాగ తయారైనాయి. అయితే ప్రొఫెసరుపెట్టెలో సూదులూ, దారం వున్నాయిగనక జిమ్ ఆబట్టలు కొద్దిగా కత్తిరించి మాకు సరిపడేటట్టు కుడతానని చెప్పాడు. అలాగే కానివ్వమన్నాము.

(ఇంకా వుంది)

బ్రిటిష్ నటీనటుల నటనా ప్రదర్శనాలు

ప్రసిద్ధ బ్రిటిష్ నటీమణి డేమ్ సిబిల్ థార్న్డైక్ క్రిందటినెల ఆఖరులో మద్రాసు వచ్చి కొన్ని ప్రదర్శనాలిచ్చినది

సర్ లెవిస్ కాసన్ కూడా ఆమెలో వచ్చి ప్రదర్శనాల్లో పాల్గొన్నారు

గొప్ప నాటక పారస్యతం, అద్వితీయమైన స్టేజి సంప్రదాయాలు కలిగిన బ్రిటిష్ నాటక ప్రదర్శనాలను చూసి ఆనందించే అవకాశం మనదేశంలో అరుదుగా మాత్రమే లభిస్తుంది అందులో డేమ్ సిబిల్ అనేక సంవత్సరాలుగా ప్రథమశ్రేణి నటిగా పరిగణింపబడుతున్నది ఆమె ఇచ్చిన 'రిసైటల్స్' ద్వారా బ్రిటిష్ స్టేజి విశిష్టత యావత్తూ వ్యక్తమైనది

జనవరి 25 సాయంత్రం ఎస్మార్ విజయం థియేటరులో మొదటి ప్రదర్శనం జరిగింది డేమ్ సిబిల్ రెండు ప్రాచీన ఇంగ్లీషు గీతాలతో 'రిసైటల్' ప్రారంభించినది తరవాత షేక్స్పియర్ రచితమైన హెన్రీ *VIII* నాటకంనుండి కొన్ని భాగాలను డేమ్ సిబిల్, సర్ లెవిస్ ఇరువురూ నటించారు ఎనిమిదవ హెన్రీచేత పదభ్రష్టుడుగా చేయబడిన కార్డినల్ వుల్సీ ప్రసంగాన్ని సర్ లెవిస్ చదివారు భర్తృప్రేమకు దూరమై, విడాకులివ్వబడి, మరణశయ్యపైఉన్న కాథరిన్ రాణిగా డేమ్ సిబిల్ అద్వితీయమైన అభినయ కౌశలం చూపించింది తృటిలో ముఖకవళికలను మార్చుకొని పాత్రలో తాదాత్మ్యం పొందడమనే విద్యపై ఆమెకుగల అధికారం ఆశ్చర్యజనకమైనది రంగం నిరలంకృతంగా వున్నా, ఆమె తన మామూలు దుస్తుల్లోనే వున్నా నాటకీయ భ్రాంతి సంపూర్ణంగా కలిగింది

*


తరవాత ఆమె గ్రీక్ నాటకకర్త యూరిపైడ్స్ వ్రాసిన "ట్రోజన్ వుమన్" నుండి ఒక భాగాన్ని, క్లెమెన్స్‌డేన్ వ్రాసిన ఒక నాటకం భాగాన్ని అభినయించింది తరవాత ఇరువురూ కలిసి షేక్స్పియర్ నాటకం "ట్వెల్త్‌నైట్"లో ఆర్సినో,వయోలాల సంభాషణలను ప్రదర్శించారు షెల్లీపద్యం "స్పిరిట్ ఆఫ్ నైట్" బ్రౌనింగ్, హిల్లేర్ బెలాక్, డైలాన్ థామస్ మున్నగువారి పద్యాలు చదివారు ఆఖరున బెర్నార్డ్‌షా వ్రాసిన"సెంట్ జోన్"నుండి జోన్ ప్రసంగాన్ని డేమ్ సిబిల్ ప్రదర్శించింది

ముఖ్యంగా షేక్స్పియరియన్ భాగాల్లో డేమ్ సిబిల్ ప్రజ్ఞావిశేషం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది ★



చేతన్ ఆనంద్ నిర్మిస్తున్న హాస్యచిత్రం "జోరుకా భాయ్"లో విజయ్ ఆనంద్ (దేవ్ ఆనంద్ తమ్ముడు) ఖాన్, మోహిని, జానీవాకర్


Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



హైద్రాబాదు నగరంలో మూసీ నదికి యీవలి ఒడ్డున నున్న హైకోర్టు భవనం

—ఫొటోలు ఎన్ ఎస్ నాయుడు

హైదరాబాదు నగరంలో మూసీ నదికి ఆవలి ఒడ్డున నున్న ఉస్మానియా ఆసుపత్రి



అమ్మకమునకు సిద్ధముగా నున్నది.

మంచీ-చెడూ



రచయిత:

'శారద'

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నుండి పునర్ముద్రితము

మీ కాపీ నేడే రిజర్వు చేసుకోండి.

వెల రు. 2-0-0

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు 1.